# అందఱూ ఒకప్పుడు బ్రాహ్మణులే !

తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం

హైదరాబాదు

ఫిబ్రవరి-మార్చి ౨౦౧౧

Andaŕú okappuđu Bráhmańulé (ALL WERE BRAHMINS ONCE UPON A TIME)

*An Anthology of essays posted on his blog http://kalagooragampa.blogspot.com during the period Feb-Mar. 2011.*

By

TADEPALLI LALITHA BALA SUBRAHMANYAM

**Online Edition** : MARCH 2011.

© The Author

**PRICE :** None for electronic downloads.

PUBLISHED FROM HYDERABAD, ANDHRA, INDIA

# మన్యమానము

*ప్రియమైన పాఠక దేవుళ్ళకు నమస్కారాలు.*

ఆర్యులారా ! *“అందఱూ ఒకప్పుడు బ్రాహ్మణులే”* అనేది ఈ పుస్తకపు శీర్షిక కాదు. ఇది చాలాకాలంగా నా మనసులో ఉన్న మాటే. పెక్కు సంవత్సరాల ఆసక్తి, అధ్యయన- ఆలోచనల ఫలితంగా నాకు ఈ అభిప్రాయం ఏర్పడింది. నేను ఏమేం ఆలో చించానో అదంతా ఈ వ్యాససంపుటిలో వెల్లడించాను. ఎవఱినీ ఒప్పించాలనే ఉద్దేశం గానీ, వాదించాలనే దూకుడు గానీ నాకు లేవు. నాకు తెలిసినవి నాకు చేతనైన శైలిలో వ్యక్తీకరించానంతే ! ఎక్కడైనా వ్యక్తీకరణ సరిగా, సజావుగా, సక్రమంగా లేకపో యినా, అర్థం కాకపోయినా, పొంతన కుదఱకపోయినా, అదంతా నా వ్యక్తీకరణలోపమే తప్ప విషయం కొట్టిపారేయదగినది మాత్రం కాదని మనవి.

ఇది నాకున్న వనరులతో వ్రాశాను. అయినా చాలా ఖాళీలు మిగిలిపోయాయి. Knowledge is always either collabora tive or dialectical. It can never be individualistic. కనుక నా అభిప్రాయాన్ని ఆమోదించేవారంతా నా పరిమితుల్ని సహించి, ఈ పరిశోధనలో తమవంతు చేయి కూడా వేసి మఱిన్ని ఆధారాలు సంపాదించవలసిందిగా కోరుతున్నాను.

బ్రాహ్మణుల ప్రత్యేకతను కూలద్రోస్తున్నాననుకొని కొందఱు బాధపడొచ్చు. బ్రాహ్మణుల ప్రత్యేకత దానంతట అదే నశించి చాలా కాలమైంది. నాకు ఆ విషయమై చింత లేదు. ఎందుకంటే ఒకప్పుడు బ్రాహ్మణులకే పరిమితమనుకొన్నవెన్నో ఈనాడు అందఱి సొత్తూ అయ్యాయి. చదువుకుని అందఱూ ఈరోజు బ్రాహ్మణులుగానే మారుతున్నారు. బ్రాహ్మణ సంస్కృతి ఒకవిధమైన విశ్వ జనీకరణ (universalization) కి గుఱైంది. అందఱినీ ఆధ్యాత్మికంగా బ్రాహ్మణులుగా మార్చడంలో తప్పేమీ లేదు. అంతకంటే ముందు తప్పదోవ త్రొక్కుతున్న బ్రాహ్మణుల్ని బ్రాహ్మణులుగా నిలబెట్టడం కూడా చాలా అవసరం.

ఈ వ్యాసాల్ని సహృదయంతో ఆదరించి, చదివి ఆశీర్వదించిన అంతర్జాల పాఠకులందఱికీ నిండుమనస్సుతోటి నెనర్లు.

*హైదరాబాదు* — *ఇట్లు*

*౨౭ మార్చి ౨౦౧౧* — *బుధజన విధేయుడు*

*వికృతి-ఫాల్గుణం* — *భవదీయుడు*

తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం

# విషయసూచిక


| | |
|---|---|
| ౧. మన్యమానము | 3 |
| ౨. మొదటి అధ్యాయం | 5 |
| ౩. రెండో అధ్యాయం | 7 |
| ౪. మూడో అధ్యాయం | 9 |
| ౫. నాలుగో అధ్యాయం | 12 |
| ౬. ఐదో అధ్యాయం | 14 |
| ౭. ఆఱో ఆధ్యాయం | 18 |
| ౮. ఏడో అధ్యాయం | 22 |
| ౯. ఎనిమిదో అధ్యాయం | 25 |
| ౧౦. తొమ్మిదో అధ్యాయం | 27 |
| ౧౧. పదో అధ్యాయం | 30 |
| ౧౨. పదకొండో అధ్యాయం | 34 |
| ౧౩. పన్నెండో అధ్యాయం | 36 |
| ౧౪. పదమూడో అధ్యాయం | 39 |
| ౧౫. పధ్నాలుగో అధ్యాయం | 41 |
| ౧౬. పదిహేనో అధ్యాయం | 44 |
| ౧౭. పదహాఱో అధ్యాయం | 48 |

# అందఱూ ఒకప్పుడు బ్రాహ్మణులే !

## మొదటి అధ్యాయం

మానవ సమూహాలకు పరస్పర సంపర్కం (mutual contact) లోపించి భూమండలం మీద విసిరేసినట్లుగా అక్కడొక గుంపూ, ఇక్కడొక గుంపుగా బతికిన అతిప్రాచీనకాలంలో వారి మానసిక ఎదుగుదలా, సంస్కారమూ కొద్దిపాటి హెచ్చుతగ్గులతో ఎల్లెడలా ఏకరూపం (uniform) గా ఉండేవని నా ఊహ. మానవులు సమూహాలుగా జీవించడం మానేసి కుటుంబాలుగానూ, వ్యక్తులుగానూ పరిణమించినాక ఒకే సమాజంలో రకరకాల సంస్కృతులూ, సంస్కారాలూ, వాటిల్లో హెచ్చుతగ్గులూ ఏర్పడ్డానికీ, అవి భద్రం (secure) గా కొనసాగడానికీ ఎక్కువ అవకాశమేర్పడిందనుకుంటా. మనుషులు సామూహికంగా బతకడం ఆరుబయట (open) జీవించడం లాంటిదనుకుంటే, కుటుంబాలుగా బతకడం గదిలో తలుపేసుకుని బతకడం లాంటిది. దాచుకున్నకొద్దీ ఇంకా దాచుకోవాల్సింది పెఱిగిపోతూనే ఉంటుంది. ఆ విధంగా, ఆరుబయట కనిపించని లక్షణాలు కొన్ని గది లోపల అభివృద్ధి చెందుతాయి. మన కులాచారాలూ, సంస్కృతులూ ఇలా గదిలోపల పెంపొందినటువంటివి. దీన్ని ఒక్క ముక్కలో తెలుసుకోవచ్చు. అదేమంటే కుటుంబవ్యవస్థ దెబ్బదింటే కులాలు కూడా దెబ్బదింటాయి. కులాలూ, వర్గాలూ పోవాలంటే ముందు కుటుంబ వ్యవస్థ పోవాలి. ఇది ఉండాలంటే అవి కూడా ఉండాలి. ఇది ఉన్నంత కాలమూ అవి కూడా ఉంటాయి.

ఒక వ్యాపారం చిన్న స్థాయిలో ఉన్నంతవఱకూ ఎక్కువ సిబ్బంది (staff) అవసరం లేదు. యజమానుడితోనూ, భాగస్థుల (partners) తోనూ, ఉద్యోగులతోనూ కలిపి నలుగుఱైదుగుఱు సరిపోతారు, యావత్తు నిర్వహణ బాధ్యతలకిన్నీ ! ఆ తొలి దశలో అందఱూ అన్ని పనులూ చేస్తారు. అంతే గానీ "ఇది నీ పని, అది నా పని" అని ముందే అనుకోరు. అదే, వ్యాపారం బాఘా పెఱిగి పెద్దదయితే అనుకోవాల్సి వస్తుంది. అలాగే సమాజం చిన్నదిగా ఉన్నంతకాలమూ మనలో కులాలు ఉండి ఉండవు. అది పెద్దదయ్యాక దాన్ని నడపడానికి మూడు విషయాలు అవసరమవుతాయి. ఒకటి అదనపు వనరులూ (additional resources), వాటి గుఱించిన అదనపు పరిజ్ఞానమూ (additional knowhow), దాన్ని అమల్లో పెట్టడానికి ప్రత్యేక శిక్షణా, నైపుణ్యమూ (special skills and training) గల మనుషులూ. ఆ క్రమంలో మొట్టమొదట ఏర్పడ్డ కులం క్షత్రియులు కావచ్చు. బ్రాహ్మణులు అంతకు ముందే ఉన్నారు. వాస్తవానికి ఆ పేరు గల ప్రత్యేకకులం అప్పుడు లేదు. ఎందుకంటే అందఱూ బ్రాహ్మణులే.

అనేక కులాలు ఏర్పడ్డాక వాటి నుంచి ఈ తొలుతటి వర్గాన్ని విచక్షించి చూపడానికి "బ్రాహ్మణ" పదాన్ని కొత్తగా కనుక్కోవాల్సి వచ్చింది. "ఈ పేరు ఎలా పెట్టారు ?" అనడిగితే యజ్ఞం అని అర్థమిచ్చే "బ్రహ్మన్" శబ్దం నుంచి నిష్పాదించి బ్రాహ్మణులన్నారు. ఎవఱూ తమకు తామే బొడ్డు కోసుకొని పేరు పెట్టుకోరు. ఇతరులు వారి జీవితాల్లో ప్రవేశించినాక తమకంటూ ఒక ప్రత్యేక మైన పేరు అవసరమౌతుంది. "మఱి యజ్ఞాలు బ్రాహ్మణులు మాత్రమే చేస్తారు గదా ! మిహతావారు చేయరు గదా ! అంటే ఈ భేదం మొదట్నుంచి ఉందేమో ! బ్రాహ్మణశబ్దం అప్పుడు కూడా అందఱికీ వాచకం కాదేమో ! కొందఱికే అది సూచక మేమో" ననే సందేహం రావచ్చు. వాస్తవమేంటంటే ప్రాచీన కాలంలో యజ్ఞాలు అందఱూ చేసేవారు. ఇప్పట్లాగా ఆ రోజుల్లో దేవతలకు అష్టోత్తర శతనామాలతోనూ, సహస్ర నామాలతోనూ పూజలు చేయడమనే ఆచారం లేదు. పూజలనేవి కలియుగ జనం కోసం వేదవ్యాసుడు భగవదుపాసనల్ని సరళీకరించి, క్లుప్తీకరించి పురాణాల ద్వారా ప్రచురపఱిచినటువంటివి. అంతకు ముందు భగవంతుణ్ణి పూజించడానికి యజ్ఞాలూ, యాగాలూ, హోమాలూ తప్ప వేఱే మార్గం ఎఱుగరు. సమాజం పెఱిగి పోయి మనుషులు వృత్తుల పరంగా విడిపోయినాక వేదసంస్కృతభాష కూడా వ్యవహారదూరమై అందఱికీ అర్థం కావడం మానేసిన కాలం నుంచి యజ్ఞాలు కావాలంటే చేయించడానికి ప్రత్యేకంగా ఒక వర్గం కావాల్సి వచ్చింది. దురదృష్టమేమంటే వేదవ్యాసుడు అంతగా సరళీకరించిన పూజల్ని చేయించడానిక్కూడా ఈరోజు మనకు పురోహితుడవసరమవుతున్నాడు. మనంతట మనం చేసుకోలేకపోతున్నాం. అంటే ఇప్పుడు మళ్ళీ మనకింకో వేదవ్యాసుడు కావాలన్నమాట. సరే ! అది విష యాంతరం. చెప్పొచ్చేదేమంటే అందఱూ యజ్ఞాలు చేసేవారు గనుక ఆ రోజుల్లో అందఱూ బ్రాహ్మణులే.

మొదట ఏర్పడ్డ కులం క్షత్రియులనుకున్నాం. "క్షత్రియులే ఎందుకవ్వాలి ? వైశ్యు లెందుక్కాకూడదు ?" అనడిగితే, మన పూర్వగ్రంథాల ననుసరించి వైశ్యుల కులధర్మాలు కృషీ, పశుపాలనమూ మఱియు వాణిజ్యమూను. రక్షణా, భద్రతా లేకుండా కృషి (వ్యవసాయం) సాధ్యం కాదు. పశుపాలనం సాధ్యం కాదు. వాణిజ్యం అంతకంటే సాధ్యం కాదు. రక్షణ దేన్నుంచి ? దొంగల నుంచి, శత్రువుల నుంచి, అడవిజంతువుల నుంచి ! అయితే ఇక్కడొక క్రమాన్ని అవ గతం చేసుకోవాలి. ముందు పంటలు పండించడమూ గట్రా జఱిగి ఆ తరువాత వాటికి రక్షణ ఏర్పఱచడం జఱగలేదు. ఆయా తెగల నాయకుల రూపంలో రక్షణే మొదట ఏర్పడింది. ఆ తరువాత దాన్ని ఆసరాగా చేసుకొని కృషి వాణిజ్యాదులు పెంపొందాయి. వేటాడే కాలంలో కూడా ఆ నాయకులు మానవజాతికి ఉన్నారు. ఆధునిక కాలంలో కూడా ఇలాగే జఱగడాన్ని గమనించవచ్చు. ఒకచోట వ్యాపారం అభివృద్ధి చెందినాక అక్కడ పొగబండ్ల కూడలి (Railway Junction) కట్టరు. ముందు ఒకచోట ఒక పెద్ద పొగబండ్ల కూడలి కట్టినాక దాన్ని ఆలంబనగా చేసుకొని దాని చుట్టూరా ఒక వ్యాపార పట్టణం వెలుస్తుంది.

సంక్షోభాల్లో సైతం సమాజాన్ని చావకుండా బతికించాలంటే అదనపు సంపద (additional wealth) కావాలి. దాన్ని పోగు జేసే బాధ్యత వైశ్యులది. ఇప్పట్లాగా ఆ రోజుల్లో సంపదంటే డబ్బూ, బంగారమూ కావు. పశువులూ, పంటలూ వీటినే సంపద గా భావించేవారు. అసలు పోగుజేయాలనే ఆలోచన ఎప్పుడొస్తుంది ? గతానుభవాల్ని నెమరు వేసుకొన్న మనిషి భవిష్యద్ అనిశ్చితుల (future uncertainties) గుఱించి ఆలోచించడం మొదలుపెట్టినప్పుడు. సమాజంలో సంపదని ఉత్పత్తి చేసే

ప్రాథమిక సాధనాలే కృషీ, పశుపాలనా, వాణిజ్యమూ. భవిష్యత్తు గుటించి ఆలోచించడంతో సహా ఇవన్నీ మానవజాతి చరిత్ర లో చాలా ఆలస్యంగా ప్రవేశించిన అంశాలు. రక్షణే మొట్టమొదటిది. మనిషి తపించే అంశాల్లో ఆహారానికీ, రక్షణకీ సమాన ప్రాధాన్యం ఉంది. కనుక "క్షత్రియులే తొలుదొల్త బ్రాహ్మణుల నుంచి విడిపోయిన కులం" అనడానికి అభ్యంతరం ఉండ దనుకుంటాను. అయితే తొలుదొల్తటి బ్రాహ్మణుల్లో కొంతమంది క్షత్రియకులంగా ఏర్పడుతూ ఏర్పడుతూ ఉన్న ఆ మారు మూల సంధికాలం (remote transition period) తాలూకు చారిత్రిక నమోదులేవీ ఈరోజు మనకు లేవు. కానీ ఆ సాంఘిక పరిణామం జటిగిపోయిన చాలా కాలానికి మనువు తన ధర్మశాస్త్రంలో తొమ్మిదో అధ్యాయంలో

*............................................ క్షత్రం హి బ్రహ్మసంభవమ్ || (IX-320)*

*అద్భ్యో౽ గ్నిర్బ్రహ్మతః క్షత్రమ్......................................... | (IX-321)*

*(ఏ విధంగానైతే నీటినుండి నిప్పు పుట్టిందో అదే విధంగా బ్రాహ్మణుడి నుంచే క్షత్రియుడు ఉద్భవించాడు)*

అని వాక్రుచ్చినదాన్ని మనం ఆధారంగా గ్రహించడానికి అవకాశం లేకపోలేదు. మనువే మటొకచోట క్షత్రియుల నుంచి ఇతరకులాలు ఉద్భవించాయని కూడా వ్రాశాడు.

## రెండో అధ్యాయం

ఇందుకొక ఆధారం ఏమంటే రెండో, మూడో మినహాయిస్తే బ్రాహ్మణుల గోత్రాలూ, క్షత్రియుల గోత్రాలూ ఒకటే. వీరు ఒకే పూర్వీకుల సంతానం అనడానికి ఇదొక నిదర్శనం. కానీ వీరు శాకాహారులు. వారు మాంసాహారులు. ఇదెలా సాధ్యమయింది ? అనే ప్రశ్న తలెత్తుతుంది. బ్రాహ్మణుల నుంచి విడిపోయినాక క్షత్రియులు మాంసాహారులుగా మారారా ? అనడిగితే, లభిస్తున్న ఆధారాల్ని బట్టి కాదని చెప్పాల్సి ఉంటుంది. వారూ, వీరూ మొద ట్నుంచీ మాంసాహారులుగానే ఉన్నారు. క్షత్రియులు కొత్తగా మారిందేమీ లేదు. ఉన్నవాళ్ళు ఉన్నట్లే కొనసాగుతున్నారు. కానీ మధ్యలో బ్రాహ్మణులే మారిపోయారు, శాకాహారులుగా ! ఎప్పుడు మారారు, ఎందుకు మారారు, ఎవఱు మార్చారు ? ఈ వివరాలు మాత్రం మనకు ఈ రోజుకూ తెలియవు. కానీ మన ఊహను కొంత పదును పెట్టడానికి అవకాశం లేకపోలేదు. అయితే గడిచిన అయిదువేల సంవత్సరాలుగా మట్టుకు బ్రాహ్మణులకు మాంసాహారం నిషిద్ధంగానే ఉన్నట్లు కనిపిస్తున్నది, మానవీయ ధర్మశాస్త్రాది ఆకరాల (sources) ని బట్టి చూస్తే ! యజ్ఞయాగాదుల సందర్భంలో దేవతా ప్రసాదంగా తప్ప మటో రకంగా బ్రాహ్మణులు మాంసభక్షణ చేయడానికి మనువు అనుమతించలేదు.

కులాలేర్పడి కొన్నివేల సంవత్సరాలైపోయినాక "మన గోత్రాలూ, క్షత్రియుల గోత్రాలూ ఒకటే కావడానికి కారణమేంటో ?" అని బ్రాహ్మణ మేధావులు మథనపడి ఉండొచ్చు. మథనపడడమనే అనాలి. ఎందుకంటే, ఏదైనా ఒక మానవ సమూహం తమ

లాంటిదని గానీ, తమతో సమానమనీ గానీ, తమకంటే గొప్పదని గానీ బ్రాహ్మణులు ససేమిరా అంగీకరించరు. రాజుల నాశ్ర యించి జీవిస్తున్నప్పటికీ జాతిపరంగా ఆ రాజుల కంటే తామే గొప్పవారమని ఆ రాజుల మొహాన్నే నిష్కర్షగా నిర్మొహ మాటం గా చెప్పేసేవారు. మొండివాడు రాజుకంటే బలవంతుడన్న సామెతగా ఆ రాజులు "అయ్యా ! సరే" అని అంగీకరించి నోరు మూసుకుని ఉండేవారు. ఇందుకు రెండుమూడు కారణాలున్నాయి. బ్రాహ్మణులతో పోలిస్తే రాజుల్లో విద్యాగంధం తక్కువ. ఆసక్తీ తక్కువే. అందుకని మంచీ, చెడూ ఏది తెలుసుకోవాలన్నా అన్నింటికీ బ్రాహ్మణుల మీదనే ఆధారపడి ఉండే వారు. ఇది గాక రాజపుత్రులందఱికీ వంశపారంపర్యంగా బ్రాహ్మణులే గురువులు. అందుచేత గురువర్ణాన్ని తక్కువచేసి మాట్లాడితే మహా పాపం చుట్టుకుంటుందని భయపడేవారు. అలాంటి ఈ రాజులు తమ గోత్రాలే కలిగి ఉండడం బహుశా ఒక దశలో బ్రాహ్మణ మేధావులకు ఒక దిక్కుతోచని నిగూఢం (mystery) అయికూర్చుంది.

ఏ సమస్య వచ్చినా మనవాళ్ళు ముందు పురాణాలు శోధిస్తారు. ఆ సమస్య సామాజికమా ? వైజ్ఞానికమా ? ఆధ్యాత్మికమా ? అనే విచికిత్స లేదు. ప్రతీదానికీ ఒక పురాణకథ చెప్పేస్తే అంతా అర్థమయిపోయినట్లే. చిక్కు తీఱిపోయినట్లే. అలా మన దేశంలో ప్రతి చిన్నాచితకా దేవాలయం వెనకా ఒక స్థలపురాణాన్ని సిద్ధం చేశారు, వేదవ్యాసుడి కలమూ, కాయితమూ తాము లాగేసుకొని ! రాజుల గోత్రాల విషయం కూడా అలాగే అయింది. పరశురాముడు కొంతమంది రాజుల్ని చంపడానికీ, దీనికీ లంకెపెట్టారు. పరశురాముడు ఇఱవయొక్కమార్లు ప్రపంచమంతా తిరిగి రాజుల్ని సంహరించాడట. తన తండ్రి జమదగ్ని మహర్షిని కార్తవీర్యార్జునుడి మనుషులు చంపినప్పుడు తన తల్లి "రామా ! రామా ! " అని ఇఱయ్యొక్కసార్లు కేకేయడం అందుకు కారణమట. ఈ ఇఱవయ్యొకటి లెక్క ఎవఱు పెట్టారో తెలీదు. కేకేసిన తల్లా ? విన్న కొడుకా ? అంతా అయో మయం. తనతో యుద్ధం చేయడానికి పరశురాముడు వస్తున్నట్లు తెలిసి దశరథ మహారాజు భయపడి ఆడవేషం వేసుకొని దాక్కున్నాడట. ప్రపంచంలో రాజులంతా చనిపోయినాక వారి భార్యలు పరశురాముడి దగ్గఱికెళ్ళి "మా గతేంటి ? మాకు సంతానం కలక్కముందే నువ్వు మా భర్తల్ని చంపేశావు?" అని దుఃఖిస్తే "సద్బ్రాహ్మణుల నాశ్రయించి వారివల్ల సంతానం పొం దండి" అని ఆయన సలహా ఇచ్చాడట. వాళ్ళు అలాగే చేసి నశించిన క్షత్రియకులాన్ని పునరుద్ధరించుకున్నారట.

ఇంతకుముందే అనుకున్నట్లు ఈ కథలో తొఱ్ఱలు చాలా ఉన్నాయి. అన్నింటికంటే ముందుగా చెప్పుకోవలసినది. వాస్తవంగా పరశురాముడు చంపినదెవఱిని ? రాజులనా ? క్షత్రియులనా ? రాజులు తప్పుచేస్తే అది క్షత్రియుల బాధ్యత ఎలా అవుతుంది ? అంత గొప్ప భగవదవతారుడికి ఆ సంగతి తెలియదా ? తెలియదని ఈ కథాకారులనుకుంటున్నారా ? పరశురాముడైనా రాజులందఱినీ చంపినట్లు కనిపించడంలేదే. ఆయనకు సమకాలీనంగా దశరథుడూ, జనకుడూ మొదలైన క్షత్రియరాజులు నిక్షేపంలా ఉన్నారు, రాజ్యాలేలుకుంటూ ! వాళ్ళ మామగార్లూ గట్రా బంధువర్గం సరే సరి ! అటువంటప్పుడు పరశురాముడు రాజులందఱినీ, ఆ మాటకొస్తే క్షత్రియులందఱినీ సంహరించాడని జఱిగిన ప్రచారంలో పస ఏంటి ? అలా లక్షలాదిమంది క్షత్రియపురుషులు గుండ్రాళ్ళలాగా శుభ్రంగా బతికే ఉన్నప్పుడు, వారి భార్యలు వెళ్ళి సంతానం కోసం బ్రాహ్మణుల్ని ఆశ్రయిం చడమేంటి, అనవసరమైన, అన్యాయమైన వ్యభిచారదోష కళంకాన్ని ప్రాచీన క్షత్రియస్త్రీలకు ఆపాదించడం కాకపోతే ? పైగా వారి సంతానానికి తండ్రుల (తల్లుల ప్రియుల) గోత్రాలు సంక్రమించాయట, కులం మాత్రం సంక్రమించలేదట. తన యింటిపేరూ, గోత్రమూ పెట్టుకోవడానికి అంగీకరించిన బ్రాహ్మణతండ్రి తన కులాన్ని కూడా తగిలించుకుంటానంటే వద్దం

టాడా?

పురాణాల్ని నేను నమ్ముతాను. నిప్పు లేకుండా పొగ రాదన్నట్లు, ఎంతో కొంత సత్యలేశం లేకుండా ఏ కథా వాటిల్లో చోటు చేసుకోదు. అదే సమయంలో అవి తరతరాలుగా ఒకటినుంచి ఇంకొకటికి సంక్రమిస్తూ రావడం చేత వాటిల్లోని సత్యలేశం కాలక్రమంలో పల్చబారుతూ పోతుందనీ, దాన్ని భూతద్దాలతో పరిశీలించాల్సిన అగత్యం కూడా ఏర్పడుతుందనీ మఱువ రాదు. కథాకారులు కొన్నికొన్ని సన్నివేశాల పట్లా, పాత్రల పట్లా తమకున్న అభినివేశంతోనూ, నిర్భర భావోద్వేగంతోనూ నమ్మ శక్యం కాని అతిశయోక్తులకూ, ఉత్ప్రేక్షలకూ దిగుతూంటారు. అలాంటి భావోద్వేగక్షణాల్లో పరశురాముడంటే వెఱ్ఱిఅభిమానం గల చారణుడెవడో కల్పన చేసినది కావచ్చు ఈ ఇఱవయ్యొక్కసార్ల సర్వ క్షత్రియ సంహారం.

చరిత్రశాస్త్రం తొంగిచూడజాలని మాఱుమూల సుదూరపు చీకటియుగాల్లో ఏం జఱిగిందో ఇప్పుడు ఖచ్చితంగా ఊహించడం సాధ్యం కాదు. కానీ కథల రూపంలో ఇంత శాఖాచంక్రమణమూ, ఇంత డొంకతిరుగుడూ, ఇంత ద్రావిడ ప్రాణాయామమూ అవసరం లేదు. పరశురాముడికి పూర్వం కూడా క్షత్రియులు బ్రాహ్మణ గోత్రాలనే కలిగి ఉండొచ్చు. ఎందుకంటే పరశురాముడికి సమకాలికులై అతని దాడులకు బలికానటువంటి రాజులు చాలామంది ఉన్నారు. వారూ, వారి వంశాలూ, గోత్రాలూ కొనసాగాయి. వారి ద్వారా తదనంతర రాజులకు అబ్రాహ్మణ గోత్రాలు సంక్రమించినట్లు ఆధారాలు లేవు. అన్నీ బ్రాహ్మణగోత్రాలే.

మఱి బ్రాహ్మణులు శాకాహారులుగా ఎందుకు మారారు ?

# మూడో అధ్యాయం

ఊహకందని అత్యంత ప్రాచీనకాలంలో, ధర్మశాస్త్రాలింకా ఉద్భవించని యుగంలో బ్రాహ్మణులు కూడా అబ్రాహ్మణులంత విఱివిగా మాంసం తినేవారనడానికి ఆధారాలున్నాయి. ఈ కాలంలో తినట్లేదు కదా అని ఆ కాలంలో కూడా తినలేదని వాదించడం సరికాదు. ఉదాహరణకు, ఉత్తర రామచరితంలో ఆశ్రమానికి అతిథిగా వచ్చినప్పుడల్లా ఆవుమాంసాన్ని కరకరా నముల్తాడని ఒక ఋషిని అక్కడి ఆశ్రమవాసులు విమర్శించడం కనిపిస్తుంది. అది వ్రాసిన భవభూతి స్వయంగా ఒక శ్రోత్రియ బ్రాహ్మణుడు. స్వకులస్థుల్ని కళంకపఱిచే ఉద్దేశం అతనికుందని అనుకోలేం. నిజం చెప్పాడంతే ! బ్రాహ్మణుల్లో ఈ ఆచారం ఒకప్పుడు ఉండేదని తెలిసే అలా వ్రాశాడు. అలాగే **"గోస్తియ"** అనే మాట ఒకటుంది సంస్కృతంలో ! అతిథిని **గోస్తియ** అంటారు. ఇందులోంచే ఇంగ్లీషు Guest వచ్చిందని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. **గోస్తియ** అంటే ఆవుని కొట్టేసేవాడు (దొంగిలించేవాడు) అని అర్థం. అంటే ఆ రోజుల్లో అతిథి వచ్చినప్పుడు ఆవుని చంపి మాంసంగా వండి అతనికి విందుభోజనం పెట్టేవారు. ఆవుమాంసం సర్వశ్రేష్ఠం కనుక అలా పెట్టడం పరమ

పుణ్యకార్యమని భావించేవారు కూడా ! ఇప్పుడు కూడా ఆ పని చేయండని చెప్పడం కోసం కాదీ మాట ఇక్కడ వ్రాస్తున్నది. మానవజాతుల పరిణామక్రమంలో మనకు తెలియని చీకటి దశలున్నాయనీ, అంతా ఇప్పుడున్నట్లే ఉండేది కాదనీ తెలియ జేయడం కోసం మాత్రమే.

అలాంటి బ్రాహ్మణులు కాస్తా వీర శాకాహారులుగా ఎందుకు మారారనే ప్రశ్న అనివార్యంగా తలెత్తుతుంది. బ్రాహ్మణుల కంటే కూడా బ్రహ్మద్వేషులైనవారికి ఈ విషయం మీద ఆసక్తి మెండు కావడం మూలాన, ఆ ద్వేషభావనలో ముఖ్యంగా బ్రాహ్మ ణుల్ని మఱింత బద్నామ్ చేయాలనే అభ్యుదయ దృక్పథంతో వారు తమ సొంత సిద్ధాంతాల్ని తాము లేవదీశారు. తతిమ్మా కులాల మీద ఆధ్యాత్మికంగా తాము గొప్పవాళ్ళమనిపించుకోవడం కోసం మాంసం మానేశారని ఒకఱున్నారు. బౌద్ధుల్ని ఆచ రణలో ఓడించి వారికంటే తామే ఎక్కువ అహింసావాదులమనిపించుకుని తమ మతంలోంచి జనం వెళ్ళిపోకుండా చూసుకో వడం కోసం మానేశారని ఇంకొందఱు వ్రాశారు.

ద్వేషమనేది ఏ విధంగా సత్యాన్వేషణకు అడ్డుపడుతుందో, అది ఎలా మన కళ్ళని గాఢమైన అజ్ఞానాంధకారంతో కప్పేస్తుందో ఈ వాదాలు ఒక నిదర్శనం. ఈ వాదాల్లో ద్యోతకమయ్యే ఇంకో జబ్బుధోరణి ఏమంటే, తక్కిన హిందూసమాజం నుంచి బ్రాహ్మణుల్ని వేఱుచేసి చూసే పద్ధతి. బ్రాహ్మణులు ఎంత విశిష్టమైన కులమైనా కావచ్చు. అలా అని వారు భావించుకోనూ వచ్చు. కానీ ఆచరణలో వారూ అందఱితో పాటు ఒక కులం. అంతే ! వారూ ఈ సమాజంలో మొదట్నుంచీ ఒక భాగం. దీన్నుంచి వారు వేఱుగా, దూరంగా ఎప్పుడూ జీవించలేదు. అదీ గాక అశ్వఘోషుడిలాంటి బ్రాహ్మణులనేకులు బౌద్ధమత వ్యాప్తికి తమ జీవితాల్ని అంకితం చేశారు, ఈ కాలంలో శ్రీశ్రీ, చారు మజుందార్, ఏచూరి సీతారామ్, రామకృష్ణలాంటి బ్రాహ్మ ణులు కమ్యూనిజమ్ లోకి వెళ్ళినట్లు ! అటువంటప్పుడు మిహతా సమాజమంతా బౌద్ధంలోకి వెళ్ళినట్లూ, బ్రాహ్మణులొక్కఱే వెళ్లకుండా ఉన్నట్లూ అందుచేత వారే బౌద్ధానికి శత్రువులన్నట్లూ చిత్రించడం ఎంత అసంబద్ధమో యోచించాలి. అదీ గాక బ్రాహ్మణకులం కోట్లాది జనాభా కలిగినటువంటిది, ఆనాడూ, ఈనాడూ కూడా ! రవాణాసాధనాలూ, ప్రసారసాధనాలూ లేని రోజుల్లో ఆసేతుహిమాచలం బ్రాహ్మణులంతా కట్టగట్టుకుని, కూడబలుక్కుని ఒకేసారి బౌద్ధమతం మీద కుట్రచేసి మాంసాహారం మానేశారంటే అది నమ్మశక్యంగా లేదు. అంతేకాక బుద్ధుడికంటే పూర్వుడైన మనువు బ్రాహ్మణులకు అయజ్ఞి యమైన మాంసభక్షణను అయిదువేల సంవత్సరాల క్రితమే నిషేధించాడని ఇదివఱకే చెప్పుకున్నాం.

ప్రపంచంలో ఎంత వద్దనుకున్నా మనుషులు మానలేనివి రెండున్నాయి. ఒకటి - అలవాటుపడ్డ వృత్తి. రెండోది, అలవాటుపడ్డ భోజనం. వాచా ఎన్ని సిద్ధాంతాలు చెప్పినా ఆచరణలోకొచ్చేసరికి వీటిని ఛస్తే వదులుకోలేరు. అందుకే గదా క్షత్రియుడైన బుద్ధ భగవానుడు సైతం అహింస బోధించీ కూడా చిన్నప్పట్నుంచీ అలవాటైన మాంసాహారం మానలేకపోయాడు. చివఱికి ఆ మాంసాహారంతోనే జబ్బుపడి చనిపోయాడు కూడా. అలాంటిది కోట్లాది మంది బ్రాహ్మణులు కేవలం బౌద్ధాన్ని ఓడించడం కోసం ఒకేసారి మూకుమ్మడిగా అంత త్యాగానికి సాహసిస్తారా ? అదీ శాశ్వతంగా ? తరాల తరబడి ? అసంభవం. దీని వెనక

ఇంకేదో ఉంది.

నేననుకోవడం - ఇది బ్రాహ్మణకులంలో ఒక్క రోజులోనో, ఒక్క సంవత్సరంలోనో, లేదా ఒక శతాబ్దంలోనో చోటుచేసుకున్న ఆకస్మిక పరిణామం కాదు. అనేక శతాబ్దాల ప్రక్రియగా నలుగుతూ వచ్చింది. బ్రాహ్మణులు మతవిశ్వాసాలకే తప్ప రాజకీయ తీర్మానాలకు కట్టుబడే మనుషులు కారు. నా అనుమానం - ప్రాచీన బ్రాహ్మణుల దృష్టిలో ఈ మాంసాహారానికీ, తమ ఆధ్యాత్మిక అనుష్ఠానాలకీ మధ్య ఏదో హృదయవిదారకమైన వైరుధ్యం (conflict) గోచరించింది. జీవులు బ్రాహ్మణుల ఆహార నిమిత్తం ఇంట్లో నిరంతరమూ బలవన్మరణానికి గుఱవుతూ అక్కడి వాతావరణాన్ని తమ మరణవేదనతో, తమ తుది క్షణాల ఆత్మఘోషతో నింపుతూండడాన్ని వారిలో కొందఱు గ్రహించి ఉండాలి. తద్ద్వారా ఇంట్లో ఏర్పడుతున్న అదృశ్య అశుభ ప్రకంపనలు (invisible unholy vibrations) తమ మంత్రజపాలు ఫలించకుండా అడ్డు తగుల్తున్నాయని వారు అభిప్రాయపడి ఉండాలి. దీనికి తోడు జ్యోతిశ్శాస్త్రంలో బ్రాహ్మణులు చేసిన పరిశోధనల ఫలితంగా ఒక భయంకరమైన సత్యం బయటపడింది. మనుషులు జీవితంలో ఎంత ప్రయత్నించినా పైకి రాలేకపోవడానికీ, పెళ్ళిళ్ళు కాకపోవడానికీ, పదే పదే గర్భపాతాలు సంభవించడానికీ, సంతానం కలక్కపోవడానికీ, పుట్టిన సంతానం బాలారిష్టాలతోనూ, అల్పాయుష్షుతోనూ చనిపోవడానికీ, పెళ్ళిళ్ళు కాస్తా తొందఱలోనే పెటాకులు కావడానికీ, సంపదలన్నీ హఠాత్తుగా నశించి మనుషులు ఉన్నపళాన వీధిపాలు కావడానికీ, వంశంలో హత్యలూ, ఆత్మహత్యల్లాంటి బలవన్మరణ సంఘటనలు చాలా తఱచుగా జఱుగుతూండడానికీ కాలసర్పదోషమనే జాతకలక్షణం కారణమని వారు తెలుసుకున్నారు. ఆహారం కోసం గానీ, మఱొకదాని కోసం గానీ పూర్వజన్మల్లో అతివేలంగా జీవహింస చేసినవారికి మఱుజన్మలో జాతకంలో కాలసర్పదోషం సంప్రాప్తమవుతుంది. అన్ని కనుగోళ్ళ (discoveries) మాదిరే ఈ కనుగోలుక్కూడా మొదట్లో పరిహాసమూ, అవహేళనా, తిరస్కారమూ బహుమతులుగా లభించి ఉంటాయి. కాలం గడిచేకొద్దీ ఎవఱికి వారు తమ స్వానుభవాల ద్వారా ఈ కనుగోలులోని సత్యాన్ని తెలుసుకుంటూ వచ్చారు. తెలుసుకున్నాక చాలామంది బ్రాహ్మణులు మాంసాహారానికి స్వస్తి చెప్పడం మొదలుపెట్టారు. *యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః* అన్నట్లు పెద్దబ్రాహ్మణులూ, పండిత బ్రాహ్మణులూ మానేసేకొద్దీ చిన్నవాళ్ళు కూడా మానేయసాగారు. కొన్ని శతాబ్దాలలో ఈ నమ్మకం అన్ని రాష్ట్రాలకూ ప్రాకింది. ఇది నా అవబోధక్రమం.

ఇతర విషయాలలో కూడా బ్రహ్మ-క్షత్రియులు ఎలా వేఱవుతూ వచ్చారు ?

# నాలుగో అధ్యాయం

బ్రహ్మ క్షత్రియకులాలు రెండూ కవల (twins) లాంటివని ఇంతకుముందు అనుకున్నాం. మత నిర్వహణ బ్రాహ్మణుల విధి అనీ, రక్షణా, రాజ్యపాలనా క్షత్రియుల విధులనీ చెప్పడం చాలా అనంతరకాలంలో మొదలై ఉండొచ్చు. ఇది చాలా స్థూలం (broad) గా చెప్పబడిన విధే తప్ప ఖరాఖండీ విభజన కాదనిపిస్తుంది. వీటి మధ్యన గల విభజనరేఖ ఆచరణలో బహు పల్చనైనది. ఎందుకంటే జరిగిన చరిత్రని బట్టి వారి విధుల్ని వీరూ, వీరి విధుల్ని వారూ విజ్జోడు (alternate) గా నిర్వహించినట్లు కనిపిస్తోంది. ఎంత సుదీర్ఘకాలంగా అంటే ఈ మధ్య బ్రిటీషు వారి హయాము దాకాను ! బ్రాహ్మణుల్లో మాదిరే క్షత్రియుల్లో కూడా కొన్ని వేల సంవత్సరాలుగా భక్తులూ, సాధువులూ, యోగులూ ఉన్నారు. కవులున్నారు. వారందరినీ బ్రాహ్మణులు కూడా పూజిస్తారు. నిజానికి ఉపనిషత్తులలో ఒక గణనీయ భాగాన్ని రచించినవారు కూడా క్షత్రియులే. త్రేతాయుగీన తాత్త్వికరాజైన జనకుడి గురించి అందరికీ తెలుసు. కలియుగంలో కేరళకు చెందిన మహాభక్తుడు శ్రీ కులశేఖరాళ్వార్ పూర్వాశ్రమంలో చేరవంశపు రాజు. మన రాష్ట్రంలో కూడా కీ.శే. జ్ఞానానంద స్వాములవారూ, అలాగే మన సమకాలికులైన పుట్టపర్తి సత్యసాయిబాబావారూ, జిన్నూరు నాన్నగారూ మొదలైన వారంతా క్షత్రియులే. దేశదేశాల్లో భావాతీత ధ్యానాన్ని ప్రచారించిన కీ.శే.మహర్షి మహేష్ యోగిగారూ, కీ.శే. ఆచార్య ఓషో రజనీషూ క్షత్రియులే.

అలాగే క్షత్రియుల బదులు కొన్నిసార్లు బ్రాహ్మణులే రాజ్యపాలన చేస్తూ వచ్చారు. యుద్ధాల్లో పాల్గొంటూ వచ్చారు. దుర్యోధనుడి మిత్రమండలిలో ఒకడు సుశర్మమహారాజు అని మహాభారతంలో చెప్పబడింది. మౌర్యవంశం పతనమయ్యాక ఉత్తర భారతదేశాన్ని అదుపులోకి తీసుకున్న శుంగవంశ రాజులూ, దక్షిణాపథ రాష్ట్రాల్ని 225 సంవత్సరాల పాటు పరిపాలించిన ఆంధ్ర శాతవాహన చక్రవర్తులూ, వారి అనంతరం కర్ణాటక నేలిన కాదంబ వంశీకులూ, ఇండియా మీద ముస్లిములు తొట్టతొలిదాడి చేసే (క్రీ.శ. 9 వ శతాబ్దం) నాటికి ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్ దేశాల్ని (ఆ రోజుల్లో ఆ ప్రాంతాల్ని బ్రహ్మర్షిదేశం అనేవారు) పరిపాలిస్తూ ఉన్న హిందూషాహీ రాజులూ, 13 వ శతాబ్దిలో కాంబోడియాలో తొట్టతొలి హిందూ రాజవంశాన్ని స్థాపించిన తెలుగువాడు సూర్యవర్మా (ఇక్కడ బందిపోటు దొంగగా పేరుమోసి వెళ్ళగొట్టబడి ఆ దేశానికి చేరుకొని అక్కడ రాజయ్యాడు. ఈనాడు ప్రపంచ ప్రసిద్ధమైన అంకోర్‌వాట్ విష్ణుదేవాలయాన్ని కట్టించినది ఈ సూర్యవర్మ వంశీకులే) ఆధునిక యుగంలో మహారాష్ట్రను పరిపాలించిన పీష్వాలూ, బ్రిటీషువారి హయాములో కేరళను పరిపాలించిన తిరువాన్కూరు మహారాజులూ - వీరంతా బ్రాహ్మణులే. ఝాన్సీరాజ్యానికి రాణీ అయిన లక్ష్మీబాయి కూడా బ్రాహ్మణురాలే. ఆ విధంగా మహాభారత కాలం నాటి అశ్వత్థామ మొదలుకొని ఖడ్గతిక్కన దాకా, అలాగే 1857 నాటి సిపాయిల తిరుగుబాటు నాటి మంగళ్ పాండే మొదలుకొని భయంకరాచారి దాకా బ్రాహ్మణుల్లో కొంతమంది అవసరాన్ని బట్టి దర్భపుల్లల స్థానంలో కత్తులూ, కటార్లూ పట్టుకుంటూ వచ్చారు. శర్మలు కాస్తా వర్మలుగా మారిపోతూ వచ్చారు. ఉదాహరణకు, 1882 లో తీసిన లెక్కల ప్రకారం బెంగాల్ రెజిమెంట్ లో 67,000 మంది సైనికులుండగా వారిలో 28,000 మంది బీహార్ కి చెందిన భూమిహార్ బ్రాహ్మణులే.

ఈ జాబితా ద్వారా మనం ఏం గ్రహించడానికి అవకాశముంది ? శాస్త్రాలలో విధించిన తమ కులధర్మాలకు ఈ కులాలవారు నిక్కచ్చిగా ప్రతిసారీ కట్టుబడలేదనీ, ప్రవచిత కులధర్మాలు పుస్తకాల్లోనే మిగిలాయనీ, అవి కేవలం సూత్రప్రాయం (in-principle) గా మారాయనిన్నీ ! మఱో రకంగా జఱగడానికి అవకాశం లేదు. ఎందుకంటే వీరిద్దఱి మూలాలూ (origins) వేఱు కావు. అందుచేత వీరికుండాల్సిన మానసిక ప్రేరణలు వారిలోనూ, వారికుండాల్సిన మానసిక ప్రేరణలు వీరిలోనూ విజ్జోడు (alternate) గా కలుగుతూండడం మిక్కిలి తఱచు. అలాగే వారి ప్రవర్తన వీరిలోనూ, వీరి ప్రవర్తన వారిలోనూ వ్యక్తమవుతూండడం కూడా తఱచే. దీనికొక కారణం ఉంది. "మంచి చెప్పడం ఒకడి విధి" అనుకుంటే అలా చెప్పే క్రమంలో వినేవాళ్ళని కొన్నిసార్లు దండించాల్సి వస్తుంది. వినేదాకా దండించాల్సి వస్తుంది. అందులోనూ ప్రజాస్వామికం కానటువంటి పాత సమాజాల్లో ! నేరుగా ఖడ్గాన్నీ, రాజ్యపాలనను చేపట్టడం ద్వారా కొందఱు బ్రాహ్మణులు చేసినది అదే. అందులో వారి యందలి క్షత్రియ తత్త్వం గోచరిస్తుంది. అలాగే, దండించే అధికారం ఇవ్వబడ్డవాడు కొన్నిసార్లు వాచ్యంగా మంచి కూడా చెప్పాల్సి వస్తుంది. మఱి కొన్నిసార్లు పట్టి చెప్పడమే కాకుండా ప్రత్యక్షంగా చేసి చూపించాల్సి కూడా వస్తుంది. అందుకే భార తీయ రాజులు వృద్ధాప్యం వస్తూనే రాజ్యభారాన్ని కొడుకుల మీద పెట్టి సర్వసంగ పరిత్యాగులై తపోవనానికి వెళ్ళేవారు. ఇలా చేయడంలో వారియందలి బ్రాహ్మణ తత్త్వం గోచరిస్తుంది. ఈ కోణంలోంచి చూసినప్పుడు బ్రహ్మక్షత్రియ కులధర్మాలు ఏ విధంగా ఎక్కడ సమన్వయం పొందుతాయో మనకు ఆకళింపవుతుంది.

మతగురువులుగా బ్రాహ్మణుల రాజ్యపాలన ఆశ్చర్యకరం కాదు. అదే విధంగా వారినుంచి రాజ్యపాలకులైన క్షత్రియవర్గం పరి ణమించడం కూడా విస్మయజనకం కాదు. అది చాలా సహజమైన పరిణామం, ప్రపంచమంతటా ఉన్నదే. ఎందుకంటే మానవ జాతులన్నింటికీ మతగురువులే తొలుదొల్తటి పాలకులుగా ఉండేవారు. బ్రాహ్మణుడైన దక్షప్రజాపతి తొలిదొల్తటి రాజులలో ఒకడు. అలాగే మొన్న మొన్నటి దాకా త్రివిష్టప దేశం (టిబెట్) బౌద్ధలామాల పరిపాలనలో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా స్మరించాలి. (నామకార్థమే అయినా) బ్రిటీష్ రాజు/ రాణీ ఈనాటికీ ఆంగ్లికన్ చర్చికి అధిపతులుగా ఉంటున్నారు. అంతకు ముందు యూరప్ మొత్తం పోప్ యొక్క ఆధ్యాత్మిక, రాజకీయ శాసనానికి లోబడి ఉండేది. పోప్ యొక్క ఈ యూరో పియన్ సామ్రాజ్యాన్ని క్రిసెన్‌డమ్ అనేవారు. అలాగే సౌదీ అరేబియా రాజులు మహ్మద్ ప్రవక్త వంశీయులు. ప్రపంచంలో అన్ని చోట్లా మతగురువుల రాజ్యపాలనా సంప్రదాయం క్షీణించిపోయి ప్రభుత్వాలన్నీ లౌకికం (secular) గా మారిపోయినా ఇలా కొద్దిచోట్ల మటుకు "గతానికి మిగిలిన పురావస్తువులో" (Relics) అన్నట్లు అధికారంలో మతగురువులు మిగిలే ఉన్నారు.

అందుచేత ఆదిమ తెగల (primitive tribes) లో శారీరిక బలాన్ని బట్టి నాయకత్వం సిద్ధించేదనే అభిప్రాయం పాశ్చాత్య చరిత్ర రచయితలు ప్రచారించిన గ్రుడ్డి నమ్మకమే తప్ప వాస్తవం కాదు. ఆదిమ తెగల్లో పాశవికమైన శరీరబలం ప్రతి పురుషుడికీ ఉండేది, నాయకుడొక్కడికే కాదు. ఎంత నాగరికత లేనివారైనప్పటికీ వారు కూడా తమ హృదయంలోనూ, ఆత్మలోనూ దేవు డిచ్చిన స్వాభావికమైన మానవీయ హుందాతనమూ (human dignity), మౌలిక ధర్మబుద్ధీ (original sense of jus tice) గల సవితర్క జీవులని మర్చిపోరాదు. అందుచేత ఎంత వెనకబడినప్పటికిన్నీ మానవాళి ప్రతిదశలోనూ ఎంతో కొంత జ్ఞానసమాజం (knowledge society) గానూ, నైపుణ్యాల సమాజంగానే మంటూ వచ్చింది. నాయకత్వాన్ని ప్రసాదించే ఆ

జ్ఞానం ఈనాడు Science and technology అయితే ఆనాడు అది మతం. ఎక్కువ భగవత్ సాక్షాత్కారం గలిగినవాడు, అది కలిగిన వంశంలో జన్మించినవాడు, శత్రువుల్నీ, వారి శక్తుల్నీ తన ఉపాసనాబలంతో చిత్తుచేయగలవాడూ, తన మంత్ర బలంతో రాజ్యానికి వానల్లాంటి లాభాల్ని కలిగించగలవాడూ అయిన నాయకుడు తెగ (tribe) చేత రాజుగా ఆమోదించబడేవాడు.

## ఐదో అధ్యాయం

మనకు లభించే చారిత్రిక/ ధార్మిక/ సారస్వత ఆకరాలు (sources) అన్నీ కులవ్యవస్థ బాఘా లోతుగా వేళ్ళూనుకుని పాదుకుపోయిన తరువాత వ్రాయబడినవి. అంతకుముందున్న స్థితిగతుల్ని ఊహించడానికైనా అవి అవకాశం ఇవ్వవు. ఉదాహరణకు వర్ణవ్యవస్థ యొక్క ఆవిర్భావాన్ని వర్ణిస్తూ తఱచూ తార్కాణించబడే పురుషసూక్తమనే వేదభాగం. అది విరాట్పురుషుడి అవయవాలనుంచి నాలుగు వర్ణాలు ఆవిర్భవించాయని చెబుతుంది. వర్ణవ్యవస్థ ఒక తిరుగులేని మఱియు సామాజికంగా సర్వులకూ అంగీకారయోగ్యమైన సిద్ధాంతం (acceptable doctrine) గా స్థిరపడిపోయినాక అప్పటి విచికిత్సాళువులైన మేధావులు దాని గుఱించి తమకు తామే ప్రశ్నలు సంధించుకొని, దాన్ని మతపరంగా అర్థం చేసుకునే క్రమంలో పురుషసూక్తంలోని కథను చెప్పినట్లు కనిపిస్తున్నది. అంతే తప్ప బహుశా చాతుర్వర్ణ్యం అనేది పురుష సూక్తం వల్ల గానీ, పురుషసూక్తంతో గానీ మొదలవ్వలేదు. ఎందుకంటే సాధారణంగా ఏదైనా ఒక వస్తువు చాలాకాలంగా సంఘజీవితంలో ఉన్నాకనే సాహిత్యంలోకి ఎక్కుతుంది. అందుచేత పురుషసూక్తాన్ని చెప్పిన కొన్నివందల, లేదా వేల సంవత్సరాలకు ముందే చాతుర్వర్ణ్యం అమల్లో ఉండి ఉండాలి. అయితే వేదకాలపు ఆరంభం నుంచే వర్ణవ్యవస్థ ఉందనడానికి ఆధారం లేదు. ఆ మధ్యలో ఎక్కడో అది రూపుదిద్దుకొని ఉండాలి.

ఆధునిక కాలంలో కులరాజకీయాలకు అనుగుణంగా పురుషసూక్తం పెక్కు పెడర్థాలకూ పలు వక్రభాష్యాలకూ లోనైంది. ముఖ్యంగా శూద్రులు విరాట్పురుషుడి పాదాల నుంచి ఆవిర్భవించారని చెప్పడాన్ని ద్విజేతరులు అభ్యంతరకరంగా భావించారు. విరాట్పురుషుడు భగవత్స్వరూపం కనుక మనం నిజంగా భగవద్భక్తులమైతే మన కులం ఆయన అవయవాల్లో దేన్నుంచి ఉద్భవించినప్పటికీ అది మనకు గర్వకారణమే తప్ప అందులో కించపడాల్సిందేమీ లేదు. ముఖ్యంగా హిందూ మతంలో భగవదుపాసనలో పాదాలకున్న ప్రాధాన్యం ఇహ దేనికీ లేదు. పక్షాంతరంలో సమాజాన్ని విరాట్పురుష రూపంగా ఉత్ప్రేక్షిస్తే ఆ సమాజం భౌతికంగా ముందుకు నడవడానికి శూద్రవర్ణం అవసరమనీ, ఆలోచించడానికి బ్రహ్మవర్ణం అవసరమనీ పురుషసూక్తం చెబుతున్నట్లుగా భావించాలి. ఇందులో తప్పు పట్టాల్సిందేంటో కంచు కాగడాలతో వెతికినా నాకు కనిపించడం లేదు. వాస్తవానికి ప్రతి దేశంలోనూ సమాజం ఈనాటికీ ఇలాగే నడుస్తోంది. ఈ రోజు మనం ఇంగ్లీషులో నాజూగ్గా Service sector అంటే అది వినసొంపుగా ఉంది. శూద్రుడంటే నాటుగా ధ్వనిస్తోంది. బాలేదు. అదొక తేడా ! రెండో తేడా ఏంటంటే

ఆనాటి Service sector కి బుద్ధిబలమూ, పెట్టుబడీ అవసరం లేదు. ఈనాటి Service sector పేరుకు మాత్రమే Service sector. దీన్ని నిర్వహించాలంటే చాలా పెట్టుబడీ, బుద్ధిబలమూ కావాలి. కనుక ఇది తన శూద్రత్వాన్ని అధిగమించి బ్రాహ్మణ, వైశ్యలక్షణాల్లోకి ఊర్ధ్వగమనం (upward mobility) చెందింది.

పురుషసూక్తం చెబుతున్నది "పాదాల నుంచి పుట్టినవాడు శూద్రుడు" అని కాకపోవచ్చు. "శూద్రత్వం" అని ! అలాగే "తల నుంచి పుట్టినవాడు బ్రాహ్మణుడు" అని కాకపోవచ్చు అది చెప్పేది, "బ్రహ్మత్వం" అని ! అంటే అది భౌతికంగా మానవ వ్యక్తుల్నీ, వారి కులాల్నీ కాక, సృష్టిలో కల్పాది నుంచి అదృశ్యంగా నిబిడీకృతమైన అమూర్త భావనల (abstract concepts/ elements) ని వర్ణిస్తోంది, వేదంలోని అన్ని ఇతర మంత్రాల లాగానే ! స్త్రీపురుష తత్త్వాలు కూడా ఈ విధమైన అమూర్త భావనల్లో ఒకటి. ఇది గాక ద్వేషవాదుల ప్రచారంలో కులమూ, వర్ణమూ ఒకటిగా కలగలిసిపోయాయి. నిజానికీ రెండూ ఒకటి కాదు. వర్ణాలు ఏ దేశంలో నైనా, ఏ కాలంలో నైనా నాలుగే. కులాలు మట్టుకు కొన్నివేలుంటాయి. ఎందుకంటే కులాలన్నీ ట్రేడ్‌యూనియన్లు మాత్రమే. ఒకే వృత్తికి మనమెన్ని ట్రేడ్‌యూనియన్‌లనైనా సృష్టించుకోవచ్చు. వర్ణాల్నిమాత్రం సృష్టించలేం. నాశనమూ చేయలేం. అవి ఉన్నాయంతే ! ఎందుకంటే అవి ప్రకృతిలో సహజంగా ఉన్న అనాది సంస్కారాల సనాతన మూలకాలు (Elements). వృణోతి (He selects) ఇతి వర్ణమ్. వర్ణం అంటే ఎంచుకునేది. మనుషులు తమ స్వభావం ద్వారా, తమ అభిరుచులూ, ఇష్టానిష్టాలూ, అనుభవాలూ, సంస్కారాల ద్వారా కొన్ని సంకల్పిత/ అసంల్పిత ఎంపికలు (conscious or unconscious choices) చేసుకుంటారు. పూర్వకాలంలో మనుషులక్కూడా జంతువులకు మల్లే సామూహికత్వాలే తప్ప వ్యక్తిత్వాలు ఉండేవి కావు. కనుక ఒక కులస్థులంతా దాదాపు ఒకే విధమైన స్వభావాన్ని కలిగి ఉండేవారు. జనం తాము ఎంచుకున్న ఎంపికల్ని బట్టి ఆయా అభిరుచులు గల మానవ సమూహాల్లో జన్మించేవారు. కానీ ఇప్పుడు మనుషులు తమ సమూహం నుంచి మానసికంగా వేఱుపడ్డారు గనుక అన్ని సమూహాల్లోనూ అన్నిరకాల వ్యక్తులూ కనిపిస్తున్నారు.

కులం, వర్ణం లాంటి పేర్లు ఎఱక్కపోయినా సరిగ్గా అలాంటివీ, అంతకంటే అమానుషమూ అయిన వ్యవస్థలు ప్రపంచమంతటా ఉండేవి, అఱవై డెబ్భయ్యేళ్ళ క్రితం వఱకూను ! వాటితో పోలిస్తే భారతీయ వర్ణవ్యవస్థ చాలా మానవీయమైనదని ఎవఱైనా ఒప్పుకుంటారు. కొరియాలో బేక్‌జోంగ్, యాంగ్‌బన్, జుంగిన్, సాంగ్‌నోమ్, చున్‌మిన్, నొబి మొదలైన సామాజిక వర్గాలున్నాయి. వీరిలో బేక్‌జోంగులు అస్పృశ్యులు కాగా నొబీలు బానిసలు. మళ్ళీ ఆ అస్పృశ్య బేక్‌జోంగులలో కూడా చేయిన్, హ్వాచే ప్రభృతి ఉపకులాలున్నాయి. పురుషసూక్తం ద్వారా ఈ కులాల్ని సృష్టించడానికి ఆ దేశంలో బ్రాహ్మణులెవఱూ లేకపోవడం గమనార్హం. అలాగే హవాయీ లాంటి చిన్నద్వీపంలో అలీ, కహునా, మకాయినానా, కౌవా ప్రభృతి సామాజిక వర్గాలున్నాయి. ఇవి తెగలు (tribes) కావు. కులాలే. ఎందుకంటే మనలాగే వీరంతా కలిసి జీవిస్తారు. ఒకే భాష మాట్లాడతారు. అక్కడ కూడా పురుషసూక్తాలూ, మనుధర్మశాస్త్రాలూ ఏమీ లేవనేది గమనించాలి.

ఎటొచ్చీ, విదేశాల కులవ్యవస్థలు ఈనాడు వారివారి సాంఘిక జీవితాల్లోంచి దాదాపుగా అదృశ్యమయ్యాయి. కులవ్యవస్థని నిర్మూలిస్తే తప్ప ఒక్కడుగైనా ముందుకు వేయలేనంత సాంఘిక అత్యవసరత్వం (Social emergency) అప్పట్లో ఆ

దేశాల్లో నెలకొన్నది. మన దగ్గఱ నగరాల్లోనూ, పట్టణాల్లోనూ మాత్రమే కులాలు శక్తిహీనమయ్యాయి. గ్రామాల్లో పరిస్థితి యథాపూర్వం కొనసాగుతోంది. మన సామాజిక, సాంకేతిక పురోగమనం తతిమ్మా ఆసియా దేశాలంత వేగవంతం కాక పోవడం ఇందుకొక కారణం కావచ్చు. రెండోది, ఈ దేశంలో కుల దుర్విచక్షణని రూపుమాపడానికి బదులుగా ప్రత్యేకింపుల (reservations) పేరుతో దాన్ని ఇంకా ఇంకా ద్విగుణీకృతాయుష్షుతో బ్రతికించడానికీ, ప్రోత్సహించడానికీ, పెంచి పోషించ డానికే ఈ దేశప్రభుత్వమూ, సమాజమూ దృఢంగా కంకణం కట్టుకున్నాయి. మిహతా ఆసియాదేశాల్లో ఏ కులానికీ ప్రత్యేకిం పులూ, విశిష్ట మన్నింపులూ (preferential treatments) లేవు. వారు తమ తమ కులవ్యవస్థల్ని రూపుమాపగల్గడానికి అది రెండో కారణం.

మూడోది, మన దేశం విషయానికొస్తే ఇక్కడ ప్రతివారూ ఎవఱి కులంతో వారు తృప్తిగా, సంతోషంగానే ఉన్నారు. కులాన్ని అమాంతం నిర్మూలించి పారేస్తేనే తప్ప వల్లకాదన్నంత కసీ, ఫిర్యాదులూ ఎవఱికీ లేవు కులవ్యవస్థ మీద ! ఉంటే గింటే అన్ని అగ్రకులాల మీదనే ఉన్నాయి. ఇక్కడి జనం కోరుకుంటున్నది కుల నిర్మూలన కాదు. తమ కులానికి ప్రాధాన్యం. తమ కులా నికి ఆధిపత్యం. తమ కులాల్లోని ప్రముఖులు ఇతరుల కులాల ఆమోదానికీ, ఆరాధనకూ నోచుకోవడం. మనవారందఱూ కులం పేరు చెప్పుకొని యథాశక్తి లాభం పొందడానికి ప్రయత్నిస్తున్నారు. దీన్ని బట్టే మనకు అర్థమవుతోంది, మన కులవ్యవస్థ ఎక్కువ మానవీయతతో కూడుకొన్నటువంటిదని ! కానీ నిగ్గదీసి అడిగితే మట్టుకు ఆ పాపాన్ని ప్రాచీన అగ్రకులాల నెత్తిన రుద్దేయడానికి పూనుకుంటారు. ఈదృశమైన ఛప్పన్న కారణాల్ని పురస్కరించుకొని ఇక్కడ కుల నిర్మూలన అసాధ్యమేమో అనిపిస్తుంది.

నాకు చాలాసార్లు ఏమనిపిస్తుందంటే, ఒక హత్య జఱిగినప్పుడు అది జఱిగిందని ఫిర్యాదు చేసినవాణ్ణే భటులు ముందు నిర్బంధించే అవకాశం ఉంది. చూసీ చూడనట్లు తలొంచుకు పోయేవాడు బతికిపోతాడు. ప్రస్తుతం బ్రాహ్మణుల పరిస్థితి కూడా అదేనేమోనని. ఆనాటి బ్రాహ్మణులు తమ కాలపు సమాజ స్థితిగతుల్ని పుస్తకాల రూపంలో భావితరాల కోసం లిపి బద్ధం చేశారు. అందుచేత అవన్నీ బ్రాహ్మణులు స్వయంగా విధించి, సృష్టించి, అమలు పఱచిన సామాజిక పరిస్థితులనే ప్రచారం ఊపందుకుంది. కాస్త స్థిమితంగా కూర్చుని ఆలోచించేవారికి తెలుస్తుంది, ఈ వాదంలో పస లేదనిన్నీ, ఇది ఆంత్రో పాలజీకి, సమాజశాస్త్ర నియమాలకు విరుద్ధమనిన్నీ ! ఒక కులం నుంచి కాలక్రమంలో ఇంకో కులం ఉద్భవించడానికి అవకాశం ఉంది. అంతే తప్ప, ఒక కులం ఉన్నపళాన ఇంకో కులాన్ని సృష్టించజాలదు. కానీ జఱిగిన/ జఱుగుతూ ఉన్న ప్రచారమేమంటే, కులాలనేవాటిని బ్రాహ్మణులే కనుగొన్నారనీ, కులవ్యవస్థని వారే భారతదేశం మీద రుద్దారనీ, కులతత్త్వానికి వారే కారణమనీ ! సామాజిక వ్యవస్థల్ని ఏ ఒక్కఱూ సృష్టించరు. నానా అవసరాల్ని పురస్కరించుకొని వాటంతట అవే ఏర్పడతాయి. అయితే తాము పుట్టకముందే ఏర్పడ్డ వ్యవస్థల్ని ఉపయోగించుకునేవారు అన్ని కాలాల్లోనూ ఉంటారు. కొందఱు దాన్ని ఉపయోగించుకున్నంత మాత్రాన వారు దాన్ని సృష్టించినట్లు కాదు. ఇక్కడ మన అసలు సమస్య, బ్రాహ్మణులు కులవ్యవస్థలో భాగమా ? లేక, వారు దానికి సృష్టికర్తలా ? లేక వినియోక్తలా ? అని ! ఏ పేరైనా ఇతరులే పెడ తారనీ, ఎవఱూ తమకు తామే పేరు పెట్టుకోరనీ ఇదివఱకే చెప్పుకున్నాం. బ్రాహ్మణులు కులాలు సృష్టించారన్నప్పుడు, అంతకు ముందు కులాలే లేవన్నప్పుడు మఱి వారికి బ్రాహ్మణులనే పేరు ఎవఱు పెట్టారు ? వారు తమ కంటే వేఱైన ఎవఱి

నుంచి, తమ కంటే వేఱైన ఎవటి నుపయోగించుకొని కులాల్ని సృష్టించారనే ప్రశ్న తలెత్తుతుంది. "బ్రాహ్మణులు సృష్టించారు" అంటున్నారంటే కులాలు ఏర్పడక ముందే బ్రాహ్మణులున్నారనీ, ఇతరులు కూడా ఉన్నారనీ అర్థం వస్తుంది. ఎంత ప్రజా స్వామ్యమని చెప్పుకుంటున్నప్పటికీ ఈ రోజుల్లో ప్రభుత్వంలో కూర్చుని సమాజాన్ని అదుపు చేయడం చాలా సులభం. అది ప్రాచీన సమాజాల్లో చాలా కష్టం. కారణం చాలా సరళం. అలా అదుపు చేయడానికి అవసరమైన సాంకేతిక సాధన సంపత్తి ఆ కాలపు ఉన్నత వర్గాలకు లేదు.

ఇంగితాన్ని (common sense) ఉపయోగించి కొన్ని విషయాల్ని గ్రహించవచ్చు. ప్రపంచంలోని మానవజాతులన్నీ ఒకప్పుడు ఒకే చోట మొదలై ఒకే జాతిగా ఉన్న రోజులు ఉన్నాయనేది ఈ ఇంగితాల్లో మొట్టమొదటిది. లేకపోతే ఈనాడు ఒక జాతి వారు ఇంకో జాతివారిని పెళ్ళిళ్ళు చేసుకొని పిల్లల్ని కనగలిగే పరిస్థితి ఉండేది కాదు. ఒక ఆడకుక్కకీ, మగకోతికీ పిల్లలు పుట్టడం ఎంత అసంభవమో ఇదీ అంతే అసంభవమై ఉండేది. అలాగే వేలాది సంవత్సరాలుగా ఒకే దేశంలో నివసిస్తున్న పెక్కు కులాలవారు ఒకప్పుడు ఒకే కులంగా (కులాలు లేకుండా) బతికి ఉంటారని గ్రహించడాని క్కూడా మఱీ యెక్కువ మేధాశక్తి అవసరం లేదు. మతపరంగా చూసుకున్నా, బ్రహ్మదేవుడు మొదట్లో తన మానసపుత్త్రుల్నీ, ప్రజాపతుల్నీ సృష్టించాడు. వేద మూర్తి అయిన బ్రహ్మ యొక్క సంతానం కనుక వారంతా బ్రాహ్మణులే. వారి నుంచే యావన్మానవజాతీ ఆవిర్భవించిందని హిందూమతం పేర్కొంటోంది. కనుక మొదట్లో అందఱూ బ్రాహ్మణులే అనేది నిర్వివాదాంశం.

తరువాత్తరువాత ఏ కారణం చేతనో (బహుశా తపశ్చర్యకే అంకితం కావాలని నిశ్చయించుకోవడం వల్ల) మతగురువుల వంశాలు స్వయంగా రాజ్యపాలనను చేపట్టడం మానేసి తమ ఆశ్రమాలలో శిక్షణ పొందినవారిని (విద్యార్థుల్ని) రాజులుగా నియమించడానికి పరిమితమై ఉండొచ్చునని నా ఊహ. ఆ క్రమంలో వారు నియోగించిన రాజ్యపాలకులూ, వారి పరి వార మూ నెమ్మదిగా ఒక ప్రత్యేక కులంగా అవతరించారు. అదే క్షత్త్రియ కులం. అయినా వారి సంతానం బ్రాహ్మణ ఆశ్రమాలలో శిక్షణ పొందడం మానలేదు. పాఠశాలలకే రాజకుమారులు వెళ్ళాల్సి వచ్చేది. రాజభవనాలకు పాఠశాలలు నడిచిరాలేదు. రాజ్యపాలన ప్రజల కోసం, ప్రజాభీష్టం ప్రకారం జఱగాలనే సిద్ధాంతం బలపడ్డాక మతగురువులు రాజుల్ని నియమించడం కూడా మానేశారు. ప్రజలే తమ రాజుల్ని ఎంచుకోవడం మొదలుపెట్టారు. ఈ పరిణామాన్ని రామాయణం బాలకాండలో గమనించవచ్చు. రాజ్యప్రముఖులందఱినీ సమావేశపఱిచి "మీకు నా తరువాత ఎవఱు రాజుగా కావాలి ?" అని దశరథుడు అడిగాడు. "రాముడే కావాలి" అని వారంతా ఏకకంఠంగా చెప్పారు.

కాలక్రమంలో రాజులు ప్రజల్ని ఆ విధంగా సంప్రదించడం కూడా మానేశారు. జనాభా పెఱిగిపోతున్న కొద్దీ, రాజ్యాలు పెద్ద వవుతున్న కొద్దీ, ఆ తరువాత ముఖ్యంగా రాజత్వం వంశపారంపరికమూ, జ్యేష్ఠపుత్త్రాధికార నియమమూ (Rule of Primogeniture) అయినాకా మతమూ, రాజ్యపాలనా పూర్తిగా భిన్నమైన కార్యక్షేత్రాలు (different operational planes) గా రూపుదాల్చి శాశ్వతంగా వేఱుపడ్డాయి. రాజనీతి పేరుతో అతిక్రౌర్యాన్నీ, కౌటిల్యాన్నీ, భోగలాలసనీ, భాగ్యకాంక్ష నీ, కీర్తికాముకతనీ అలవర్చుకున్న రాజులు తమ పూర్వపు బ్రాహ్మణీయ లక్షణాల్ని చాలావఱకు పోగొట్టుకున్నారు. ఆ విధంగా

క్షత్రియుల జీవితాదర్శాలూ, జీవనశైలీ, వేషమూ, భాషా అంతా మారిపోవడంతో బ్రహ్మక్షత్రియకులాల మధ్య ఏర్పడిన సాంస్కృతిక అగాధం గభీరమై అవి రెండూ భిన్నమైన జాతులుగా పొడకట్టసాగాయి, ఇఱుగుపొఱుగునే జీవిస్తున్నప్పటికీ !

## ఆఱో అధ్యాయం

బ్రాహ్మణుల్లోంచి ఇతరకులాలు ప్రభవించిన ఈ పరిణామాన్ని ఈనాటి బ్రాహ్మణ్య శాఖలతో పోల్చవచ్చు. భారతదేశమంతా కలిపి తమ కులంలో ఎన్ని శాఖలు ఉన్నాయో బ్రాహ్మణులకే తెలియదు. మన రాష్ట్రం విషయానికొస్తే ఉత్తర అమెరికాకి వలసపోయినవారినీ, ఇక్కడే ఉండిపోయినవారినీ అందఱినీ కలిపి కూడితే మొత్తం తెలుగు బ్రాహ్మణుల జనాభా ఇప్పుడు సుమారు ఇఱవై-ముప్ఫై లక్షల మధ్య ఎంతైనా ఉండొచ్చు. కానీ ఆ పాటి జనాభాకే వందశాఖలున్నాయి. వేంగినాట్లూ, ములికినాట్లూ, వెలనాట్లూ, కాసల్నాట్లూ, ప్రాజ్నాట్లూ, కాణ్వేయులూ, కోసలేయులూ, కాతీయులూ, ఆరామ ద్రావిళ్ళూ, దివిలిద్రావిళ్ళూ, పేరూరి ద్రావిళ్ళూ, పుదూరు ద్రావిళ్ళూ, నందవరీకులూ, వైఖానసులూ, గోల్కొండ వ్యాపారులూ, శిష్టకరణాలూ, కరణకమ్మలూ, తెలుగాణ్యులూ, మాధ్వులూ, లింగధారులూ, ఆదిశైవులూ = ఇలా ఇదొక మహా జాబితా. ఎప్పుడు, ఎలా, ఏ కారణాన్ని పురస్కరించుకొని, ఏ విశిష్ట నిర్వచనాన్ని అనుసరించి ఈ శాఖలు ఉనికిలోకి వచ్చాయో తెలియదు. "మేము ఫలానా శాఖ" అని ఎవఱికి వారు వాచికంగా చెప్పుకోవడమే మినహా ఇవి ఏ శాస్త్రాల్లోనూ లిఖితరూపంలో విహితమై కనిపించవు. కనుక ఇవన్నీ చాలా ఇటీవల = అంటే గత వెయ్యేళ్ళలో విడిపోయిన శాఖలై ఉండాలి. పేర్లను బట్టి కొన్నిటి మూలాల్ని ఊహించడానికి అవకాశముంది. ఉదాహరణకు, గోల్కొండ వ్యాపారులనే శాఖవారు కొన్నివందల సంవత్సరాల క్రితం హైదరాబాదులో దుకాణాలు పెట్టుకొని ఉంటారు. ఆ క్రమంలో వైదిక సంప్రదాయానికి కాస్త దూరమై ఉంటారు. అందుచేత వారికొక ప్రత్యేక శాఖ అవసరమై ఉండొచ్చు. ఏదేమైనా వీటి మధ్య తర తరాలుగా వివాహసంబంధాలు లేవు. కానీ ఇటీవల కొందఱు బ్రాహ్మణులు సాహసించి సంప్రదాయాన్ని త్రోసిరాజని శాఖాంతర వివాహాలు చేసుకోవడం మొదలుపెట్టారనుకోండి.

ఈ పైన పేర్కొన్నవి కారణం లేని/ తెలీని శాఖాభేదాలు కాగా, అది తెలిసిన భేదాలు ఇంకొన్ని ఉన్నాయి. ఉదాహరణకు = వేదాలు తెలిసినవారు వేదుల అనే ఇంటిపేరు గలవారయ్యారు. రెండు వేదాలు మాత్రమే తెలిసినవారు ద్వివేదులయ్యారు. మూడు వేదాలు తెలిసినవారు త్రివేదులూ, త్రిపాఠీలూ, తివారీలూ అయ్యారు. నాలుగు వేదాలు తెలిసినవారు చతుర్వేదులయ్యారు. ఇవి వేదాల్ని బట్టి ఏర్పడ్డ ఇంటిపేర్లు మాత్రమే. ఇవి గాక గృహ్యసూత్రాలు (Family Rules) అనే ఒక తరహా ధర్మశాస్త్ర గ్రంథాల్ని బట్టి కూడా బ్రాహ్మణులు అనేకులయ్యారు. ఆశ్వలాయన గృహ్యసూత్రాల్ని అనుసరించేవారు కొందఱైతే, ఆపస్తంబ సూత్రాల్ని అనుసరించేవారు కొందఱు. బోధాయన సూత్రాల్ని పాటించేవారు కొందఱు. పేర్ల తేడాయే తప్ప వాస్తవానికి అన్ని సూత్ర గ్రంథాల్లోనే దాదాపుగా ఒకే విషయం ఉంటుంది.

ఇంతే కాక రాష్ట్రానికో రకం బ్రాహ్మణులున్నారు. మళ్ళీ ఆయా రాష్ట్ర బ్రాహ్మణుల్లోనే నానా శాఖలవారున్నారు. అయితే అందఱూ మన తెలుగుబ్రాహ్మణుల్లా శాంతమూర్తులు కారు. ఉదాహరణకు బీహార్ లో కాన్యకుబ్జ, సరయూపారీణ్, భట్ట బ్రాహ్మణ్, మైథిల్, సకల్‌దివీయ మొదలైన బ్రాహ్మణశాఖలున్నాయి. వీరిలో భూమిహార్ బ్రాహ్మణులు తరతరాలుగా జమీందారులుగానూ, సాయుధులుగానూ, సైనికులుగానూ ఉంటూ వచ్చారు. ఇప్పటికీ వీరికి ప్రైవేట్ సైన్యాలున్నాయి, మన రాయలసీమ ఫ్యాక్షనిస్టులకు మల్లే ! ఈ సైన్యాలతో వారు తఱచుగా మావోయిస్టుల మీదా, వారి సానుభూతిపరుల మీదా పడి వారిని సామూహికంగా మట్టుపెడుతూ ఉంటారు. అదే విధంగా పంజాబీ బ్రాహ్మణుల్లో సైతం మోహ్యాల్ అనే శాఖవారు యుద్ధాలు చేయడమే కాకుండా వైదికవృత్తి నుంచి పూర్తిగా విరమించుకున్నారు. ఆ వృత్తి వారికి ససేమిరా నిషిద్ధం కూడా ! పంజాబీ బ్రాహ్మణులంతా సారస్వతశాఖకు చెందిన వారేనని చెబుతున్నప్పటికీ వారిలో ఇంకా బారాహీ, పంజజాతి, అథవన్, బవన్‌జాయ్ వంటి ఉపశాఖలు కూడా ఉన్నాయి. హుస్సేనీ బ్రాహ్మణులని ఇంకో శాఖ ఉంది. వీరు హిందువులే ఐనా హుస్సేన్ అనే ముస్లిమ్ గురువుని పూజిస్తారు. సునీల్ దత్, సంజయ్‌దత్ ప్రభృతులు ఈ శాఖవారు.

మన రాష్ట్రంలోని బ్రాహ్మణులు స్థూలంగా వైదీకులూ, నియోగులూ అని రెండు ప్రధాన విభాగాలు. ఒకే కులస్థులైనప్పటికీ వీరి మధ్య గత శతాబ్దం వఱకూ పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. దీనిక్కారణం, కాకతీయుల కాలంలో గ్రామకరణాలుగా నియోగించబడ్డ బ్రాహ్మణులు వైదికవిద్యకు స్వస్తి చెప్పి ప్రభుత్వోద్యోగులమనే ఆత్మప్రత్యయంతో మిహతా బ్రాహ్మణ్యానికి మానసికంగా దూరమయ్యారు. ఎంతగా అంటే, తమను ఎవఱైనా బ్రాహ్మణులు అని పిలిస్తే అగ్గి మీద గుగ్గిలంలా మండిపడేవారు. తమ పేర్లకు చివఱ భట్టు, శాస్త్రి, అవధానులు, చయనులు మొదలైన బ్రాహ్మణ ఉపపదాల్ని వర్జించి "రాజు/ ప్రెగడ" అని తగిలించుకున్నారు. వారి ఇంటిపేర్లలో కూడా "రాజు/ ప్రెగడ" కనిపిస్తాయి. కారణం, బ్రాహ్మణుడంటే పూజారి/ పురోహితుడనే ఒక సంకుచితార్థాన్ని కల్పించారు. ఈ పరిణామాల్ని బేరీజు వేసుకున్నప్పుడు మనకు అనిపిస్తుంది = బ్రాహ్మణుల్లో ఒక చిన్న శాఖగా బయలుదేఱిన నియోగులు, లేదా పంజాబుకు చెందిన మోహ్యాళ్ళూ, లేదా బీహారుకు చెందిన భూమిహార్‌లూ కేవలం తమ వృత్తినీ, హోదానూ పురస్కరించుకొని బ్రాహ్మణులకంటే భిన్నమైన ఒక ప్రత్యేక కులంలా ప్రవర్తించినప్పుడు ఇతర కులాల విషయంలో కూడా అతిప్రాచీనకాలంలో సరిగ్గా అలాగే ఎందుకు జఱిగి ఉండకూడదు ? అని !

అన్ని కులాలూ ఈ విధంగానే తొలుత బ్రాహ్మణ కులపు శాఖలుగానూ, ఉపశాఖలుగానే మొదలై ఉంటాయని నా నిశ్చిత అభిప్రాయం. అందుకనే కొన్ని అబ్రాహ్మణ కులాలలో ఇప్పటికీ కొన్ని బ్రాహ్మణ లక్షణాలూ, ఆచారాలూ కనిపిస్తున్నాయి. పెక్కింటిలో పూర్తిగా అంతరించాయి. పద్మసాలీలలోనూ, విశ్వకర్మలలోనూ యజ్ఞోపవీత ధారణే కాకుండా సంస్కృత గోత్రాలు కూడా ఉన్నాయి. చాత్తాద శ్రీవైష్ణవులు (సాతానివారు = పరవస్తు చిన్నయసూరి కులం) ఈనాడు బి.సి. లైనప్పటికీ వారి ఆచారవ్యవహారాల్ని బట్టి వారొకప్పుడు బ్రాహ్మణులే అయ్యుండొచ్చు. అలాగే బి.సి.లైన భట్రాజ కులస్థులు వాస్తవానికి బ్రాహ్మణ నియోగుల్లోనే ఒక శాఖ అయ్యుంటారని నా అభిప్రాయం. ఎందుకంటే సాంప్రదాయిక భట్రాజులు మాంసాహారులు కారు. అదీగాక ఈ కులనామంలోని భట్టుశబ్దం బ్రాహ్మణులనే సూచిస్తున్నది.

కొండవీటి (గుంటూరు) రెడ్డిరాజులు కూడా యజ్ఞోపవీతధారణ చేసేవారని ఒకచోట చదివాను. కొండవీటిరాజ్య పతనానంతరం రెడ్లు పూర్తి వ్యవసాయకులంగా మారిపోయినాక వారిలో ఉపనయనాలూ, యజ్ఞోపవీతాలూ, వేదాధ్యయనమూ అంతరించి ఉంటాయి. ఈనాడు శూద్రులుగా పరిగణించబడుతున్న రెడ్లు కూడా ఒకప్పుడు ద్విజులు కావడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించదు. ఎందుకంటే రెడ్డి అనే పదం రట్టడి శబ్దభవం. రట్టడి ఒక ప్రాకృతశబ్దం. దానికి మూలం సంస్కృతంలోని రాష్ట్రపతి. రాష్ట్రమంటే వైదిక పరిభాషలో వంద గ్రామాలు. అంటే అప్పట్లో ఒక జిల్లా అంత భూవైశాల్యం. దాని పరిపాలకుడు రాష్ట్రపతి. ఒకప్పుడు రెడ్లు క్షత్రియులని ఈ మాట సూచిస్తున్నది. అనగా వీరి ద్విజేతరత్వం కేవలం ఇటీవలిదన్న మాట.

ఒకప్పుడు సైనికవృత్తిలోనూ, రాజ్యపాలనలోనూ ఉన్న కులాలు ఆ తరువాత పాడిపంటల్లోకీ, వ్యాపారంలోకీ దిగడం, ఆ తరువాత తమను తాము రైతుబిడ్డలుగా భావించుకోవడం సర్వసాధారణం. రెడ్ల విషయంలో జఱిగింది ఇదే. క్షత్రియుల విషయంలో జఱిగిందీ ఇదే. యాదవుల విషయంలో కూడా ఇదే జఱిగింది. యాదవులు యదువనే క్షత్రియరాజు వంశీకులు. పురాణకాలంలో చైద్యులూ, హైహయులూ, అంధకులూ, వైదర్భులూ, సాత్త్వతులూ, వార్ష్ణేయులూ, కుకురులూ, భోజులూ మొదలైన యాదవ రాజవంశాల గుఱించి ప్రస్తావించబడింది. చరిత్రయుగంలో కూడా యాదవులు దేశమంతటా ఎడతెగకుండా అధికారంలోనే ఉన్నారు. విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన తెలుగువాళ్ళు హరిహర రాయలూ, బుక్కరాయలూ యాదవులే. గోలకొండ కోటని కట్టినది కూడా యాదవరాజులే. అందుకే మొదట్లో దాని పేరు గొల్లకొండ అన్నారు. మహారాష్ట్రలో దేవగిరిని రాజధానిగా చేసుకొని ౧౦-౧౪ శతాబ్దాల నడుమ మధ్యభారతదేశాన్ని పరిపాలించిన సేవుణ వంశీకులూ యాదవులే. పురాణాల్లోని యాదవులూ, మన కాలంలో పాలమ్ముకుంటున్న యాదవులూ ఒకటి కాదనీ, శ్రీ కృష్ణుణ్ణి అడ్డం పెట్టుకొని అలా ప్రచారం చేసుకుంటున్నారనీ ఒక వృద్ధమేధావి నాతో జనాంతికంగా అన్నారు. ఆయనది తొందఱపడి మాట్లాడే తత్త్వం కాదు. సమాచార సేకరణలో మంచిదిట్టే. కానీ నా వ్యక్తిగత పరిశీలనలో ఆయన అభిప్రాయం సమీచీనం అనిపించలేదు. వివిధకులాల వర్తమాన స్థితిగతుల్నే వారి ఐతిహాసిక ప్రతిపత్తిగా భావించడం, ఆ ప్రాతిపదికన వారిని ఘనపఱచడమో, కించపఱచడమో చాలామంది సామాన్య బుద్ధిశాలురు చేసే పని. అది మనకుచితం కాదు.

అసలైన యాదవులంతా ద్వారకలో ముసలం పుట్టినాక తమలో తాము కొట్టుకొని అంతరించిపోయారనీ, ఆ కారణం చేత కూడా ఈనాటి యాదవులు ఆనాటి యాదవుల వంశీకులు కారనీ కొందఱు వాదిస్తారు. ఇది కూడా పూర్తినిజం కాదు. ఎందుకంటే ముసలం పుట్టినాక యాదవులంతా నిశ్శేషంగా నిర్వంశమయ్యారని పురాణాలు చెప్పడం లేదు. వాటి ప్రకారం యాదవుల అంతర్యుద్ధంలో చాలామంది చనిపోగా మిగిలిన హతశేషులు (survivors) ద్వారకానగరాన్ని విడిచి సముద్రం దాటి గుజరాత్ మీదుగా ఉత్తర భారతదేశంలోకి ప్రవేశించారు. పాంచాలం (పంజాబు) చేఱుకోగానే అక్కడి ఆభీరులు వారిపై దాడిచేసి దోచుకున్నారు. ఆ కలకలంలో యాదవులు చెట్టుకొకఱూ, పుట్టకొకఱుగా చెదిఱిపోయారు. వారిలో కొందఱు మృత్తికావతి అనే ఊరు చేఱుకొని అక్కడ కృతవర్మ రాజుగా ఒక యాదవ రాజ్యాన్ని స్థాపించారు. మఱికొందఱు సరస్వతీనది తీరానికి చేఱుకొని యుయుధానుడు రాజుగా ఇంకో యాదవరాజ్యాన్ని స్థాపించారు. ఇంకొందఱు ఇంద్రప్రస్థానికి వెళ్ళి అక్కడ శ్రీకృష్ణుని మునిమనుమడైన వజ్రుడనేవాణ్ణి యాదవులకు రాజుగా అభిషేకించారు. అయితే ఈ వజ్రుడు పరిపాలించిన రాజ్య

నామమేంటో తెలియరాకుండా ఉన్నది. ఇతని రాజ్యాభిషేకం స్వయానా పాండవుల ఆధ్వర్యంలోనే జరిగుంటుంది.

తదనంతర కాలంలో యాదవులు ప్రజారక్షణా, రాజ్యపాలనా చేయడానికీ, కేవలం పాలమ్ముకొని జీవించడానికీ మధ్య ఆ రెండూ చేసిన సంధిదశ (transitional phase) ఒకటుంది. అది మనకు కాటమరాజు చరిత్రలో గోచరిస్తుంది. ఆసక్తులు దాన్ని అధ్యయనం చేయవచ్చు. కాటమరాజు కథల ద్వారా మనకు కలిగే అనుమానాల్లో ఒకటి, యాదవులు ఆధునిక కమ్మ కులానికి ఆద్యులు కావచ్చునేమో నని ! ఎందుకంటే, గోగినేని, అంకినేని, అక్కినేని, పోలినేని మొదలైన ఈనాటి కమ్మ ఇంటి పేర్లు అనేకం ఒకప్పుడు యాదవ యుద్ధవీరుల వ్యక్తినామాలు (గోగినీడు, అంకినీడు, పోలినీడు గట్రా). పదాంతంలోని ఈ "నీడు" శబ్దం "నాయకుడు" లేదా "నాయుడు (నైడు)" అనేదానికి పరిణమిత రూపం లేదా క్ష్రిప్తోచ్చారణ. ఐతే యాదవుల్లోంచి కమ్మవారు విడిపోయిన దశాకాలం ఏంటనేది ఖచ్చితంగా తెలియదు. ఎందుకు విడిపోయారనేదీ తెలియదు. బహుశా బ్రాహ్మణుల్లో నియోగులు చేసినట్లే యాదవుల్లో వంశపారంపరికంగా రాజ/ సైనిక హోదాలు అనుభవించిన కుటుంబాలు పాలమ్ముకొనే యాదవుల తరగతి నుంచి తమను తాము వేర్పఱచుకొన్నాక కమ్మనాయుళ్ళు/ కమ్మవారనే పేరుతో ఒక ప్రత్యేక కులంగా లబ్ధప్రతిష్ఠులై ఉంటారు. చరిత్రలో అనేకమంది కమ్మరాజులు ఉండడాన్నిబట్టి చూసినా కూడా వారు అంతకు ముందటి యాదవుల క్షత్రియ సంప్రదాయాన్నే కొనసాగించారని భావించాల్సి ఉంటుంది.

ఏతావతా మనకు బోధపడే పిండితార్థమేమంటే, బ్రాహ్మణుల్లోంచి క్షత్రియులు ప్రభవించినట్లే క్షత్రియుల్లోంచి ఈనాటి శూద్ర కులాలూ, బి.సి. కులాలూ కొన్ని ఆవిర్భవించాయనేది. కనుక దాదాపుగా ఏ కులం చరిత్ర తీసుకొని వెనక్కు వెళ్ళినా అది అంతిమంగా బ్రాహ్మణుల దగ్గఱికే దారితీస్తుంది. దీనికి ఉపబలకం (supporting point) గా, బ్రాహ్మణులకూ, ఇతర కులాలవారికీ మధ్య జన్యుపరమైన వ్యత్యాసాలు (genetic variations) లేవని ఒక శాస్త్రీయ పరిశోధన నిర్ధారించినట్లు చదివాను. వైశ్యుల విషయంలోనే కొంచెం తేడా ఉన్నట్లు కూడా విన్నాను. అయితే ఇక్కడ ఉన్న చిక్కేమిటంటే, మన జన్యునిధి (gene pool) అయిదువేలేళ్ళనుంచి ఒకేతీరుగా లేదు. కొత్తవారితో సంపర్కసంబంధాలు విఱివిగా కలుగుతూ వచ్చాయి. కనుక ఒకప్పుడు వీరందఱిదీ అచ్చుమచ్చుగా ఒకే రక్తం అవునో కాదో సందేహాల కతీతంగా నిర్ధారించి చెప్పలేం.

# ఏడో అధ్యాయం

చుట్టూ ఉన్న ప్రకృతినీ, దాని ఉపయోగాల్నీ అర్థం చేసుకుంటున్నకొద్దీ సమాజానికి ఎక్కువ సేవలు అవసరమౌతాయి. ఆ సేవలు చేసేవారు అవసరమవుతారు. ఆ అవసరాల్ని తీర్చడానికి కొందఱు సమయస్ఫూర్తితో ముందుకొస్తారు. మన దేశచరిత్రలో అలా ముందుకొచ్చిన కళాకారులూ, వృత్తిపనులవారూ మొదట్లో బ్రహ్మ, క్షత్రియ కులాలకు చెందినవారే అయ్యుండొచ్చు. వారు ఈ కొత్తవిజ్ఞానం పట్ల ఆసక్తి కొద్దీ ఈ కళల్లోనూ, వృత్తుల్లోనూ ప్రవేశించి ఉంటారు. ఆ వృత్తుల్లో స్థిరపడినవారు వాటి పేరిట వ్యవహరించడం మొదలై, అలా కొన్ని తరాలకు ద్విజేతరులుగా గుర్తింపు పొందడం ఒక అనూహ్య చారిత్రిక పరిణామం. నాగరికతని నిర్మించాలంటే కేవలం మతగురువులూ, మహారాజులూ చాలరు. వేటాడేవారూ, వ్యవసాయం చేసేవారూ, వ్యవసాయోత్పత్తుల్ని సిద్ధం చేసేవారూ, ఇల్లు కట్టేవారూ, బట్టలు నేసేవారూ, కుండలు చేసేవారూ, చెక్కతో వివిధ వస్తువులు తయారించేవారూ, లోహాల్ని పోతపోసేవారూ, వైద్యం చేసేవారూ అని ముఖ్యంగా తొమ్మిది రకాలవారు అవసరమౌతారు. అయితే ఈ వృత్తులన్నీ అప్పుడొకటీ ఇప్పుడొకటిగానే తప్ప ఒకేసారి బయల్దేఱినవి కాకపోవచ్చు. అందుచేత కొత్తవృత్తుల్ని చేపట్టడానికి ఉన్నవృత్తులవారే పూనుకోవాలి. అలా నాగరికత పెఱుగుతున్నకొద్దీ, వృత్తులూ, ఉపాధి-అవకాశాలూ పెఱిగి అంతకుముందున్న కులాలే కొత్తకొత్త కులాలుగా చీలిపోతూ వచ్చాయి. అందుచేత వర్ణం (choice) అనే పదాన్ని వాడడంలో ఉన్న సాందర్భికత (relevance) ని సమీచీనంగా గుర్తెఱుగాలి.

"వృత్తులు వృత్తులుగానే ఉంటే బావుండేది కదా ! కులాలెందుకయ్యాయి ? కులవృత్తి ఒక స్వేచ్ఛాయుత ఎంపిక (free choice) గా కాక ఒక బలాత్కారపూరిత జీవనవిధానం ఎందుకవ్వాలి ?" అనే ప్రశ్న వస్తుంది. ఎంపికయ్యేది కులవృత్తి కాజాలదు. కులవృత్తయినది ఎంపిక కాజాలదు. కులవృత్తిని మించిన ఆదాయమార్గాలు దొఱకడం ఈ రోజుల్లో తలెత్తిన వినూత్న పరిణామం. అందుకని కులమూ, కులవృత్తీ అనేవి ఈ కాలానికి విషమైపోయాయి. పూర్వీకుల పరిస్థితి అది కాదని మనం లభ్యమవుతున్న ఆధారాల్ని బట్టి ఊహించవచ్చు. కులవృత్తికి స్థానికమైన గిరాకీ (local demand) సర్వకాల సర్వావస్థల్లోనూ ఉండేది. తద్వారా కులవృత్తికారుల్ని పోషించేవారు విఱివిగా ఉండేవారు. గడవకుండా పోతుందన్న భయం లేదు. ఎందుకంటే ఈ రోజుల్లో మాదిరి ఆ రోజుల్లో జనాభా శీఘ్రంగా పెఱిగేది కాదు. ఆర్థిక వ్యవస్థలో నాటకీయమైన ఊపులూ, పెఱుగుదలలు లేకపోయినా అది స్థిరంగా మాత్రం ఉండేది. కులవృత్తిని అవలంబించడానికి విద్యాలయాలూ, ప్రవేశపరీక్షలూ, ర్యాంకులూ, ఉపకార వేతనాలూ (scholarships) , ప్రత్యేకింపులూ (reservations), పెట్టుబడీ, బ్యాంకు ఋణమూ ఏమీ అవసరం లేదు. "నన్నిలా పుట్టించాడు దేవుడు. నేనీ పని చెయ్యాల్సిందే" అనుకునేవారు. అందుచేత దాని మీద ప్రాచీనులకు ఎలాంటి ఫిర్యాదూ లేదు. ఇహ బలాత్కారం ప్రసక్తి ఏముంది ? ప్రతివాడూ ఇంజనీరో, డాక్టరో అవ్వాలనీ, లేకపోతే ఆత్మహత్య చేసుకోవాలనీ బ్రెయిన్‌వాష్ చేసే సమాజం కంటే అది కాస్త మంచి సమాజమే అనిపిస్తోంది.

ఉన్నకులాల నుంచి విడిపోవడం మీదా, కొత్త కులాలేర్పడడం మీదా హిందూ సమాజంలో నిషేధమేమీ లేదు. అందుచేత వృత్తుల ద్వారా కులాల ఆవిర్భావం చాలా స్వాభావికంగా, ప్రజాస్వామికంగానే జరిగిందనుకోవచ్చు. జనం తమ తమ కులాల్లో స్వచ్ఛందంగా, సంతోషంగా కొనసాగిన మాట వాస్తవం. కులపు స్థితిగతులు బాలేకపోతే బాగు చేసుకోవడానికి నడుం కట్టారే తప్ప పుట్టి పెరిగిన కులాన్ని దూషించినవారెవరూ లేరు. రెండోది, తరతరాలుగా ఒక వృత్తిని మానకుండా చేసే ప్రతి సమూహమూ ఒక కులంగా మారింది. ఇది మన సమాజం యొక్క సుస్థిరతను సూచిస్తుంది. స్థిరమైన నివాసమూ, స్థిరమైన పరిపాలన, స్థిరమైన వ్యవసాయ వనరులూ ఉన్నాయి ఈ దేశంలో ! ఇక్కడ జపాన్ లో మాదిరి భూకంపాలు రావు. అరేబియాలో మాదిరి జనం సంచారజీవులూ కారు. కనుక ఒక కుటుంబం తమ మధ్య నివసిస్తూ తరతరాలుగా ఏ పని చేసి బతుకుతుందో ఆ దృష్టితోనే దాన్ని ఇతర సామాజికులు చూడడం సహజం. ఇందులో ఇంకో రహస్యమేమంటే = మనం దేన్నయితే చాలాకాలం పాటు చేయమో దానికి మనం పనికిరామని భావించబడతాం. పనికిరాకపోవడమే కాక అందుకు హక్కే లేదనే అభిప్రాయం కూడా రాజ్యం చేస్తుంది. ఆ పనిని మనం ఒక దుర్ముహూర్తాన చేస్తే అది చూసిన సమాజం ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకుంటుంది. అది సమాజం తప్పు కాదు. మన తప్పే. మనకు హక్కులున్నప్పుడు అవసరమున్నా, లేకపోయినా వాటిని అప్పుడప్పుడైనా వాడుకుంటూ ఉండాలి. అలా వాడుకోని హక్కులకు కాలదోషం పట్టుతుంది. ఆ తరువాత అవి మన పూర్వహక్కులనే విషయాన్నే సమాజం గుర్తించడానికి నిరాకరిస్తుంది. దీన్ని మనం మన దేశపు ద్విజేతర కులాలకు అనువర్తించుకున్న పక్షంలో, బతికితే చాలనుకున్నారు వారి పూర్వీకులు. అలా ద్విజులుగా కొనసాగడానికి గల అన్ని అవకాశాలూ పోగొట్టుకున్నారు. చివరికి "నీకెందుకురా చదువు, గొడ్లు కాసుకోక ?" అని మొహం మీదే అనే పరిస్థితి వచ్చింది.

వంశపారంపర్యాన్ని వదిలిపెట్టి ఏ వృత్తి లాభసాటి అయితే దాని కోసం శ్రమించడం ఈ కాలంలో కొత్తగా వచ్చిపడ్డ ధోరణి. ప్రకృతివనర్లు అనేవి ఉన్నాయనీ, వాటిని యథేచ్ఛగా సైంటిఫిక్ గా దోచుకోవచ్చుననీ అర్థమయ్యాక ప్రబలిన దృక్పథమిది. ఇది ముందు మన కాలంలోని పైవర్గాలలో బయల్దేరి ఆ తరువాత క్రింది వర్గాలకు ప్రాకింది. ఈ స్థాయిలో వనర్ల దోపిడికి కొద్ది మంది మనుషులు చాలరు గనుకా పెక్కండ్రు కావాలి గనుకా పైవర్గాలవారు తాము కల్పించిన వృత్తుల్లోకి (ఉద్యోగాల్లోకి) రావాల్సిందిగా కిందివర్గాల వారిని ఆడవాళ్ళతో సహా ఆహ్వానిస్తున్నారు. ఈ వనర్లు పూర్తిగా ఖాళీ అయిపోయినాక ఈ దృక్పథం కూడా పోతుంది. ఈ ఆహ్వాన పత్రికలు వెనక్కి తీసుకోబడతాయి. అన్ని కాలాల్లోనూ మనుషులు మనలాగే ప్రవర్తించేవారనీ, ఆలోచించేవారనీ అనుకోవడం సరికాదు. పూర్వకాలంలో టంకరూపమైన డబ్బు (minted money) ఇప్పుడున్నంతగా చెలామణిలో లేదు. వస్తువులూ, సేవలూ మాత్రమే విరివిగా దొరికేవి. అందుచేత తరాల తరబడి పోగేసుకోవడం అనేది ఎరుగరు. ఎవరి కులవృత్తి వారికుండేది. పక్కవాడి వృత్తి తాము చేయాలని అనుకునేవారు కారు. అందుచేత ఒక కులం తమకు అన్యాయం చేస్తోందనీ, వారి మూలాన పైకి రాలేకపోతున్నామనీ తలపోసేవారు కారు. ఆనాటి ఉమ్మడి కుటుంబాలు చాలా పెద్దవి. ఎవరి విస్తృతమైన సామాజిక ఆవరణం (social circle) వారికుండేది. కులపంచాయితీలూ, కులశ్రేణుల ద్వారా ఎవరి సామాజిక భద్రత (social security) వారికి వారి కులంలో లభించేది. దాదాపుగా అవసరాలన్నీ స్థానికంగానే తీరిపోయేవి. దేనికీ ప్రభుత్వాల మీద ఆధారపడేవారు కారు.

కులాల ప్రస్తావన రాగానే చాలామంది తఱచుగా పునఃపునరావృత్తంగా ఒక ప్రశ్న వేస్తారు : "వృత్తులూ, వాటితో పాటే వచ్చిపడే న్యూనాధిక్యాలూ ప్రపంచంలో ప్రతి దేశంలోనూ ఉన్నాయి సరే ! కానీ భారతదేశంలో లాగా తరాల తరబడి వంశపారంపర్యంగా ఆ న్యూనాధిక్యాలు కొనసాగడం మాత్రం ఎక్కడా లేదు. ఒక వ్యక్తి తాను చేసే వృత్తి మూలాన సమాజంలో తక్కువశ్రేణివాడైతే ఆ వృత్తి నుంచి విరమించుకొని అంతకంటే ఉన్నతస్థాయి వృత్తిని చేపట్టడం ద్వారా అతనూ, అతని సంతానమూ ఆ దేశాల్లో గౌరవాన్ని పొందుతారు. కానీ భారతదేశంలో మాత్రం కులవృత్తిని వదిలిపెట్టి అంతకంటే మంచి వృత్తిని అవలంబించినా అతని పూర్వీకుల/ పూర్వపు కులవృత్తిని బట్టి అతన్ని అడుగడుగునా తక్కువగా అంచనావేసి కించపఱుస్తారు. దీనికి హిందూ మతమేకారణమా?"

ఇందులో మతానికి జోక్యమేమీ లేదని నా అభిప్రాయం. హిందూమతం గానీ, మఱో మతం గానీ అది భగవంతుణ్ణి ఉపా సించడానికి మార్గాల్ని చూపించే ఒక పరలోక తాత్త్విక సిద్ధాంతాల సంపుటమే తప్ప ఇహలోకంలో మనుషుల సామాజిక ఇష్టా నిష్టాల్నీ, గతినీ అది పెద్దగా శాసించజాలదు. నిజం చెప్పాలంటే అది వాటిని మూలవిధేయంగా అనుసరిస్తుంది కూడా. మను షుల వాలకాల్నీ (moods), ఇష్టానిష్టాల్నీ, అవసరాల్నీ మతానికి ఆపాదించడం తగదు. అయితే మతానికి సహితం లిఖిత సాహిత్యం ఉంటుంది గనుకా దాన్ని మనుషులే వ్రాస్తారు గనుకా వారి సమకాలీన సామాజిక జీవనశైలి అందులో కాస్త ప్రతిబింబించవచ్చు అంతే ! మనుషులు కాలక్రమంలో మారతారు. వారు మనుషులు కాబట్టీ, చెబితే వింటారు కాబట్టీ ! పాత మతగ్రంథాలు మాత్రం మారకుండా అలాగే ఉంటాయి. అవి గ్రంథాలు మాత్రమే కనుక ! వాటి ఆధారంగా ఒక వర్తమాన జీవంత సమాజపు (contemporary living society) స్వరూప స్వభావాల మీద ఒక శాశ్వతమైన తీర్పు చెప్పేసేయ బూనుకోవడం సమీచీన ధోరణి కాదు. పుస్తకాలు మనల్ని సృష్టించలేదు. మనమే పుస్తకాల్ని సృష్టించి కాపాడుతున్నాం. కావా లనుకుంటే, ఆచరణలే ముఖ్యమనుకుంటే ఆ పుస్తకాల్ని తిరగరాసుకునే వెసులుబాటు మనకుంది.

అల్పాదాయ వృత్తులూ, అవమానకరమైన వృత్తులూ ప్రాచీన సమాజాల్లో లేవని కాదు. తప్పనిసరిగా ఉన్నాయి. కాని యంత్రాలు లేనప్పుడు, అన్నీ చేతులతోనే చేసుకునే పరిస్థితైనప్పుడు ఎవఱు మాత్రం ఏం చేయగలరు ? ఏ కాలపు సమాజమూ నూటికి నూఱుశాతం న్యాయబద్ధమైనది కాదు. అంత సంపూర్ణ న్యాయబద్ధ సమాజాన్ని సృష్టించడం బహుశా అసంభవమేమో ! ప్రతికాలంలోనూ అప్పటికి అమల్లో ఉన్న ఆట నియమాల (Rules of the game) మూలంగా మూకు మ్మడిగా నష్టపోయే వర్గాలు కొన్ని తప్పకుండా ఉంటాయి. ఇన్ని ఆదర్శాలు ప్రచారంలోకి వచ్చిన మన కాలపు సమాజంలోనూ అలాంటి వర్గాలు చాలా బోలెడు ఉన్నాయి, కళ్ళు విప్పార్చి చూడగలిగితే ! కానీ అవి ఉన్నాయని ఈరోజు మనం గుర్తించలేం. గుర్తించినా అవి అన్యాయానికి బలవుతున్నాయని ఒప్పుకోలేం. వారి దుఃస్థితికి వారే కారణమని ఆరోపిస్తాం. లేదా అలాంటి వారు కొద్దిమంది అన్యాయమైతే మాత్రం నష్టమేంటని ప్రశ్నిస్తాం. ఆ అన్యాయం వల్ల అంతిమంగా అందఱికీ మంచే జఱిగిం దని వాదిస్తాం. మన కాలపు ఆట నియమాల యెడ మనకున్న అచంచల విశ్వాసం, మన విజయారాధన (success wor ship) మన కళ్ళని అట్లా పొడిచేసి కబోదుల్ని చేస్తుంది. ఎవఱి కాలపు ఆటనియమాలపట్ల వారికీ అంతే విశ్వాసం ఉంటుంది. ఎవఱి ముఖం వారికి కనిపించదు. రోజూ కళ్ళబడే అక్రమాలూ, అపసవ్యాలూ చిరకాల పరిచయప్రాబల్యం చేత విమర్శాతీతం గా కనిపిస్తాయి. ఆ కాలం గడిచిపోయి ఆ పరిస్థితులు మారిపోయినాక ప్రతివాడూ ఓ పెద్ద విప్లవయోధుడే. ప్రతివాడూ తాను పుట్టి పెఱిగని, ప్రస్తుతం ఉనికిలో లేని, ఏనాడో చనిపోయిన, ఇక్ష్వాకుల బారసాల నాటి వ్యవస్థని ధీమాగా ఆక్షేపించేవాడే. తమ

కాలపు సమాజానికి ఎదురుతిరగడానికి తమకు ఈనాడు ఎలాంటి భౌతిక/ పాదార్థిక/ పారిస్థితిక పరిమితులు (physical/ material/ circumstancial limitations) ఎదురవుతున్నాయో బహుశా అలాంటివే అలనాడు పూర్వీకులక్కూడా ఉండి ఉండొచ్చునని వారికి స్ఫురించదు.

## ఎనిమిదో అధ్యాయం

ఒక కులం నుంచి ఇంకో కులం పుట్టుకు రావడం సర్వసాధారణం. ఇలా కాక, వలసొచ్చిన విదేశీ తెగలు (వలస దారులు - immigrants) స్థానికులతో కలవడం ఇష్టం లేక తామూ ఒక కులంగా ఏర్పడడం వల్ల పుట్టుకొచ్చినవి మఱి కొన్ని. ఈ పరిణామాలు వందల, వేల సంవత్సరాల క్రితం జఱగడం మూలాన ఏయే కులాలు ఇలా బయటి నుంచి వచ్చాయో ఈరోజు ఖచ్చితంగా చెప్పలేం. మన దేశపు వాయవ్య, ఈశాన్యసరిహద్దులు మిక్కిలి తెఱుపుడు ప్రాంతాలు (porous parts). సైనిక పహరా లేకపోతే ఎవటైనా తేలికగా వాటిల్లోంచి దేశంలోకి చొఱ బడొచ్చు. ప్రాచీన భారతదేశం చాలా సంపన్నమైనది. ఆ మాట విని వివిధకాలాల్లో అలా చాలామంది చొఱబడ్డారు కూడా ! మూకుమ్మడిగా వేలాదిమందీ, లక్షలాదిమందీ లోపలికి వచ్చేసిన సందర్భాలు కోకొల్లలు. ఉదాహరణకు, రాజస్థాన్‌లోని రాజపుత్రుల (Rajputs) పూర్వీకులు అలెగ్జాండర్‌తో పాటు స్వదేశానికి వెళ్ళకుండా ఇక్కడే దిగబడిపోయిన గ్రీకు సైనికు లని చెబుతారు. అలాంటివారు లక్షలాదిగా ఉండిపోయారట. వారు స్థానిక స్త్రీలని (యుద్ధంలో ఎత్తుకొచ్చినవాళ్ళై ఉంటారు) వివాహం చేసు కొని పిల్లల్ని కని రాజపుత్రులనే పేరుతో ఒక కొత్తకులంగా హిందూమతంలోకి ప్రవేశించారు. ఆ కులస్థులు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా చాలా పెద్దసంఖ్యలో ఉన్నారు. ఎటొచ్చీ వారు మనంత చక్కగా తెలుగు మాట్లాడతారు గనుక, చెప్పుకుంటే తప్ప వారు రాజపుత్రులని గుర్తించలేం.

అలాగే ఉన్నకులాల మధ్యనే కులాంతర వివాహాలు జఱిగి తద్ద్వారా జన్మించిన సంతానం కొత్త కులాలుగా రూపొందిన వైనం కూడా మనకు ధర్మశాస్త్రాల (scriptures) ద్వారానూ, సంస్కృత నిఘంటువుల ద్వారానూ తెలియవస్తోంది. ఇలాంటివాటిని అనులోమ, విలోమ, ప్రతిలోమ వివాహాలని పేర్కొన్నారు. ఇలా జన్మించినవారంతా వారి తండ్రులు అగ్రకులస్థులైనప్పటికీ శూద్రులుగా పరిగణించబడ్డారు. (రాజపుత్రులేమో విదేశీయులైనప్పటికీ అగ్రకులంగా పరిగణించబడ్డారు. వారి భార్యలు క్షత్రియస్త్రీలు కావడం వల్ల నేమో ! ) శాస్త్రాలు నొక్కివక్కాణించిన బీజప్రాధాన్యం ఎందుకో ఇక్కడ వీసమెత్తు పనిచేసింది కాదు. చాతుర్వర్ణ్యంలోని తరతమ భేదాల్ని బట్టి ఇందులో చాలా రకాలున్నాయి. ఉదాహరణకు

*శూద్రస్త్రీకీ, వైశ్యుడికీ పుట్టినవాడు కరణుడు.*
*వైశ్యస్త్రీకీ, బ్రాహ్మణుడికీ పుట్టినవాడు అంబష్ఠుడు*

*శూద్రస్త్రీకి, క్షత్రియుడికీ పుట్టినవాడు ఉగ్రుడు.*
*క్షత్రియస్త్రీకి, వైశ్యుడికీ పుట్టినవాడు మాగధుడు.*
*వైశ్యస్త్రీకి, క్షత్రియుడికీ పుట్టినవాడు మాహిష్యుడు.*
*క్షత్రియస్త్రీకి, శూద్రుడికీ పుట్టినవాడు క్షత్త.*
*బ్రాహ్మణస్త్రీయందు క్షత్రియుడికి పుట్టినవాడు సూతుడు.*
*బ్రాహ్మణస్త్రీయందు వైశ్యుడికి పుట్టినవాడు వైదేహకుడు.*

ఇది కేవలం చాతుర్వర్ణ్యంలోని వర్ణాంతర వివాహాల విషయం. ఇది గాక ఈ సంకర జాతుల మధ్య మళ్లీ కులాంతరాలు జరిగినప్పుడు ఇంకొన్ని కొత్తకులాలు పుట్టి ఉంటాయని ఊహించవచ్చు. ఏతావతా మనకొక విషయం అర్థమవుతోంది. భారతీయ సమాజం వర్ణాంతర, కులాంతర వివాహాల్ని పనిగట్టుకొని ప్రోత్సహించకపోయినా అడ్డుకోలేదు. బహుశా అడ్డుకోలేకపోయిందంటే సరిపోతుంది. కారణం, స్త్రీపురుషుల మధ్యని పరస్పర ఆకర్షణ ప్రపంచంలో అన్నింటికన్నా అత్యంత బలీయమైనది. అది అన్ని ధర్మశాస్త్రాల్నీ రద్దుచేసి పడేస్తుంది. అంటే జనం కోరి కోరి తమ కులాల్లో సభ్యులుగా జీవించారు. కావాల్సినప్పుడు ఆ కులనియమాలనే ఉల్లంఘించారు. ఇందులో పురుషసూక్తం, లేదా మనుధర్మశాస్త్రం, లేదా ఆయన్ని అనుసరించినవారి ప్రసక్తి ఏముంటుంది ? వారి గురుత్వ, ప్రామాణ్యాలు కేవలం గ్రాంథికమూ (textual) , సైద్ధాంతికమూ (theoretical). జనాల ఆచరణ మట్టుకు వేటే ఉంది.

ఈ చక్రం పునరావృత్తం కావచ్చు. అంటే, భవిష్యత్తులో కూడా ఈ గడ్డ మీద కొత్తకులాలు పుట్టుకొస్తాయి తప్ప ఉన్న కులాలు పూర్తిగా అంతరించవు. ఉదాహరణకు - బాగా చదువుకుని, ప్రభుత్వోద్యోగాల్లోనూ, వ్యాపారాల్లోనూ, రాజకీయాల్లోనూ స్థిరపడ్డవారూ, అగ్రకులస్త్రీలను వివాహమాడినవారూ అయిన ఆధునిక మాల  మాదిగలు తక్కువస్థాయి వృత్తులలో కొనసాగుతున్న స్వకులస్థుల నుంచి కాలక్రమేణ విడిపోయి ఎనిమిదో అగ్రకులంగా స్థిరపడవచ్చు. ఆ ప్రక్రియ ఇప్పుడిప్పుడే మొదలయింది.

# తొమ్మిదో అధ్యాయం

## *మానసిక శూద్రత్వం*

వర్ణవ్యవస్థ గురించిన ఆధునికుల అవగాహనా సరళిలో ఒక వ్యాఘాతం (contradiction) దాగుంది. వారు శూద్రత్వాన్ని ఒక వృత్తిగా చూస్తున్నారు. అదే సమయంలో బ్రాహ్మణత్వాన్నేమో ఒక జాతిగా చూస్తున్నారు. ఇదెలా పొసగుతుంది ? చూస్తే రెండింటినీ జాతులుగానే చూడాలి. లేదంటే రెండింటినీ వృత్తులుగానే చూడాలి. అదీ, ఇదీ కాకపోతే ఈ రెండూ ఎక్కడ సమన్వయం అవుతాయో అదైనా పరిశీలించాలి. ఇవి వృత్తులా ? జాతులా ? మనుషుల ప్రవృత్తులు రూపుదిద్దుకునే దశలా (phases)? ఈ అయోమయం (confusion) మనకు మనుధర్మశాస్త్రాన్ని చదివినా కలుగుతుంది. శూద్రులు పరిపాలించే రాజ్యాలలో బ్రాహ్మణులు ఉండకూడదని మనువు వ్రాశాడు. అగ్రజన్ములకు సేవ చేయడం తప్ప శూద్రులకు వేఱే ధర్మం లేదని చెప్పిన మనువు, వారికి రాజ్యాలున్నాయని సూచించడమే పెద్ద అయోమయం. అంటే సేవా వృత్తిరహితంగా కూడా శూద్రత్వం ఉందన్నమాట. శూద్రులు నిజంగా ఒక జాతి అయితే ఆ జాతి ఏది ? అదిప్పుడు ఉనికిలో ఉందా ? ఈనాటి ఏ కులాలవారిని ఆనాటి శూద్రులుగా గుర్తించడానికి అవకాశం ఉంది ?

నా అభిప్రాయం - *"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః"* అని శ్రీకృష్ణ భగవానుడు సెలవిచ్చినట్లుగా, దేనికైనా మనస్సే తొలుదొల్తటి జన్మస్థానం. బ్రాహ్మణత్వాలూ, శూద్రత్వాలూ, చండాలత్వాలూ అన్నీ ముందు మనస్సులో ఉద్భవించి, ప్రవర్తనలో ప్రతిబింబించి, స్వభావంగా ఘనీభవించి, తమలాంటివారు చాలామంది తమతో పోగయినాక ఆఖరికి కులాలుగా, వర్గాలుగా స్థిరపడతాయి.

శూద్రత్వం - చాలామంది భావిస్తున్నట్లుగా సృష్ట్యాది నుంచీ తల్లిదండ్రుల ద్వారా పుట్టుకతో సంక్రమించినది కాదు. మౌలికంగా శూద్రత్వం అనేది, దాని అసలు స్వరూపంలో, ఒక కులం (communal characteristic) గానీ, కులాల సమాహారం గానీ కాదు. '**శూద్ర**'నామంతో వ్యవహృతమయ్యే కులమేదీ ప్రపంచంలో లేదు. శూద్రత్వం ఒక సంస్కారపరమైన వ్యక్తిగత ఎంపిక (a personal choice of self-conditioning). దీనికి సంస్కృతంలో *వరణం* (వర్ణం-choice - వరింపబడేది) అని పేరు. కానీ ఈ వ్యక్తిగత ఎంపిక ఒక వంశంలో రెండు-మూడు తరాల కంటే ఎక్కువకాలం పాటు ప్రభావాన్ని చూపించినప్పుడు అది ఒక శూద్రవంశంగా పరిణమిస్తుంది. అలాంటి శూద్రసంస్కారాలు గల అనేక వంశాలు ఒకే ప్రదేశంలో నివసిస్తూ పరస్పరం సంబంధాల్ని ఇచ్చి పుచ్చుకోవడం చేసినప్పుడు వరణం (వర్ణం) కాస్తా వర్గంగా మారుతుంది. ఆ రకంగా చూసినప్పుడు మనకి ప్రపంచంలోని అన్నిదేశాల్లోను శూద్రులు కనిపిస్తారు. అలాగే శూద్రత్వంలోకి ఇప్పుడిప్పుడే అడుగుపెడుతున్న బ్రాహ్మణులు కూడా కనిపిస్తారు. కాలక్రమంలో వారి వారసులు సంపూర్ణశూద్రులుగా పరిణామం చెందవచ్చు.

ఇలా ఎందుకు జరుగుతుంది ? మొదట్లో వ్యక్తిగత ఎంపిక మాత్రమే అయిన శూద్రత్వం తరువాత వంశానుగత లక్షణంగా, ఆ తరువాత కులలక్షణంగా ఎందుకు పరిణమిస్తుంది ? అంటే, అందుకు రెండు కారణాలు గోచరిస్తాయి. మొదటిది - ఒక వయసొచ్చేదాకా మనం ఇతరుల చేత ప్రభావితులమవుతాం. ఒక వయసు దాటాక మనమే ఇతరుల్ని ప్రభావించడం మొదలు పెడతాం. మనం శూద్రత్వాన్ని ఎంచుకున్నాక మనం దానికి బలమైన మద్దతుదారులుగా మారతాం. మన తత్త్వానికి మద్దతి చ్చేవారినే మనం గురువులుగానూ, స్నేహితులుగానూ, చుట్టాలుగానూ, పక్కాలుగానూ ఎంచుకుంటాం.

రెండోది - మన శరీరంలోని జీవకణాలు ప్రతి ఏడు సంవత్సరాలకి పూర్తిగా చనిపోయి వాటి స్థానే కొత్త కణాలేర్పడతాయి. అలా ఏర్పడిన కణాలు తమకు ముందు జీవించిన కణాల వారసత్వాన్ని స్వీకరిస్తాయి. కనుక మనం పాత వ్యక్తులమేనని మనం అనుకుంటాం. ఒక విధంగా పాత వ్యక్తులమే. ఎందుకంటే పాత కణాల్లో నిక్షిప్తమై ఉన్న మన సంస్కారాల్నీ, అలవాట్లనీ కొత్త కణాలు కూడా యథాతథంగా కొనసాగిస్తాయి. అలా మనం ప్రతి ఏడేళ్ళకీ చనిపోతూ, కొత్త జన్మెత్తుతూ ఉంటాం. అంటే మనం పధ్నాలుగు సంవత్సరాల పాటు ఎడతెగకుండా ఏ విధమైన ఆలోచనలతో, మాటలతో, చేష్టలతో జీవిస్తామో మనం పక్కాగా అదే అవుతాం. అందుకే మన శాస్త్రాల్లో, మేధానాడిని అభివృద్ధి చేసుకోదల్చినవారికి పధ్నాలుగేళ్ళ బ్రహ్మచర్యాన్ని విధించారు. మేధానాడి అభివృద్ధి చెందితే ఎన్ని వేల పుటల సమాచారమైనా పిలవగానే పలికినట్లు గుర్తొచ్చే శక్తి సిద్ధిస్తుంది. ఇందుకు విరుద్ధంగా తమ లైంగిక శక్తిని విశృంఖలంగా దుర్వినియోగం చేసేవారికి చిన్నవయసులోనే మతిమఱుపు పట్టు కుంటుందని మన పెద్దలు సెలవిచ్చారు. అలాగే సత్యపాలన వ్రతానిక్కూడా పధ్నాలుగు సంవత్సరాల నిడివి (duration) ని నిర్దేశించారు. ఈ వ్రతం ఆచరించినవారికి శాపానుగ్రహ శక్తితో పాటు లక్షలాది మందిని ఒప్పించి నడిపించగల జనసమ్మోహ కత్వం (public attraction) సిద్ధిస్తుంది. అలాగే శ్రీరామచంద్రుల వారికి పధ్నాలుగేళ్ళ ప్రవాసాన్ని విధించడం ఆయన్ని శాశ్వతంగా ఆటవికుణ్ణి చేసే ఉద్దేశంతోనే. అంతే తప్ప ఆ తరువాత తిరిగొచ్చి పట్టాభిషేకం చేసుకోవాలని కాదు.

మన లక్షణాలు మనతో అంతరించవు. మన ఆలోచనలు (ideas) మనతో పాటు మరణించవు. అవి మన జన్యువుల (ge nes) లో నమోదై నిద్రాణం (latent or dormant) గా దాగి తగిన సమయం కోసం ఎదురుచూస్తూంటాయి. మనమెవ ఱమో ఏంటో మన వంశీకులక్కూడా తెలియని సుదూర భవిష్యత్తులో మన లక్షణాలు ఒక వారసుడిలో చాలా మట్టుకు వ్యక్తమవుతాయి. ఈనాడు ఒక మనిషి కొన్ని లక్షణాలతో కనిపిస్తున్నాడంటే అతనిలాంటి మనిషి ఇంకొకడు అదే వంశంలో కొన్ని తరాల క్రితం తప్పనిసరిగా ఉండే ఉంటాడు. అందుచేత తరాల తరబడి శూద్రజీవితంతో శూద్రాలోచనలతో గడిపినవారు శూద్రులుగానే స్థిరపడతారు. వారు తమ మానసిక శూద్రతా ప్రేరణలకు అనుగుణమైన జీవికనూ, జీవనశైలినీ కౌగలించు కుంటారు. ఆ విధంగా వారు ఉన్నతస్థాయి ఆలోచనలు గలవారితో సంబంధ బాంధవ్యాలకు స్వాభావికంగానే అనర్హులవు తారు. ఈ ప్రక్రియని క్రమ్మఱించగల (process-reversing) మేధావి ఎవఱైనా దైవవశాత్తూ వారి వంశంలో జన్మించి, పరి స్థితులనుకూలించి శూద్రత్వంలోంచి బయటపడే అవకాశాన్ని అందుకుంటేనే తప్ప ఈ స్థితికి తెఱిపడదు. అయితే అలాంటి వాడొక్కడి వల్లా అతని వంశమొక్కటే లాభపడుతుంది. వారి వలయం (circle) లోని వారందఱికీ శూద్రత్వం నివర్తిస్తుందని చెప్పలేం.

*జన్మనా జాయతే శూద్రః సంస్కారాద్ ద్విజ ఉచ్యతే* |

*(పుట్టుకతో ప్రతివాడూ శూద్రుడే. ఉపనయనాది సంస్కారం చేత మనిషి ద్విజుడవుతాడు)* అని ఒక శ్లోకం ఉంది. ఉపనయనం ద్విజులకు ఎంత ముఖ్యమో చెబుతూ దీన్ని ఉటంకించడం (quoting) తఱచు. అయితే దీన్ని ఉటంకించేవారు- కుల రీత్యా శూద్రులుగా జన్మించి శూద్రులుగానే కొనసాగుతున్న ఇతరులకు ఉపనయన సంస్కారం ఎందుకు లేకుండా పోయిందో అది మాత్రం చెప్పరు. నా అభిప్రాయంలో- కట్టుతప్పక ముందు ప్రతిజాతీ పరిశుద్ధంగానే ఉండేది. ఈనాడు కూడా పుట్టుకతో ప్రతిపిల్లవాడూ బ్రహ్మపుత్రుడే. దైవభక్తుడే. గురుభక్తుడే. ప్రతివాడూ ప్రేమస్వరూపుడే. కానీ పూర్వజన్మ సంస్కారాలూ, ఆనువంశిక జన్యువుల వల్లనే కాక తప్పుడు పెంపకం వల్ల కూడా మనిషి మధ్యలో శూద్రుడవుతున్నాడు. ఆ శూద్రత్వాన్ని పోగొట్టి మళ్ళీ ద్విజత్వాన్ని కలిగించడం కోసం కృత్రిమంగా ఉపనయన సంస్కారం ఒకటి మళ్ళీ అవసరమవుతోంది. పెంపకం కొన్నిసార్లు చేసే నష్టమేంటంటే- అది అన్నెం పున్నెం ఎఱుగని పసివయసులో కొన్ని రోజువారీ దృశ్యాలకూ, అలవాట్లకూ మప్పడం ద్వారా వాటిపట్ల మనస్సు అసున్నితం (insensitive) గా మారిపోయేలా, స్పందనాశక్తినీ, ప్రశ్నించే శక్తినీ కోల్పోయేలా చేస్తుంది. ఈ ప్రక్రియకు బ్రాహ్మణులు కూడా అతీతులు కారు.

**సంస్కారమంటే ?** ఒకప్పుడు మనం దేన్నయితే కావాలని కోరి ప్రయత్నపూర్వకంగా అలవఱచుకొంటామో, లేదా అవసరార్థం సుదీర్ఘకాలం పాటు అవలంబిస్తామో, అదే ఆ తరువాతి కాలంలో అప్రయత్నంగా, మనకి తెలియకుండానే, మన సంకల్పం లేకుండానే మన మనస్సులోను, శరీరంలోను ఒక ప్రేరణగా వ్యక్తం కావడమే సంస్కారం అనబడుతుంది. దీనికే 'వాసన' అని నామాంతరం. (A deliberate choice and conscious practice producing in tandem a lasting involuntary and unintended reflex in the later course) సంస్కారాన్ని ఆత్మ చేసుకున్న అలవాటుగా భావించవచ్చు. ఉదాహరణకి- మనం ఒక కొత్త ఊరికి వెళ్ళినప్పుడు మొదట్లో అక్కడ ఆఫీసు నుంచి ఇంటికి వెళ్ళే దారిని ప్రయత్నపూర్వకంగా కొన్ని కొండగుర్తుల (landmarks) తో జ్ఞాపకం ఉంచుకుని తిరుగుతాం. కొంతకాలం పోయాక మన మిత్రుడు మన పక్కన కూర్చుని చెబుతున్న కబుర్లలో ఉత్సాహంగా పాల్గొంటూండగానే అసంకల్పితంగా మనం నడుపుతున్న కారు మన ఇంటివైపు పరుగు తీస్తూంటుంది. మన కాల్సేతులు అలా స్వయంచాలితమైపోతాయి. అది సంస్కార బలం.

కానీ అలవాటూ, సంస్కారమూ ఒకటి కావు. అలవాటుని వదిలించుకోగలం. సంస్కారాల్ని అంత సులభంగా వదిలించుకోలేం, అవి అంతఃప్రేరణలు కనుక. ఒక డబ్బాలో ఘాటైన వాసన గల పదార్థాన్ని చాలాకాలం పాటు నిలువ చేశాక, ఆ పదార్థాన్ని పూర్తిగా అందులోంచి తొలగించి, ఆ డబ్బాని శుభ్రంగా పదిసార్లు కడిగినా సరే, ఆ పదార్థం తాలూకు వాసన దాన్ని పూర్తిగా వదలదు. అలాంటిదే సంస్కారం కూడా. అది మరుజన్మక్కూడా వెంటొస్తుంది. ఇది మంచీ, చెడూ రెంటికీ సమానంగా వర్తిస్తుంది. ఒక మనిషి విషయంలో సంస్కారం అయినదే ఒక జాతి విషయంలో సంస్కృతి అవుతుంది.

ఈనాడు మనలో వ్యక్తమవుతున్న సంస్కారం, లేదా సంస్కార రాహిత్యం ఒకప్పుడు మనం "అది మంచి మార్గం" అని తర్కసహితంగా (అది ఎంత చెత్త తర్కమైనా సరే) ఆలోచించి, నమ్మి ఉద్దేశ పూర్వకంగా అవలంబించినదేననీ, అది మనలో శాశ్వతంగా కాపురం ఉండాల్సిన అవసరం లేదనీ, దాన్ని ఇచ్ఛానుసారంగా మార్చుకోవచ్చుననీ గ్రహిస్తే అది మనల్ని వదిలి పోతుంది. ఇక్కడ మనం గ్రహించాల్సింది- మన ఇష్టాలతో పోలిస్తే మన తర్కాలకి ఏ విధమైన విలువా లేదని !

**శూద్ర లక్షణాలు** : శూద్రత్వంలో కొన్ని స్వయంచర్యలూ (actions), కొన్ని ప్రతిచర్యలూ (reactions) సమ్మేళించి ఉంటాయి. పచ్చి లౌకికత్వం, అంకితభావ రాహిత్యం, కటిక వర్తమానంలో జీవించడం, తనపై తనకు అదుపు లేని స్వభావం, అంతులేని స్వార్థచింతన, అసున్నితత్వం (అశుచి, అపరిపూర్ణత, అసౌష్ఠవం లేదా imperfection మఱియు perfection ఎడల ద్వేషం)- ఇవి శూద్రతాశీలుర యొక్క స్వయంచర్యలు. బ్రాహ్మణద్వేషం, గురుద్వేషం, మతవిరోధం, శ్రద్ధాస్థానాల (authority) పట్ల, నియమాల పట్ల వ్యతిరేకత ఇవి వారిలోని ప్రతిచర్యలు. బ్రాహ్మణులు లేని దేశాల్లో బ్రహ్మద్వేషం అనేది అన్ని తెగల దైవజనుల యెడా తృణీకారభావరూపంలో వ్యక్తమవుతుంది. అంటే శూద్రత్వం హైందవానికి పరిమితం కాదు. మచ్చుకు - హిందూమతంలో ఉండగా బ్రాహ్మణుల్ని ద్వేషించి ఆ ద్వేషకారణంగా మతాంతరిల్లినవాడు ఆ కొత్తమతంలోని మతగురువుల్ని సైతం గౌరవాదరాలతో మన్నించజాలడు.

# పదో అధ్యాయం

మనుషులు శ్రమసాపేక్ష వృత్తుల్ని (labour-intensive occupations) చేపట్టినాక శూద్రులయ్యారా ? లేక శూద్రలక్షణాల్ని అలవర్చుకున్నాక శ్రమసాపేక్ష వృత్తుల్ని చేపట్టారా ? ఇదొక చిక్కుప్రశ్న. ఇందులోని పౌర్వాపర్యక్రమం అన్ని సందర్భాల్లోనూ ఒకేలా ఉండకపోవచ్చు. మనుషుల సామూహిక శూద్రత్వం మట్టుకు శ్రమసాపేక్ష వృత్తుల్ని చేపట్టడం వల్లనే కావచ్చు. అంటే, కొత్తగా కనుగొన్న సాధనాల్ని (appliances) తయారుచేసి అమ్మడం పట్ల తొలుదొల్త ఆసక్తి వహించిన అగ్రకులాలవారే క్రమేపీ తరువాతి తరాలలో శూద్రులై ఉండొచ్చు. ఎందుకంటే ఆ తయారు చేయడంలో శరీరశ్రమ చాలా ఉంటుంది కనుకా, శరీరశ్రమకి అంకితమైనవారు బౌద్ధికశ్రమ చేయరు గనుకా, బౌద్ధికశ్రమ బొత్తిగా లేకపోవడం కాలక్రమంలో హీనసంస్కారాలకూ, శూద్రత్వానికీ దారితీస్తుంది గనుకా ! ఇది శూద్రజనాభా ఉద్భవించిన ప్రారంభదశకు అన్వయించే మాట. కానీ తదనంతర కాలంలో మనుషుల వైయక్తిక శూద్రత్వం మాత్రం శూద్ర మనస్తత్త్వ బీజాలకు (అంతకుముందే శూద్రులైనవారి) సాంగత్యమూ, శ్రమసాపేక్ష జీవికా తోడవ్వడం వల్ల కావచ్చు. ఈ సందర్భంలో శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన ఒక మాట గుర్తుకొస్తోంది. వృత్తి మూలాన ప్రవృత్తీ, ప్రవృత్తి మూలాన వృత్తీ పర స్పరం ప్రభావితం అవుతాయన్నారు ఆయన.

మన పూర్వసాహిత్యమంతా మొదటి దశ (శ్రమసాపేక్ష వృత్తుల్ని చేపట్టినాక శూద్రులు కావడం) గడిచిపోయినాక రచించ బడింది. అందుచేత ఆ విషయాన్ని స్పష్టంగా తెలుసుకునేందుకు తగినన్ని ఆకరాలు (sources) లేవు. రెండో దశ (శూద్ర లక్షణాల్ని అలవర్చుకున్నాక శ్రమసాపేక్ష వృత్తుల్ని చేపట్టడం) గుఱించి మాత్రం కొంత తెలుసుకోవడానికి అవకాశం ఉంది. ప్రతి కాలంలోనూ ద్విజకులాల్లో వారి జీవనవిధానానికీ, వారు నమ్మే సామాజిక విలువలకూ సరిపోలని స్వభావం గల తిక్క తత్త్వాలు (eccentic personalities) అడపా దడపా జన్మించినట్లు మన పూర్వసాహిత్యం సాక్ష్యమిస్తోంది. వారిని ఎవఱూ కులంలోంచి వెలివేయకపోయినా వారు తమని తామే వెలివేసుకొని (వెలివేసుకున్నంత పనిచేసి) కులం నుంచి నిష్క్రమించి నట్లు తెలుస్తోంది. నా అభిప్రాయంలో, ఇటువంటివారు దేశవ్యాప్తంగా ప్రతితరంలోనూ, ప్రతిగ్రామంలోనూ ఉద్భవిస్తూనే ఉన్నారు, ఇప్పటికీ ! అంటే ఈ నిష్క్రమణల మూలాన ఒక వెయ్యేళ్ళ కాలమానంలో ద్విజకుల జనాభా ఎంత పెద్దయెత్తున తగ్గిపోగలదో ఆలోచించుకోవచ్చు.

## *శ్రీమద్భాగవతం షష్ఠస్కంధంలో శుకమహర్షి చెప్పిన అజామిళుని కథ*

కన్యాకుబ్జమనే పట్టణం (కనౌజ్, ఉత్తరప్రదేశ్) లో అజామీళుడనే బ్రాహ్మణ యువకుడుండేవాడు. అతడు వేదశాస్త్రాలు అధ్యయనం చేసి సదాచారమూ, గురుజనభక్తీ గలిగి ఉండేవాడు. ఒకనాడు అతడు అడవి నుండి సమిధలూ, పూలూ కోసుకొని వస్తూండగా దారిలోఒక పొద మాటున ఒక నిమ్నజాతిస్త్రీ తన ప్రియునితో కామకేళిలో మైమఱచి పాల్గొంటూం డడం చూశాడు. సౌందర్యవతియైన ఆమెయందు కోరిక వహించి నిత్యనైమిత్తిక కర్మల్ని, తల్లిదండ్రుల్నీ, భార్యనూ విడిచిపెట్టి ఆమెతో కలిసి అడవిలోనే నివాసమేర్పఱచుకున్నాడు. ఆమె ద్వారా బిడ్డల్ని కని వారి పోషణ నిమిత్తం అనేక పాపాలు చేసి చనిపోయాడు. చనిపోయే ముందు ఆ బిడ్డలలో ఒకడైన నారాయణుడనేవాణ్ణి "నారాయణా ! నారాయణా !" అని పిలవడం వల్ల ఆ భగవన్నామోచ్చారణ మహిమాతిశయం చేత పరిశుద్ధుడై వైకుంఠానికి వెళ్ళాడు.

## *తెనాలి రామలింగ కవి రచించిన పాండురంగ మాహాత్మ్యం తృతీయాశ్వాసంలోని నిగమశర్మ కథ*

ఒకప్పుడు ఆంధ్రదేశంలో తూర్పుగోదావరిజిల్లా పిఠాపురం పట్టణంలో సభాపతి అనే శ్రోత్రియ బ్రాహ్మణుడికి నిగమశర్మ అనే కుమారుడు జన్మించాడు. సభాపతి తన కుమారుడికి శాస్త్రవిహితంగా జాతకర్మ, ఉపనయనాది సంస్కారాల్ని నిర్వర్తించి వేదశాస్త్రాభ్యాసంలో ప్రవేశపెట్టాడు. ఎంత చదువుకున్నా నిగమశర్మ మనస్సు మాత్రం ఎల్లప్పుడూ పరస్త్రీలయందే లగ్నమై ఉండేది. తండ్రి అతనికి సకాలంలో పెళ్ళి చేసినప్పటికీ భార్యమీద అనురాగం ఉండేదికాదు. వేశ్యాజనమంటే పడిచచ్చేవాడు. వారి పొందు కోసం పిత్రార్జితమైన ఆస్తులన్నీ తెగనమ్మాడు. అప్పులపాలయ్యాడు కూడా ! ఆ తరువాత అప్పులవాళ్ళ భయం తో ఇంటికి రావడం మానేశాడు. కొంతకాలానికి ఆ ఊళ్ళోనే కనిపించడం మానేశాడు.

తన తమ్ముడు చాలా చెడిపోయాడనీ, నిష్ఠదరిద్రుడయ్యాడనీ విన్నదతని అక్క. (ఆమె పేరేంటో కవి వ్రాయలేదు. "నిగమశర్మ అక్క" అన్నాడంతే) ఆమె అత్తవారిల్లు అక్కణ్ణుంచి నలభై-యాభై మైళ్ళు. అయినా సరే, వెళ్ళి తమ్ముడికి నాలుగు మంచి మాటలు చెప్పి, దారిలోకి తెచ్చి పుట్టింటి గౌరవాన్ని తిరిగి నిలబెట్టాలని నిశ్చయించుకుంది. భర్తా పిల్లలతో సహా ఏదో వంకతో పుట్టింటికి వచ్చింది. తమ్ముణ్ణి దగ్గఱ కూర్చోబెట్టుకొని ఎన్నో ఉపదేశాలు చేసింది. అక్క దగ్గఱ నిగమశర్మ బుద్ధిగా కూర్చుని, నిశ్శబ్దంగా నోరు మూసుకుని ఆమె చెప్పినవన్నీ విన్నాడు. మంచివాడిలా తలూపాడు. అక్క సంతోషించింది. తమ్ముడు తప్ప కుండా మారతాడని ఆశించింది. అప్పటికి మారినట్లే నటించాడు. వాడు తేనెపూసిన కత్తి అని ఆమెకు తెలియదు. అలా కొన్నిరోజులు గడిచిపోయాయి. "అంతా బానే ఉం"దనుకుంటున్న తరుణంలో ఒకనాటి అర్ధరాత్రివేళ నిగమశర్మ లేచి ఇంట్లో ఉన్నవాళ్ళందఱి ఒంటి మీదున్న ఆభరణాలతో సహా యావత్తు సొమ్ములూ దోచుకుని పలాయనం చిత్తగించాడు. తెల్లవాఱగా నే లేచి, చూసుకుని అందఱూ లబో దిబో !

నిగమశర్మ ఆ ధనాన్ని తీసుకొని అడవికి పారిపోయాడు. అక్కడ కొందఱు దొంగలు అతన్ని పట్టుకొని చావగొట్టి దాన్ని అపహరించి తలో దిక్కుకీ పరిగెత్తారు. నిగమశర్మ ఆ అడవిలో అలా దెబ్బలు తగిలి కుయ్యోమొఱ్ఱో అని పడి ఉండగా ఒక కాపు యువకుడు అక్కడికి రావడం తటస్థించింది. అతన్ని చూసి, జాలిపడి, లేవనెత్తి తన యింటికి తీసుకెళ్ళాడు. అక్కడ జఱిగిన సపర్యలతో నిగమశర్మ కొన్నిరోజులకు కోలుకున్నాడు. ఇంతలో అందగాడైన నిగమశర్మను చూసి ఆ కాపు యువకుడి భార్య పీకల్లోతు మోహంలో కూరుకుపోయింది. కృతఘ్నుడైన నిగమశర్మ ఆమె మనోభావాల్ని గ్రహించి తదనుగుణంగా స్పందించాడు. ఇద్దఱూ ఒక దుర్ముహూర్తాన లేచిపోయారు. అడవిలో ఒక బోయపల్లెలో కాపరం పెట్టారు. అక్కడ ఆ కాపుస్త్రీ, నిగమశర్మా ఇద్దఱూ పశుపక్ష్యాదుల్ని వేటాడీ, వెదురుబియ్యం సేకరించీ, ఆ పదార్థాలతో కడుపు నింపుకుంటూ యథేచ్ఛా విహారాలతో చాలా కాలం గడిపారు.

కొంతకాలానికి ఆ కాపుస్త్రీ చనిపోయింది. ఆ తరువాత నిగమశర్మ ఒక మాల సంగీత పాఠకురాల్ని తగులుకున్నాడు. ఆమెతో కాపరం చేసి పిల్లల్ని కూడా కన్నాడు. (పెళ్ళి చేసుకున్నట్లు లేదు) అడవిలో ఆ సంసారాన్ని పోషించడం కోసం దొంగతనాలకూ, దోపిడీలకూ అలవాటు పడ్డాడు. ఆ దారిన పోయే ఎంతోమంది బ్రాహ్మణుల్ని చంపి దోచుకున్నాడు. పనిలో పనిగా వేట క్కూడా వెళ్ళేవాడు. ఒకనాడు అలా వేటకు వెళ్ళి తిరిగొచ్చేసరికి తన యిల్లూ, అందులో నిద్రిస్తున్న తన భార్యాబిడ్డలూ మంటల్లో కాలిపోయి ఉండడం చూసి పట్టరాని శోకంతో విలపించాడు. ఆ దుఃఖంలో మతిపోయినట్లయి, దేశద్రిమ్మరిలా తిరుగుతూ తిరుగుతూ చివఱికొక నృసింహక్షేత్రానికి చేఱుకొని అక్కడ మరణించాడు. ఆ పుణ్యఫలం మూలాన నరకానికి బదులు వైకుంఠానికి వెళ్ళాడు.

## *శ్రీనాథ మహాకవి రచించిన శివరాత్రిమాహాత్మ్యంలోని సుకుమారుని కథ*

వింధ్యపర్వతాల దగ్గఱ నర్మదా నదీతీరంలో ఒక బోయజాతివారి రాజ్యం ఉండేది. దానికి రాజధాని రత్నపురం. ఆ నగరానికి సమీపాన ఉన్న అడవిలో ఓంకారేశ్వరుడనే పేరుతో సదాశివుడు వెలిశాడు. ఆ బోయవారి రాజు హేమాంగదుడు. అతడు

సకలశాస్త్ర విశారదుడైన యజ్ఞదత్తుడనే బ్రాహ్మణుణ్ణి తన రాజ్యానికి ప్రధానమంత్రిగా నియమించాడు. ఆ యజ్ఞదత్తుడి భార్య పేరు సుశీల. ఆమె మిక్కిలి యోగ్యురాలు. చాలాకాలం పాటు నిస్సంతులుగా ఉన్న ఆ దంపతులకు చివరికి ఓంకారేశ్వరుడి అనుగ్రహంతో సుకుమారుడనే కుమారుడు జన్మించాడు. మంత్రికుమారుడు కావడాన అతడు ఉపనయనమైనప్పటి నుంచీ బ్రాహ్మణ-క్షత్రియోచితమైన విద్యలన్నీ యథావిధిగా నేర్చుకున్నాడు. వయసొచ్చింది మొదలుగా అతని అపర మన్మథరూపం రత్నపుర స్త్రీలను మోహపరవశురాళ్ళుగా చేయసాగింది.

*"మంచి కులం, మంచి వయసు, విద్య, సౌందర్యం, ధనం, హోదా- మనిషిని మత్తెక్కించడానికీ, మదోన్మత్తుణ్ణి కావించడానికీ, సర్వనాశనం చేయడానికీ వీటిల్లో ఏదో ఒకటి సరిపోతుంది కదా ! అలాంటిది, ఇవన్నీ కలిగి ఉన్న సుకుమారుడు చెడిపోవ డంలో ఆశ్చర్యమేముంది ?"* అని వ్యాఖ్యానిస్తాడు శ్రీనాథ మహాకవి, సుకుమారుడి గురించి ! సుకుమారుడికి ఆనాటి ఆచారాన్ని అనుసరించి త్వరగానే పెళ్ళయింది. కానీ అతనూ, అతని స్నేహితులూ కలిసి జూదమూ, త్రాగుడూ, వ్యభిచారమూ మొదలైన అన్ని వ్యసనాలకూ అలవాటుపడ్డారు. సుకుమారుడైతే వేశ్యలతో సంతృప్తి చెందక నగరంలోని సంసార కన్యలలో అందమైనవారెవరో వెతికి రప్పించుకొని అనుభవించడం మొదలుపెట్టాడు. ఈ అక్రమ శృంగార వ్యామోహంలో చిక్కి సంధ్యావందనం, గాయత్రి, హోమాలూ, పూజలూ, వేదపారాయణ మొదలైన అన్ని బ్రాహ్మణోచిత కర్తవ్యాలకూ తిలోదకాలిచ్చేశాడు. కొడుకు పూర్తిగా చెడిపోయిన సంగతి అర్థం చేసుకున్న యజ్ఞదత్తామాత్యుడు మిక్కిలి విచారించి, ఒకరోజు దగ్గరికి పిలిచి హితబోధ చేశాడు. తల్లి కంట నీరు పెట్టింది. ఆ సమయానికి సుకుమారుడు తల్లిదండ్రులకేదో చెప్పి ఊరుడించాడు. కానీ తానెలాగూ పూర్తిగా చెడిపోయాడనీ, మళ్లీ బాగుపడడం తనకు అసాధ్యమనీ తలపోశాడు. వేదశాస్త్రాలు మానవకల్పితాలేననీ, జీవులన్నీ సమానంగా సుఖదుఃఖాలు అనుభవిస్తున్నాయనీ, ఇందులో ఉన్నతుడూ, నిమ్నుడూ అనే తేడా సృష్టిలో లేదనీ, అందుచేత ఇది చేత ఇది చేయొచ్చు, ఇది చేయకూడదు అనే విధినిషేధాలు అర్థం లేనివనీ కుతర్కించుకున్నాడు. (అతని విద్య అందుకు ఉపయోగపడింది) ఆ తరువాత అతని విశృంఖలత్వం మరింత పెచ్చుమీరింది. ఆ వార్తలు రాజు దాకా వెళ్ళాయి. పురజనుల ప్రార్థనపై హేమాంగదుడు సుకుమారుడికి రాజ్య బహిష్కారశిక్ష విధించాడు.

అలా స్వదేశభ్రష్టుడైన సుకుమారుడు కొంతకాలం పాటు కీకట దేశానికి వెళ్ళి ఆ తరువాత హూణమండలమనే దేశంలో ప్రవేశించాడు. అక్కడ ఒక మాలస్త్రీని చూసి మోహంలో పడ్డాడు. ఆమె కూడా అతన్ని చూసి మోహంలో మునిగింది. ఇద్దరూ ఏకమయ్యారు. సుకుమారుడు ఒకపక్క బ్రాహ్మణుడుగా ఉంటూ మరోపక్క అబ్రాహ్మణకృత్యాలు (మద్యం, మాంసం సేవించడం, చండాలస్త్రీ సంపర్కం, వేట మొ||) చేస్తూండడాన్ని హూణమండలంలో కొందరు కనిపెట్టారు. ఆ సంగతి తెలుసుకుని ఆ మాలెతతో సహా సుకుమారుడు అక్కణ్ణుంచి ఉడాయించాడు. ఇద్దరూ కలిసి వణిక్పథపురమనే ఊరు చేరుకుని స్వచ్ఛమైన బ్రాహ్మణ దంపతుల్లా ఒక యిల్లు తీసుకుని కాపరం పెట్టారు. వివిధ శాస్త్రాలలో సుకుమారుని పాండిత్యానికి అక్కడి బ్రాహ్మణులు ముగ్ధులయ్యారు. అతని నిజస్వరూపం తెలియక తమని మించిన సద్బ్రాహ్మణుడుగా వారతన్ని పరిగణించేవారు. కాలక్రమంలో ఆ అక్రమ దంపతులకు ఇద్దరు కూతుళ్ళు కలిగారు. వారు పెరిగిపెద్దవారయ్యాక ఆ మాలెత చనిపోయింది. దాన్తో కామాంధుడైన సుకుమారుడు తన కూతుళ్ళమీదనే కన్నేశాడు. అతని వల్ల వారికి ఇద్దరు కుమారులు కూడా కలిగారు. "అతిరహస్యం బట్టబయలు" అన్నట్లు ఈ విషయం బయటపడేసరికి దిగ్భ్రాంతి చెందిన అక్కడి బ్రాహ్మణ్యం

అతన్ని ఆ నగరంలోంచి కట్టుబట్టలతో సహా వెళ్ళగొట్టడమే కాకుండా, అతనితో ఇంతకాలం సంబంధ బాంధవ్యాలు పెట్టుకున్న మహాదోషానికి భయంకరమైన ప్రాయశ్చిత్తకర్మలు ఆచరించి, తమను తాము ఆధ్యాత్మికంగా శిక్షించుకుని ఆఖరికి పరిశుద్ధులమయ్యామని తృప్తి చెందారు.

సుకుమారుడు అలా తన కూతుళ్ళతోనూ, వారి వల్ల కలిగిన కొడుకులతోనూ వణిక్పథపురాన్ని విడిచి ఒక అడవికి చేరుకుని అక్కడ ఒక బోయపల్లెలో నివసించసాగాడు. ఎనభయ్యేళ్ళ వయసులో అతను వణిక్పథ నగరానికి దగ్గరలో ఉన్న నాగేశ్వరాలయంలో శివరాత్రినాడు కాకతాళీయంగా చేసిన దైవదర్శనమూ, దీపదర్శనమూ, ఉపవాసమూ, జాగారమూ మూలాన తాను చేసిన పాపాలన్నింటి నుండీ విముక్తుడై కైలాసానికి వెళ్ళాడు.

## పదకొండో అధ్యాయం

శ్రీనాథుడే మరో సందర్భంలో రచించిన గుణనిధి కథా, బుద్ధచరిత్రలో వచ్చే అంగుళిమాలుడి కథా, పండరీపురంలోని పాండురంగ క్షేత్రాన్ని స్థాపించిన పుండరీకుడి కథా ఇలాంటివే. ద్విజులు శూద్రత్వాన్ని పొందడం ప్రతి సందర్భంలోనూ అచ్చంగా ఇలాగే జరిగిందని చెప్పడం నా ఉద్దేశం కాదు. ఈ ఉదంతాల్ని లిపిబద్ధం చేయడంలో మనవారి లక్ష్యం వేరు. వారీ వృత్తాంతాల్ని మతదృష్టితో మాత్రమే తెలియజేశారు. సామాజిక పరిణామాల దృష్టి వారికి లేదు. మనిషి తన కులం నుంచీ, జ్ఞానం నుంచీ , సామాజిక/ లైంగిక నీతి నుంచీ పతనం చెందడం, అయినప్పటికీ భగవంతుని సన్నిధిని తెలిసో, తెలియకో అనుభవంలోకి తెచ్చుకోవడం, తద్ద్వారా అతని పాపాలన్నీ నిరస్తమై అతడు అధోగతికి బదులుగా ఊర్ధ్వగతుల్ని ప్రాపించడం - ఇదీ, వీటన్నింటా సర్వసామాన్యంగా కానవచ్చే ఇతివృత్తం. మోక్షానికి జ్ఞానం చాలు, వేదశాస్త్ర పరిజ్ఞానంతో నిమిత్తం లేదని ఒకరు చెప్పగా, జ్ఞానం కూడా అవసరం లేదు, భక్తి ఉంటే చాలు, అదే జ్ఞానంతో సమానమని ఇంకొకరన్నారు. భక్తి కూడా అవసరం లేదు, భగవంతుని సన్నిధిని ఏదో ఒక రూపంలో యాంత్రికంగా కాసేపు అనుభవించినా చాలు, మానవాత్మ శాశ్వతంగా సద్గతులకు వెళుతుందని చెప్పడమే ఈ తెలుగు కథల ధ్యేయం. ఈ వృత్తాంతాల్లో కానవచ్చే మరో విశేషం - సామాజిక విలువల అతిక్రమణని పాపంగా అభివర్ణించడం, ఆ అతిక్రమణ మూలంగా మరణానంతరం వారి ఆత్మల్ని పట్టుకుపోయి శిక్షించేందుకు నరకలోకంనుంచి యమకింకరులొచ్చారని చెప్పడం. ప్రాచీన నాగరికతల్లో వ్యక్తుల పాలిట సమాజమే దేవుడై కూర్చున్న సాంస్కృతిక/ మానసిక స్థితిని ఇది సూచిస్తోంది. నిజానికి స్వీయ కులాచారాన్ని వదిలిపెట్టడమూ, నచ్చిన స్త్రీలతో లేచిపోవడమూ తప్ప ఈ వృత్తాంతాల్లోని కథానాయకులు చేసిన దైవాపరాధాలూ, మహాపకారాలూ ఏమీ కనిపించవు. ఒక్క నిగమశర్మ విషయంలోనే దొంగతనాల సందర్భంగా హత్యలు చేశాడని చెప్పబడింది. అలాగే సుకుమారుడు కన్నకూతుళ్ళనే పాడుచేశాడని చెప్పడింది. అంతమట్టుకే !

గమనిస్తే, ఇలాంటి వృత్తాంతాలన్నీ బ్రాహ్మణుల గురించి బ్రాహ్మణులే వ్రాసినవి. ఇతర అగ్రకులాల పరిస్థితి తెలుసుకుందామంటే వారిలో బ్రాహ్మణులంత విరివిగా కవులు లేరు. అయితే వారిలోనూ ఇలాంటి తత్త్వాలు లేకపోలేదని అనుమానించ

వచ్చు. ఉదాహరణకు- తెలుగు క్షత్రియులలో వెలిరాజులనే శాఖ ఒకటుంది. వారితో సుక్షత్రియులు సంబంధాలు కలుపు కోరు. వెలిరాజుల్ని అడిగితే తామూ క్షత్రియులమేనని చెబుతారు. కనుక ఏదో ఒక కాలంలో ఏదో ఒక కారణం చేత కులపెద్దల చేత వెలివేయబడ్డ క్షత్రియులంతా కలిసి వెలిరాజులుగా ఏర్పడ్డారని ఊహించవచ్చు.

నిగమశర్మాదులవి అత్యంత తీవ్రమైన తత్త్వాలు. వారిని జనసామాన్యంలో భాగంగా పరిగణించలేం. అందుచేత శూద్రుల్లో కలిసిన ప్రతి బ్రాహ్మణుడూ ఖచ్చితంగా నిగమశర్మలా, సుకుమారుడిలా సర్వభ్రష్టుడైన తరువాతే అలా కలిశాడనుకోవడానికి లేదు. ఏ తప్పూ చేయకుండా, ఏ వ్యసనానికీ లోను కాకుండా, ఏ సామాజిక విలువనీ అతిక్రమించకుండా కేవలం లౌకిక జీవనాపేక్ష చేత శూద్రుల్లో కలిసిన బ్రాహ్మణులే ఎక్కువమంది ఉండి ఉంటారు. ఇందులో శూద్రస్త్రీల పట్ల ఆసక్తి ఒక ప్రధానమైన చోదకశక్తి అయినప్పటికీ దాని పాత్ర పరిమితమే. అసలు విషయం - ఆ బ్రాహ్మణులకు బ్రాహ్మణ జీవనవిధానం సరిపడక పోవడం. అలా సరిపడని పూర్వసంస్కారాలతో వారు జన్మించడం. తమ సంస్కారానికి తగ్గ సాన్నిహిత్యాల్ని వెతుక్కుంటూ వారు వెళ్ళిపోయారనుకోవాలంతే !

## *బ్రాహ్మణుల జీవన శైలి - దినచర్య*

బ్రాహ్మణులు పేదఱికంలో జీవించాలని పైకి స్పష్టంగా చెప్పకపోయినా మనువు వ్రాసిన ధర్మశాస్త్ర శ్లోకాల సారాంశం మొత్తం అదే. పూజారితనం, పౌరోహిత్యం తప్ప ఇహ అన్ని రకాల వృత్తుల్నీ, ఉద్యోగాల్నీ, వ్యాపారాల్నీ బ్రాహ్మణులకు నిషేధించాడాయన. భిక్షాటన చేసి బతకమన్నాడు. అది వీలు కాకపోతే అడవుల్లో కాయా, కసవూ ఏది దొఱికితే దాన్తో కడుపు నింపుకోమన్నాడు. లేదా పొలాల్లో చేల వెంట రాలిపడ్డ గింజలేరుకొని వండుకోమన్నాడు. ఇవేవీ చేయకపోయినా సాంప్రదాయిక వేదబ్రాహ్మణుల జీవనశైలీ,క్రమశిక్షణా సహజంగా అత్యంత కష్టంతో కూడుకున్నటువంటివి. అవి అబ్రాహ్మణులకు అనూహ్యమైనవి. చిన్నప్పటి నుంచీ వేదబ్రాహ్మణుల మధ్య పుట్టి పెఱిగితే తప్ప వాటికి అలవాటు పడడం అసంభవం.

బ్రాహ్మణులు బ్రాహ్మీముహూర్తం (సూర్యోదయాత్పూర్వం తెల్లవారుజాఱిమున సుమారు నాలుగ్గంటల ప్రాంతం) లో నిద్ర లేవాలి. నదికి గానీ చెఱువుక్కానీ వెళ్ళి స్నానం చేయాలి. సూర్యోదయం అవుతూండగా సంధ్యోపాసన చేయాలి. తరువాత హోమం, పంచాయతన పూజ, జపం, బ్రహ్మయజ్ఞం, వైశ్వదేవం, పంచాయతనానికి పునఃపూజ చేయాలి. తరువాత పూర్వాహ్ణంలో మళ్ళీ స్నానం చేయాలి. అప్పుడు మధ్యాహ్నకాల సంధ్యావందనం ఆచరించాలి. ఎవఱైనా అతిథు లొస్తారేమో, భోజనం పెడదామని ఎదురుచూడాలి. ఇవన్నీ అయ్యేదాకా ఏమీ తినకూడదు. (ఉపాహారాలూ, ఫలహారాలూ లాంటివేమీ తీసుకోకూడదు). పగలు నిద్రపోకుండా సద్గ్రంథ కాలక్షేపమూ, సత్సంగమూ చేయాలి. సాయంకాలమౌతూనే మళ్ళీ స్నానం చేసి సాయం సంధ్యోపాసన చేయాలి. మళ్లీ రాత్రి వైశ్వదేవమూ, పూజా చేయాలి. ఆ తరువాతే నిద్రకు ఉపక్రమించాలి. ఇవి కాక వంశాచారంగా వచ్చే ఏకాదశీ ఇత్యాది ఉపవాసాలూ, కొన్నికొన్నిరకాల మంత్రాల పునశ్చరణా మానకుండా చేయాలి. ఇంట్లో అంట్లూ, ముట్లూ కలవకూడదు. అలాంటివి ఉంటాయనుకుంటే ఆయా కుటుంబసభ్యుల కోసం ప్రత్యేకంగా వేఱే గదులు కట్టి వారు ఇంట్లో కలవకుండా జాగ్రత్త వహించాలి. గురుభక్తీ, దైవభక్తీ లాంటి విషయాల్లో వేదబ్రాహ్మణ కుటుంబాల్లో

ఏ విధమైన రాజీకీ తావు లేదు. పెద్దల్ని ఎదిరించి మాట్లాడడం ఒక్కటే కాదు, వారితో కాస్తంత చనువుగా, హాస్యంగా మాట్లాడడం కూడా తప్పే. తమకంటే పెద్దవారిని వావివరుసలతో కాకుండా పేర్లుపెట్టి పిలిస్తే దండన ఉంటుంది. ఎంత పేదఱికంలో ఉన్నా సరే, వేదబ్రాహ్మణ కుటుంబాలు ఈ నియమాల్నీ, ఈ జీవనవిధానాన్నీ ఎట్టి పరిస్థితుల్లోనూ అతిక్రమించడానికి వీల్లేదు.

మారిపోయిన సాంఘిక ఆర్థిక పరిస్థితుల వల్లా, విదేశీ ప్రభావం వల్లా గత ౧౨౦ సంవత్సరాలుగా ఈ జీవన విధానానికి ప్రత్యవాయం ఏర్పడింది గానీ అంతకుముందు వైదికులే కాక ప్రతి బ్రాహ్మణ కుటుంబమూ తు.చ. తప్పకుండా ఇలాగే నడుచుకునేది. ఈ జీవనవిధానం పెద్దయ్యాక అవలంబించడం కాస్తలో కాస్త ఫర్వాలేదు. విద్యార్థిదశలో ఇంకా కష్టంగా ఉంటుంది. ఆ కష్టానికి ఓర్చుకోలేక కూడా కొందఱు బ్రాహ్మణ యువకులు అందులోంచి నిష్క్రమించి ఉంటారు.

## పన్నెండో అధ్యాయం

ఇదంతా విన్నవారికి ఒక సందేహం కలగొచ్చు. "ప్రతికులమూ ఇంకో కులం నుంచి ఉద్భవించిందంటున్నారు. ఒక కులస్థులు వేఱే కులస్థులతో వియ్యమందుకోవడం వల్ల కూడా మఱికొన్ని కులాలు పుట్టాయంటున్నారు. మఱి ఈ అన్ని కులాలకూ పూర్వం ఉందనీ, అన్నింటికీ ఆద్యమనీ చెప్పబడుతున్న బ్రాహ్మణకులం అప్పట్నుంచీ ఇప్పటి దాకా ఏ సంకరమూ లేకుండా అలాగే స్వచ్ఛంగా ఉందా ?" అని ! ముందు ఒక విషయం అర్థం చేసుకోవాలి. శాస్త్ర పరిశోధనల ప్రకారం ప్రపంచంలో పరిశుద్ధమైన జాతులు గానీ, కులాలు గానీ, తెగలు గానీ ఎక్కడా లేవు. అన్నీ సంకర జాతులే. అన్నీ కలుషిత జాతులే. మానవుల్లో జాతులు అని చెప్పబడేవి నిజానికి ఒక ప్రత్యేకమైన భాషనో, ప్రాంతాన్నో, ఉమ్మడి రాజకీయ వ్యవస్థనో, లేక మానవజాతి పరిణామక్రమంలో ఒక దశనో తప్ప ఇహ ఏ విధమైన, సృష్ట్యాది నుంచీ ఉన్న రక్త భేదాల్నీ గానీ అగాధమైన జన్యుపర వ్యత్యాసాల్ని గానీ సూచించవు. ఈ మాట ఇతర కులాలకు ఎంత వర్తిస్తుందో బ్రాహ్మణ కులానికీ అంతే వర్తిస్తుంది.

ఎందుకిలా ? అనడిగితే, ప్రతికాలంలోనూ, ప్రతికులంలోనూ భ్రష్టులైన మగవారు పుట్టినట్లే భ్రష్టురాళ్ళైన ఆడవారు కూడా పుడుతూ వస్తున్నారు. ఎటొచ్చీ మగవారికున్న స్వేచ్ఛ మూలాన వారి భ్రష్టత బహిరంగం. అంత స్వేచ్ఛ లేకపోవడం మూలానా, గృహజీవులు కావడానా ఆడవారి భ్రష్టత రహస్యం. దీనిక్కారణం - మనుషులు ఎంత గొప్ప సంప్రదాయ సంస్కారాల మధ్య పెఱిగినా వారి జీవితగమనం మీద పూర్వజన్మ దుష్టవాసనలకున్న బలం ఆ సంప్రదాయానికి ఉండదు. ఒక మంచి శ్రోత్రియ బ్రాహ్మణకుటుంబంలో పుట్టి పెఱిగిన స్త్రీ ఱంకుటాలైతే ఆ తప్పు ఆ సంప్రదాయానిది కాదు, ఆమె యొక్క పూర్వ జన్మ దుస్సంస్కారాలది. కట్టుబాట్లు ఎక్కువై వాటిని తట్టుకోలేక ఉల్లంఘించారనడం సరికాదు. కట్టుబాట్లు గుడ్డిగా విధించేవి ఎన్నటికీ కావు. నాకు తెలిసి, వాటి అర్థమూ, పరమార్థమూ ప్రతితరంలోనూ పిల్లలకు కూలంకషంగా బోధపఱిచే అమలు జఱుపుతారు. తట్టుకోలేక ఉల్లంఘించడమే నిజమైతే మఱి అందఱూ దానికే పాల్పడాలి. కానీ కొద్దిమందే పాల్పడుతున్నారు.

ఎక్కువమంది భక్తిశ్రద్ధలతో అనుసరిస్తూనే ఉన్నారు.

పూర్వకాలంలో కొందఱు స్త్రీలు ఎందుకు భ్రష్టురాళ్ళయ్యేవారనే దానికి పైన పేర్కొన్నది ఒక ఆధ్యాత్మిక కారణం. అది కాక ఇంకో ముఖ్యమైన కారణం కూడా ఉంది. కొంతమంది సహజంగా స్వాభావికంగా పతివ్రతలైన స్త్రీలు కూడా బొత్తిగా ఇష్టం లేకపోయినా కొన్నిసార్లు తప్పనిసరై భ్రష్టురాళ్ళయ్యేవారు, సంతానం కోసం ! సంతానం కోసం భర్త అనుమతితో పరపురుషుల తో పోయిన పతివ్రతలు చాలామందే ఉన్నారు మన పురాణాల్లో ! కుంతీ, మాద్రీకథలు అందఱికీ తెలుసు. వారే కాక భర్త అయిన కల్మాషపాద మహారాజు అనుమతితో కులపురోహితుడైన వశిష్ఠుడితో పోయిన మదయంతి మొదలైనవారు చాలా మంది ఉన్నారు. పూర్వస్త్రీలకు ఈ కథలు క్షుణ్ణంగా తెలుసు. ఇలాంటి కథలు పవిత్ర పురాణకథలే అయినప్పటికీ, సాక్షాత్తూ ఋషుల చేతనే రచించబడినప్పటికీ లౌకిక ఆచరణలో మట్టుకు ఇవి సామాన్య మానవుల్లో అక్రమ శృంగారాభిముఖ్యాన్ని రగిలిస్తాయి. ప్రజల్లో శృంగారాసక్తి ఎంతగా సంప్రదాయాల చేత అణచివేయబడుతుందో, కాస్తపాటి ఆమోదానికి నోచుకున్న

ప్రతి వ్యభిచారకథా అంతగా దాన్ని కాలాగ్నిశిఖల వలె సమున్నతంగా ప్రజ్వరిల్ల జేస్తుంది. అందులోనూ సహజంగానే శృంగార మూర్తులైన స్త్రీలకు ఆ కథలు వల్లమాలిన ఆసక్తిని కలిగిస్తాయి. మఱోపక్క సంతానం లేక అత్తవారింట్లో ప్రతిరోజూ ఛీత్క రించబడుతూ, ఆడబిడ్డల దగ్గఱ చిన్నబోతూ, పేఱంటాలకు వెళ్ళడమే మానేస్తూ, విధవరాళ్ళ కంటే కేవలం ఒక్కవాసి అధికంగా మన్నించబడుతూ, సంతానం కోసం భర్త మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడేమోననే దిగులుతో దినదినగండంగా బతుకు వెళ్ళమార్చే వంధ్యాస్త్రీలకు ఈ పైన చెప్పిన కథల్లాంటివి కొత్త ఆలోచనల్ని రేకెత్తిస్తాయి. తనలో నిజంగా లోపం ఉందో లేదో ప్రతిస్త్రీకీ కొద్దో గొప్పో తెలియకపోదు. అటువంటప్పుడు మగవాణ్ణి తాత్కాలికంగా మారిస్తే సంతానవతులమవుతామనీ, తద్ద్వారా మెట్టినింటి నరకం నుంచీ విముక్తులమవుతామనీ, భర్త ఆదరణకు నోచుకుంటామనీ వారు తలపోస్తే అందులో ఆశ్చర్యం లేదు. ఒక తేడా ఏంటంటే - పురాణస్త్రీలకు భర్తల అనుమతి ఉంది. వీళ్ళకు లేదు. వీళ్ళ దగ్గఱి కొచ్చేసరికి సంఘం మారిపోయింది. ఈ వ్యభిచారక్రియ తమ సొంత నిర్ణయం. ఇది భర్తని అన్నివిధాలా జీవితాంతం మోసం చేయడం. కోరి జఱిపిన పరపురుష సంభోగంతో మైలపడ్డ తాను అతనితో సహధర్మాచరణకు తగినదాన్నని నమ్మించడం. పవిత్రురాలికి మల్లే అతని పక్కన పూజల్లోనూ, హోమాల్లోనూ కూర్చుని వాటి వల్ల రాదగ్గ సత్ఫలితాన్ని నాశనం చేయడం. అతనికి పుట్టని బిడ్డలు అతని బిడ్డలేనని నమ్మించడం. అతని కష్టార్జితాన్ని అతనికి సంబంధం లేనివారిమీద ఖర్చయ్యేలా వంచించడం. అందుచేత ఇది భ్రష్టత్వమే అనాల్సి వస్తుంది. కానీ వారున్న మానసికస్థితిలో వారికంత వితర్కం ఉండదు, కుతర్కమే తప్ప !

అలా ఒక గణనీయ సంఖ్యలో ప్రాచీన స్త్రీలు - వారు ఏ కులస్థులైనా కానివ్వండి - కోరి కోరి భ్రష్టురాళ్ళయ్యేవారు. ఇంటికొచ్చి వెళ్ళే ఆప్త బంధుమిత్ర సేవకాది జనంలోనే ఒకఱికి (సాధారణంగా అప్పటికే పెళ్ళయి సంతానం ఉన్న పురుషుడికి) రహస్యంగా దగ్గఱయ్యేవారు. కానీ సాధారణ సమయాల్లో ఆమె యథామామూలుగా ఒక పతివ్రతలానే ప్రవర్తించేది. ఇంట గానీ, బయట గానీ ఆమెను అనుమానించడానికి ఏ అవకాశమూ ఉండేది కాదు. ఒక పరువూ, మర్యాదా గల ఇంటి కోడలుగా, మహా యిల్లాలుగా, భూలోక దేవతలా, గృహలక్ష్మిగా వెలిగిపోతూ ఆమె యథాపూర్వం సమాజపు మన్ననలందుకుంటూ ఉండేది. ఈ విషయాల్ని వాత్స్యాయన కామసూత్రాలు, గాథాసప్తశతి, క్రీడాభిరామం, శ్రీనాథుడి చాటుపద్యాలూ, హంసవింశతి, శుకసప్తతి మొదలైన గ్రంథాల ద్వారా తెలుసుకోవచ్చు. "మా ఆయనకే అంతుంటే తంబళ్ళాయనతో తగలాటమెందుకు ?"

లాంటి తెలుగు సామెతల ద్వారా కూడా అసలు విషయం అర్థమవుతుంది. ఎవఱు ఎవటికి పుట్టారో తెలుసుకోను సహ కరించే శాస్త్రీయ పద్ధతులు ఎఱక్కపోవడం చేతా, ప్రాచీనకాలంలో సర్వేసర్వత్రా వ్యాపించి ఉన్న స్త్రీద్వేషం వల్లా ఆడవారి నిగ్రహ శక్తి మీద ఆనాటి మగవారికి నమ్మిక పూజ్యం. అందుకనే

*"ఆలి ఱంకుఁ దెలుప నఖిల యజ్ఞంబులు*
*తల్లి ఱంకుఁ దెలుపఁ దద్దినంబు"*

అన్నాడు వేమన. యజ్ఞం చేసేటప్పుడు ఆ చేయించే ఋత్విజులు యజమానుడి భార్యని అడుగుతారు. "ఏమమ్మా ! నీకు ఈ భర్త కాకుండా ఇంకా రహస్య ప్రియులెవటైనా ఉన్నారా ? ఉంటే ఎంతమంది ఉన్నారు ? ఎంతమందుంటే అంతమంది పేర్లూ ఇప్పుడే చెప్పు. లేకపోతే ఈ యజ్ఞం సాకల్యంగా పూర్తికాదు" అని ! ఆమె చెప్పి తీఱాల్సిందే. అలాగే తద్దినం పెట్టే టప్పుడు చనిపోయినవాడి కొడుకు పితృదేవతల్ని ఈ విధంగా ప్రార్థించాలి. "అయ్యలారా ! నేను నా తల్లి భర్తకు కాక అన్యు డెవటికైనా పుట్టి ఉన్నప్పటికీ ఈ తర్పణాలూ, పిండాలూ మాత్రం ఈ చనిపోయిన నా తల్లి భర్తకే చెందాలి." అని !

పాశ్చాత్యులు చేసిన ఒక అధ్యయనాన్ననుసరించి కొన్ని దేశాల్లో నూటికి పదిమంది తమ తండ్రులకు పుట్టినవారు కారు. కొన్నిదేశాల్లో ఈ శాతం ఇఱవై దాకా ఉంది. భారతదేశంలాంటి చోట్ల ఇలాంటి అక్రమ జననాలు కనీసం అయిదుశాతమైనా ఉండకపోవు. ఎందుకంటే స్త్రీలలో మాదిరే పురుషుల్లో కూడా సంతానరాహిత్యం అంత హెచ్చుస్థాయిలో ఉంది. కట్టుకున్న భర్తని కేవలం సంతాన సమస్య గుఱించి వదులుకోవడం ఇష్టం లేక కొందఱు స్త్రీలు రహస్యంగా ఇందుకు పాల్పడుతూండ వచ్చు. ఈ క్రమంలో బయటి కులాల రక్తం స్వకులంలో ప్రవేశించడానికి అవకాశముంది. ఏతావతా, పురుషుల అల్పవీర్యతా, అందుకు ప్రతిస్పందనగా వారి స్త్రీల యొక్క శీలహీనతా - ఈ రెండూ కలిసి జమిలిగా కులసాంకర్యానికి దారితీస్తాయి. కుల సాంకర్యం కులంలో అంతకుముందెన్నడూ ఎఱగని మానసిక, భౌతికలక్షణాల్ని దాని సభ్యుల్లో చొప్పిస్తుంది.

స్త్రీలు ఈ విధంగా సంతానం కోసం భర్తవీపు వెనక అడ్డదార్లు త్రొక్కకుండా ఆధునికులకు భగవంతుడు చాలా శాస్త్రవిజ్ఞా నాన్ని ప్రసాదించి ఉన్నాడు. జ్ఞానం పాపాల నుంచి మానవుల్ని విమోచిస్తుందనే హిందూ తాత్త్విక బోధకు బహుశా ఇదొక లౌకిక దృష్టాంతం.

*శ్లో॥ సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥*

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

*నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే / **(గీత-జ్ఞానయోగం)***

# పదమూడో అధ్యాయం

చేదువూ, సంస్కారం, సంప్రదాయం, దేవుడూ, దెయ్యం, దేశభక్తి అంటూ ఎన్ని కబుర్లు చెప్పినా ప్రపంచంలో నూటికి తొంభైతొమ్మిదిమంది బతుకుతున్నది కేవలం అన్నవస్త్రాల కోసమూ, కామతృప్తి కోసమూను ! మన సామాజిక విలువలన్నీ ఈ మూడింటి చుట్టూ పరిభ్రమిస్తూంటాయి, ఇప్పుడు గానీ, ఇక్ష్వాకుల బారసాల నాడు గానీ ! వాటిని సాధించుకునే పద్ధతి మనిషికో రకంగా ఉంటుంది. వర్గానికో రకంగా ఉంటుంది. ఏ పద్ధతిలో సాధించుకుంటు న్నారనే దాన్ని అనుసరించి మనుషుల్లో హెచ్చుతగ్గులేర్పడతాయి. ఆయా కాలాల్లో నెలకొని ఉన్న భావాత్మక వాతా వరణం ప్రకారం ఆయా పద్ధతులకు గౌరవమో, హైన్యమో, దైన్యమో ఆపాదించబడతాయి. ఆ గౌరవాల్ని బట్టీ, హైన్యాన్ని బట్టీ ఆయా పద్ధతుల పాటింపరులకు అగ్ర, నిమ్న హోదాలు ఇవ్వబడతాయి. కొట్టి సంపాదించడాన్ని ఒక కాలంలో వీరత్వంగా సమాజం భావించవచ్చు. తపస్సుతో సాధించడం ఇంకో కాలానికి వీరత్వం. విద్యని ప్రదర్శించి సంపాదించడం మఱో కాలానికి వీరత్వం. ఏం చేసినా మొత్తమ్మీద సంపాదించడమే ఇందులో పునః పునరావృత్తంగా కానవచ్చే ఇతివృత్తం (theme).

అలాగే ఆడవాళ్ళని బలవంతంగా ఎత్తుకొచ్చి పెళ్ళి చేసుకోవడం ఒకనాటి పౌరుషం. (నిజానికి పెళ్ళి కోసం ఉపయోగించే సంస్కృతపదం ఉద్వాహానికి నిజమైన అర్థం ఎత్తుకు రావడం). వలచి వలపించి చేసుకోవడం ఇంకోనాటి మగతనం. (అప్పు డది పరిణయమైంది). ఆడవాళ్ళ పెద్దలతో మాట్లాడి వారి సమ్మతితో చేసుకోవడం మఱొకనాటి మర్యాద. ఎక్కువమంది ఆడ వాళ్ళతో బహిరంగ సంబంధం కలిగి ఉండడాన్ని గొప్ప వీరత్వంగా భావించిన చారిత్రిక దశలున్నాయి. అలాగే ఎక్కువమంది మగవాళ్ళతో బహిరంగ సంబంధం కలిగి ఉన్న ఆడది అందుకు గర్వించిన దశలూ ఉన్నాయి. ఏం చేసినా, ఎలా చేసినా మొత్త మ్మీద కామతృప్తే వీటన్నింటా కానవచ్చే సర్వసామాన్య ఇతివృత్తం. అంతేతప్ప వాటిల్లో హెచ్చుతగ్గులకై అన్వేషించడం వృథా. కాలగమనంలో పాత సామాజిక విలువలు చరిత్రలోకి జాఱుకుంటాయి. వాటి స్థానంలో కొత్త సామాజిక విలువలొస్తాయి. అయితే పాతవిలువలు పూర్తిగా నశించవు. సమాజంలో అక్కడక్కడ కొంతమంది వాటిని ఇంకా పాటిస్తూనే ఉంటారు. కొందఱు కులాచారం పేరిట బహిరంగంగా సామూహికంగా ఆచరిస్తూండగా, మఱికొందఱు వ్యక్తిగతంగా రహస్యంగా ఆచ రిస్తుంటారు. సామూహికంగా పాతవిలువల్ని పాటించేవారిని సమాజం నిమ్నవర్గంగా చూస్తుంది. వాటిని వైయక్తికంగా పాటించేవారిని నేరస్థులుగానూ, పాపులుగానూ చూసి శిక్షిస్తుంది. ఎందుకంటే పాతవి చారిత్రికంగా ఓడిపోయిన విలువలు. కారణం - అవి నిషేధించబడతాయి. కొత్తవేమో గెలిచిన విలువలు. ఎందుకంటే వీటికి సమకాలీనంగా బ్రహ్మరథం పడతారు. అయితే ఈ పరస్పర విరుద్ధ విలువలన్నింటికీ ఇలా మార్చిమార్చి గెలుపోటములుంటాయే తప్ప అవి సమాజంలో నుంచి పూర్తిగా తొలగిపోవడం మాత్రం ఎప్పటికీ జఱగదు. ఈ రకమైన సాంస్కృతిక పోరాటంలో కొన్ని విలువలు గెలిచినాక (ఇక్కడ, గెలవడమంటే అధిక సంఖ్యాకుల మద్దతు పొందడం) వాటికి మత మద్దతూ, ప్రభుత్వ మద్దతూ కూడా తోడైతే ఈ అగ్ర నిమ్న విభజనా, ఈ తప్పొప్పుల భావాల మధ్యని అగాధమూ మఱింత వెడల్పవుతాయి. ఓడిపోయిన విలువల్ని మనస్సుల్లో ఇంకా నమ్మేవారూ, ఆచరించేవారూ తమ నమ్మకాల గుఱించీ, జీవనశైలి గుఱించీ ఎవఱికీ వెల్లడించకుండా, అధిక సంఖ్యా కుల నమ్మకాల్ని అనుసరిస్తున్నట్లుగా అభినయిస్తూ, చాటుమాటున దాక్కుని, తప్పించుకుని బ్రతకాల్సిన పరిస్థితి నెలకొం

టుంది.

అన్నవస్త్రాల సంగతెలా ఉన్నా, ఓడిపోయిన లైంగిక విలువలూ, సంఘవిరుద్ధమైన దాంపత్యపుటలవాట్లూ మనుషుల్ని వ్యక్తులు గానూ, సామూహికంగానూ ఎదగనివ్వవు. అతివేలమైన కామవాంఛ మూలాన ద్విజత్వం నుంచి భ్రష్టులై నిమ్నస్థాయి ప్రజల తో కలిసిపోవాల్సి వచ్చిన బ్రాహ్మణుల వృత్తాంతాలు ఇంతకు ముందే చెప్పుకున్నాం. దీనికి కొన్ని కారణాలున్నాయి. పెళ్ళికి బయట స్త్రీపురుష సంబంధం కేవలం కామతృప్తికి పరిమితం. పెళ్ళికి లోబడినంత మట్టుకు అది సహజీవనానికీ, వంశ విస్త రణకీ, జీవిత భాగస్వామి ద్వారా కొత్త బంధుమిత్రుల సంపాదనకీ, అదనపు ధనాగమానికీ విస్తరిస్తుంది. పెళ్ళికి బయట సంబంధాలు నెఱపే వ్యక్తులు ఒకటికొకటి ఏమవుతారనే విషయంలో సమాజానికి స్పష్టత లేక అది వారిని అర్థం చేసుకో జాలదు. మానవ సమాజం సామూహికంగా ఒక పశువు. తనకు తొందఱగా అర్థం కానివారన్నా, విషయాలన్నా దానికి భయ మూ, ఎగతాళీ, ద్వేషమూను ! తనకు ఎవరైనా, ఏదైనా అర్థం కాకపోతే మానవజాతి సర్వనాశనమైపోతున్నట్లే దాని దృష్టిలో ! సమాజాన్ని అనుకునే పని లేదు. నిజానికి ఆ తత్త్వం మనందఱిలోనూ ఉంది. ఉదాహరణకి - అందఱమూ చీకటిని ద్వేషి స్తాం, మనకేమీ కనిపించకా, ఏమీ అర్థం కాక ! కాబట్టి సమాజానికి అర్థం కానంత మాత్రాన, లేదా అది ఒప్పుకోనంత మాత్రానా ప్రపంచంలో ప్రతీదీ తప్పని బల్లగుద్ది వాదించలేం.

అదీ గాక ఈ తప్పొప్పులనేవి చాలా పెద్దమాటలు. వాటిని నిర్ణయించే స్తోమత సద్గురువులకూ, భగవంతుడికే తప్ప సామాన్య మానవులకూ, వారేర్పఱచుకున్న వ్యవస్థలకూ ఉండదు. ఎందుకంటే సామాన్యమానవులకు అవసరాలూ, అలవాట్లూ, ఇష్టా నిష్టాలూ మాత్రమే ఉంటాయి, మంచీచెడులు ఉండవు. కానీ ఈ విషయాల్ని అర్థం చేసుకునే శక్తి సమాజానికి ఏ కాలం లోనూ లేదు గనకా, తనకు అర్థం కానివారి మీద అది అకారణంగా పగ సాధిస్తుంది గనకా, ఆ సామాజిక పగ కుటుంబాల్నీ, వ్యక్తుల్నీ, వారి జీవితాల్నీ నాశనం చేసేటంత స్థాయిలో ఉండడం అపురూపం కాదు గనకా ఆ సామూహిక పశువుకు తలొంచుతున్నట్లు కనీసం నటించక తప్పదు మనుషులు. ఆ నటన చేతనైనవారు విజేతలై సమాజాన్ని శాసించగలుగుతారు. చేతకానప్పుడు తక్కువస్థాయి సామాజికులుగా గుర్తింపు పొందుతారు. ఆ తక్కువస్థాయి సామాజికత్వం కొద్దితరాల పాటు కొనసాగితే వా రంతా ఒక నిమ్నకులంగా ఆవిర్భవిస్తారు.

## *అంటరాని కులాల మూలాలు*

మనుషులు ఎందుకని గుంపులుగా గుంపులుగా విడిపోతారు ? అనడిగితే సరైన సమాధానం చెప్పడం చాలా కష్టం. ఇందు లో ఎవఱిదో కుట్ర ఉందని ఆరోపించడం పాత రొడ్డకొట్టుడు ధోరణి. మఱీ విద్యాత్మకం (academic) గా తత్త్వీకరిస్తున్నా ననుకోకపోతే నాకు స్ఫురించిన మాటొకటి చెబుతాను. మనిషి ఎంత సాంఘికజీవో అంత విభజనజీవి కూడా ! దురదృష్ట వశాత్తూ మొదటి లక్షణం ఒక్కటే బాగా ఉద్ద్యోతితం (highlight) అయింది. రెండో లక్షణం కూడా మొదటిదానంత స్పష్టంగా తేల్తున్నప్పటికీ దాని గుఱించి మాట్లాడేవారే లేరు. సంఘం అంటే కేవలం మనుషుల్ని కలిపేదనే ఆదర్శవాద పరి భావన (idealistic concept) ని ముందుకు తీసుకొచ్చారు పూర్వమేధావులు. కానీ అనుభవంలో అలా లేదు. సంఘం మనుషులకు ఎంత సమావేశ కేంద్రమో (convergence point) అంత విభాజక శక్తి (divisive force) కూడా ! ఎంత

చిన్నపాటి తేడా ఐనా చాలు, మనుషులు బీభత్సంగా కొట్టుకుచచ్చి వేఱుకుంపట్లు పెట్టుకోవడానికి ! ఈ కలహశీలతలో మానవులకీ, గ్రామసింహాలకీ మధ్య పెద్ద వ్యత్యాసం కనిపించడం లేదు. ఆ తేడా అందఱికీ సర్వసాధారణంగా ఇదివఱకే సుపరిచితమైన రంగో, ప్రాంతమో, మతమో, భాషో కానక్కఱలేదు. అంతేకాక, విడిపోవడానికి మనుషులు తప్పనిసరిగా కలహశీలురే అయ్యుండాలన్న నియమం కూడా లేదు. అలా విడిగా ఇతరులకు దూరంగా బతకడంలో అనిర్వచనీయమైన, అవ్యక్తమైన మానసిక ఆనందాన్ని అనుభవించేవారైతే చాలు. అలాంటివారు కొందఱు ఒక తరంలో అలా విడిపోవాలన్న నిర్ణయం తీసుకుని దాన్ని రెండు-మూడు తరాల పాటు అమల్లో పెట్టినాక ఆ తరువాతి నుంచి పుట్టుకొచ్చేవారు తమ ప్రమేయమేమీ లేకుండానే ఆ వేర్పాటును కొనసాగించక తప్పని అనివార్యత (compulsion) లో పడిపోతారు. అలా పుట్టుకొచ్చినవే మన కులాలూ, ఉపకులాలూ, శాఖలూ, ఉపశాఖలూను !

మనుషులు వ్యక్తిగతంగా కానివ్వండి, సామూహికంగా కానివ్వండి, తాము చేసే పనుల్ని బట్టే తీర్పుతీర్చబడతారు. ఆ పనుల చుట్టూ అల్లుకున్న సామాజిక భావనల మల్లెపందిరి లేదా ముళ్ళకంపను బట్టి పేర్లుపెట్టబడతారు. వ్యక్తులుగా వారికి వారి తల్లిదండ్రులు బొడ్డుకోసి పెట్టిన పేర్లు మాయమై వారు చేసే పనుల పేర్లతో వారిని వ్యవహరిస్తుంది సమాజం. ఆనాడూ, ఈనాడూ, ఏనాడూను ! ఆ బిరుదాల కంటే వేఱుగా ఉన్న మన యథార్థ మూర్తిమత్త్వం మన తల్లిదండ్రులకు తెలుసు. అన్నదమ్ములకు తెలుసు. భార్యాబిడ్డలకు తెలుసు. సమాజానికి ఆ లోతు తెలియదు. తెలుసుకోవాల్సిన అవసరమూ లేదు. దానికి తన సభ్యుల్లో ఒక్కొక్కడూ అమాంతం వెంటనే అర్థమైపోవాలంతే ! అందుకని వారు జీవిక కోసం చేస్తున్న పనుల ద్వారా వారిని అర్థం చేసుకోవడానికీ, గుర్తుపట్టడానికీ అది ప్రయత్నిస్తుంది. కాలక్రమంలో సమాజానికున్న ఈ అవగాహనా పరిమితులు కాస్తా ఆయా వ్యక్తుల యొక్కా, వారి సమూహాల యొక్కా పరిమితులుగా రూపుదిద్దుకుంటాయి. చేసే పని తప్ప ఇంకెందులోనూ పోలిక లేని అనేకమంది వేఱువేఱు వ్యక్తులని ఒకే గాటన కట్టి మాట్లాడుతూ సంఘమే వారందఱినీ ఏదో ఒకనాటికి ఒక వర్గంగా ఏకం చేస్తుంది. ఒక కళాశాలలో బొత్తిగా సంబంధం లేని ఒక అబ్బాయి పేరూ, ఒక అమ్మాయి పేరూ గోడల మీద వ్రాసి ఆ తరువాత వారు నిజంగానే పెళ్ళి చేసుకోక తప్పని అనివార్యతని సృష్టించినట్లు ! అలా వేఱువేఱు పనులకూ, ఆ పనులు చేసే మనస్తత్త్వాలకూ ప్రసిద్ధి వహించిన వేఱువేఱు కులాలూ, తెగలూ, జాతులూ అస్తిత్వంలోకి వస్తాయి. మానవుల యొక్క యథార్థమైన వైయక్తిక శీలసంస్థానం వారి జీవిక కంటేనూ , తల్లిదండ్రుల కంటేనూ భిన్నంగా ఉండే అవకాశం లేకపోలేదని ఆకళింపు చేసుకునేటంత స్థాయికి సమాజపు మేధస్తలం ఎదిగిన రోజునా, అది అలా ఎదిగే విధంగా మనుషులు తమను తాము తీర్చిదిద్దుకుని నిరూపించుకున్న రోజునా ఈ విభజనలు నిశ్శేషంగా అదృశ్యమౌతాయి.

## పధ్నాలుగో అధ్యాయం

గత శతాబ్దపు ప్రథమార్థంలో మహాత్మాగాంధీ రేకెత్తించిన ఆత్మవిమర్శ (introspection) ఫలితంగా ఆనాటి అగ్ర కులాల మేధావుల్లో అంటరాని కులాల విషయమై చాలా అంతర్మథనం చెలరేగింది. నిజానికి గాంధీగారు ప్రస్తావించ

డానికి చాలా దశాబ్దాల ముందే ఈ అంటరానితనంలో ఏదో అధర్మం ఉందని అభిప్రాయపడిన అగ్రకుల మేధావులున్నారు. హిందువుల్లో ఇంతగా ప్రబలిపోయిన అంటరానితనం గురించి హిందూగ్రంథాలు ఏమైనా చెబుతున్నాయా ? అనే కుతూహలంతో కొందరు ప్రాచీన సంస్కృత సాహిత్యాన్నంతా గాలించి వాటిల్లో అసలా ప్రస్తావనే లేదని తెలుసుకొని ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టారు.

అవును, వాస్తవమే ! అంటరాని కులాల ప్రస్తావన పరమ ప్రామాణికం (highest authority) గా భావించబడే ఏ ప్రాచీన హిందూగ్రంథంలోనూ లేదు. ముఖ్యంగా ప్రప్రథమ ధర్మశాస్త్ర కర్త అయిన మనువు సమాజంలో ఏ ఒక్క వర్గాన్నీ అంటరానిదని పేర్కోలేదు. కులాల మధ్య సోపానక్రమంలో హెచ్చుతగ్గులున్నాయనీ, వాటిని తప్పక పాటించాలనీ మనువు సారాంశ రూపంగా చెప్పాడు. మొత్తం నాలుగు వర్ణాలు ఉన్నాయన్నాడు. అంటరానిదైన అయిదో వర్ణం ఉన్నట్లు ఎక్కడా చెప్పలేదు. కానీ "శూద్రులు" అనే మాటతో పాటు 'అంత్యజులు' అనే మాట కూడా ఉపయోగించాడు. కొన్నిచోట్ల 'అంత్యజ' శబ్దాన్ని శూద్రులకు పర్యాయపదంగా వాడాడు. కానీ శూద్రులు అస్పృశ్యులని గానీ, వారిని తాకకూడదని గానీ ఎక్కడా చెప్పలేదు. కొన్నిచోట్ల ఒకే శ్లోకంలో రెండు పదాల్నీ ప్రయోగించడం వల్ల ఈ రెండు రకాల జనమూ పూర్తిగా వేఱువేఱై ఉండొచ్చుననే అభిప్రాయం కలుగుతోంది. కొన్ని సంకర కులాలవారు ఊరి బయట నివసిస్తారని వర్ణించాడు. కానీ వారు అస్పృశ్యులని మాత్రం చెప్పలేదు. చండాలురనే కులం ఉన్నట్లూ, వారు ఊరి బయట నివసిస్తున్నట్లూ చెప్పాడు. కానీ వారు కూడా అస్పృశ్యులని చెప్పలేదు. ఈ మధ్య కొంతమంది చండాలురంటే ఆధునిక మాలమాదిగల పూర్వీకులేనని వ్రాస్తున్నారు. అది వారి ఊహే తప్ప దాన్ని నిరూపించడానికి ఖచ్చితమైన ఆధారాలు మృగ్యం. మాలమాదిగలు అనేది భాషలో ఉన్న వందలాది ద్వంద్వసమాసాల్లో ఒకటి కావడమూ, సమకాలీనంగా ఇఱువురికీ ప్రత్యేకింపులు ఉండడమూ మినహాయిస్తే తదితర పోలికలు విచార్యం. మొత్తమ్మీద మనుధర్మశాస్త్రంలో మనిషిని మనిషి తాకినందుకు ఏ విధమైన ప్రాయశ్చిత్తాలూ విధించబడలేదు. నిమ్నకులస్థులు బ్రాహ్మణుల పట్ల ఏయే రకమైన అమర్యాద చూపితే ఏయే విధమైన శిక్షలు విధించాలో వ్రాశాడు కానీ తాకినందుకు శిక్ష ఉందని ఎక్కడా వ్రాయలేదు. కనుక ఈ 'తాకకపోవడం' అనే పరిభావన (concept) ఆనాటి సమాజంలో ఇంకా ప్రవేశించలేదేమో ననిపిస్తోంది.

అయితే మనువు అంటరానితనాన్ని బోధించాడనే ఈ పొరపాటు అభిప్రాయం విస్తృత ప్రచారంలోకి రావడానికీ, ఆ హేతువు చేత తమ వర్తమాన దుఃస్థితికి మనువు బోధలే మూలమని ఆక్రోశిస్తూ దళిత సంఘాలవారు మనసు బాలేనప్పుడల్లా మనుధర్మశాస్త్రాన్ని తగలబెట్టడానికీ అసలు కారణం, మనుధర్మానికి కొందరు బ్రాహ్మణ వ్యాఖ్యాతలిచ్చిన తప్పుడు భాష్యాలు. మనుధర్మశాస్త్రం ౫,౦౦౦ సంవత్సరాల నాటి సంస్కృతభాషలో వ్రాయబడింది. సంస్కృతం మీద మంచిపట్టున్న వ్యుత్పన్నుల క్కూడా ఈరోజున అది నేరుగా అర్థం కాని పరిస్థితి. సవినయంగా వ్యాఖ్యాన సహకారాన్ని అపేక్షించాల్సిందే. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు వ్యాఖ్యాతలు మనువు వ్రాసిన శ్లోకాలకు తమ స్వంత అభిప్రాయాల్ని జోడించి తమకు తెలియకుండానే ఆయన కీర్తికి మసిపూశారు. ఇలా చేయడంలో బహుశా వారి అసలు ఉద్దేశం, తమ సమకాలీన, స్థానిక బ్రాహ్మణ సమాజంలో విస్తారంగా వ్యాపించిన ఆచారాలకూ, ధర్మశాస్త్రానికీ సమన్వయం కుదర్చడం. తమ ఆచరణలకు మనువు ఆమోదం లేదని తెలిస్తే సమకాలీనంగా బలవంతులూ, పరపతిమంతులూ అయిన బ్రాహ్మణ ప్రముఖులు చాలా నొచ్చుకుం

టారు. వారికి అలా నొప్పి కలిగించకుండా వ్యాఖ్యాతలు జాగ్రత్తపడ్డారన్నమాట. ఇలాంటి వ్యాఖ్యాతల్లో కుల్లూకభట్టు ఒకడు. ఈయన మనువుశ్లోకాలలో దేనికీ విపుల టీకాతాత్పర్యం వ్రాయలేదు. కీలకశ్లోకాలక్కూడా ఇదే గతి పట్టించాడు. స్థూలంగా ఆ శ్లోకతాత్పర్యం తన దృష్టిలో ఏమిటో అదే రాసుకుంటూ వెళ్ళాడు. అందుచేత కుల్లూకభట్టు వ్యాఖ్యానాల్ని యథాతథంగా స్వీకరించాల్సిన అవసరం లేదని నా అభిప్రాయం.

అంటరానితనంతో సహా, మన సమాజంలో అర్వాచీనంగా ప్రవేశించిన అనేక రుగ్మతలు - గృహస్థులు సన్న్యాసుల జీవన విధా నాన్ని అనుకరించడం వల్ల చోటు చేసుకున్నవి కావచ్చునని నా నిశ్చితాభిప్రాయం. సంసారులకు సంసారులు కాకుండా సన్న్యాసులే ఆదర్శమై కూర్చున్నారు. ఉదాహరణకు - సన్న్యాసులకు స్త్రీసంపర్కం నిషిద్ధమని గృహస్థులు/ గృహస్థురాళ్ళు కూడా దాన్నొక తప్పులా చూడసాగారు. సన్న్యాసులకు శిరోముండనం విహితమని చెప్పి సంసారులైన మతగురువులు తాము కూడా దాన్ని పాటించ నారంభించారు. వాస్తవానికి వీరికి శిఖే విధించబడింది, బోడిగుండు కాదు. అలాగే వారు చాతుర్మాస్యలు చేస్తారని వీరూ చాతుర్మాస్యలు చేయబూనుకున్నారు. వారు ఉపవాసాలు చేస్తారని వీరూ ఏకాదశీ, మంగళ వారం, గురువారం, శనివారం, ఒక్కపొద్దులంటూ నిష్కారణంగా నెలకు అఱడజన్ సార్లు కడుపు మాడ్చుకోవడం మొదలు పెట్టారు, వారు కాషాయం ధరిస్తున్నారని చెప్పి వీరు ఎఱ్ఱబట్టలు కట్టుకుని పూజలు చేస్తున్నారు. వారు ధనానికి ఆశించ కూడదని చెప్పి వీరూ ధనాశ లేనట్లు లౌక్యంగా నటిస్తున్నారు. సన్న్యాసులు తమ మోక్షగురువులకు ఇవ్వాల్సిన మన్నన (treatment) ని లౌకిక విద్యలు నేర్పే లౌకిక గురువులు కూడా తమ లౌకిక శిష్యుల నుంచి ఆశించడం జఱిగింది. (ఇప్పు డిహ ఏ గౌరవమూ లేదనుకోండి) వీటన్నింటితోనూ హిందూ ధార్మిక/ కౌటుంబిక జీవితం కాలక్రమంలో అడుగడుగునా అగాధమైన వ్యాఘాతాల (profound contradictions) తో తీర్చిదిద్దబడింది.

ఆ విధంగా సన్న్యాసులు సంసారులకంటే అన్నివిధాలుగా మహోన్నతులని భ్రమపడుతూ, సత్పురుషులంటే వారేనని నిర్వ చిస్తూ, వారి దర్శనాల కోసం అనవసరంగా ఎగబడుతూ, వారిని చూసి అంగుళమంగుళం వాతలు పెట్టుకుంటూ మనవారు అటు సన్యాసులూ కాలేక, ఇటు సంసారులూ కాలేక ఆచరణాత్మకంగా ఆశ్రమ సాంకర్యానికి పాల్పడి ఆఖరికి ఆధ్యాత్మిక విదూషకుల (religious buffoons) మాదిరిగా తయారయ్యారు. ఈ అనుకరణల ఫలితంగా సమాజంలో ఇంటింటా దీక్ష, మడి, ఆచారం పేరుతో హిపోక్రిసీ విజృంభించింది. ఈ పైపైమెఱుగులుంటే చాలు, అతనొక గొప్ప వేదాంతి, విరాగి, మోక్ష మార్గస్థుడు అనే అభిప్రాయం వ్యాపించింది. దరిమిలా ఈ అభిప్రాయాన్ని సొమ్ము చేసుకోవడం బకధ్యానస్థులకూ, బైడాల వ్రతులకూ మిక్కిలి సులభమైపోయింది. సంసారులు తమ సంసారజీవితం సైతం ఎంత గొప్ప మోక్షసాధనమో గ్రహించలేక పోవడమూ, అలా గ్రహించేలా చేసేవారెవఱూ లేకపోవడమూ, ఎవఱికీ అందుబాటులో లేని సన్న్యాసాదర్శాలకే అందఱూ భజన చేస్తున్న వాతావరణమూ - వెరసి ఈ పరిస్థితికి దారితీశాయి.

అస్పృశ్యత - ఈ సన్న్యాస వాతలు పెట్టుకునే కార్యక్రమంలో ఒక భాగం. ఎందుకంటే సన్న్యాసుల్లో అందఱూ కపట సన్న్యా సులు కారు. కొంతమంది మహా మహిమాన్వితులున్నారు, మొదట్నుంచీ ! నిజమైన ఆధ్యాత్మికత అనేది మానవుడు చేఱుకో దగ్గ మహోన్నతమైన మానసిక సున్నితత్వానికి పరాకాష్ఠ. అలా చేఱుకున్నవారు అప్పుడే పుట్టిన పసిపిల్లల కంటే సున్నిత మైనవారుగా మారతారు. ఏ చిన్నపాటి క్రిమిసంసర్గమైనా చిన్నపిల్లల్ని అస్వస్థులుగా చేసినట్లు, ఏ కొద్దిపాటి అపవిత్ర వాసన

తగిలినా చాలు, ఆధ్యాత్మిక మహా మృదులాత్ములు జబ్బుపడతారు. లేకపోతే వారికి ఆకస్మిక ప్రమాదాల్లాంటి అనిష్టాలు సంభవిస్తాయి. అందువల్లనే అలాంటివారంతా పాపపంకిలమైన మానవ సమాజాన్ని వదిలిపెట్టి అడవుల్లోనూ, తోటల్లోనూ నివసిస్తారు. వారెప్పుడైనా మానవ సమాజంలోకి రావడం తటస్థిస్తే "వారిని తాకవ"ద్దంటూ వారి శిష్యులు జనసామాన్యానికి విజ్ఞప్తి చేయడం కద్దు. మహాయోగులైనవారి యొక్క ఈ జీవనవిధానాన్ని ఆనాటి దాంభికులూ, బకధ్యానస్థులూ, బైడాలవ్రతులూ గమనించి ఉంటారు. వారిలా తామూ ప్రవర్తించి గొప్ప ఆధ్యాత్మికులు అనిపించుకుని జనాన్ని దోచుకోవచ్చు ననుకుని ఉంటారు. ఇహ అప్పుడు మొదలైనవి కావచ్చు "దూరం, దూరం, నన్ను ముట్టుకోవద్దు, నన్ను తాకద్దు, నేను పవిత్రుణ్ణి (అంటే - నువ్వు అపవిత్రుడివి) " గట్రా ప్రలాపాలు ! ముఖ్యంగా బ్రాహ్మణులందఱూ తమను తాము అస్పృశ్యులుగా మార్చుకున్నారు. తద్వారా సమాజం రెండుగా చీలిపోయింది - పవిత్ర అస్పృశ్యులూ, అపవిత్ర అస్పృశ్యులూ అని ! క్రమంగా బ్రాహ్మణాది కులాలేమో పవిత్ర అస్పృశ్యుల కోవలోనూ, శూద్ర-అంత్యజ కులాలన్నీ అపవిత్ర అస్పృశ్యుల కోవలోనూ చేఱిపోయారు.

అస్పృశ్యతను పాటించేవారు అంటరాని కులాలవారి ననే కాదు, ఇంట్లోవారిని కూడా అస్పృశ్యులుగానే చూడడం కద్దు. కాకపోతే దానికి శుచి, మడి, తడి, ఆచారం, అంటూ, సొంటూ, దీక్ష అని పేర్లు. వారు చెప్పే శౌచాన్ని శుభ్రత కంటే భిన్నంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే కేవలం శుభ్రంగా ఉన్నంతమాత్రాన వారికి సరిపోదు. శుభ్రంగా ఉన్నట్లు అనిపించాలి కూడా. అలా అనిపించడమే శౌచం. శరీరం ఎలా ఉన్నా ముందు మనసుకు తృప్తి కలగాలి. అంటే ఈ శౌచసిద్ధాంతం ప్రకారం ఒక నిమ్నకులస్థుడు శుభ్రంగా స్నానం చేసొచ్చినా అతని స్పర్శ శౌచం కిందికి రాదు. అశౌచం అంటుకుంటుంది. అది శౌచాన్ని పాడు చేయగలదు. దానికి అంత శక్తి ఉంది. దురదృష్టవశాత్తూ, ఎందుకో మఱి, మహా గొప్పదని వేనోళ్ళ ఉగ్గడించబడుతున్నప్పటికీ శౌచానికి మాత్రం అంటుకునే శక్తీ లేదు. అంటించే శక్తీ లేదు. అశౌచాన్ని పాడు చేయగల శక్తి అంతకంటే లేదు. విచిత్రంగా అన్ని శక్తులూ అశౌచానికే ఉన్నాయి. అందుచేత పరస్పరం తాకినప్పుడు నిమ్నకులస్థుడి అశౌచం మాత్రమే అగ్రకులస్థుడికి అంటుకుని అతను అపవిత్రుడవుతాడు తప్ప, అతని అశౌచం నిమ్నకులస్థుడికి అంటుకుని తత్ఫలితంగా నిమ్నుడు పవిత్రుడయ్యే అవకాశం మట్టుకు లేదు.

## పదిహేనో అధ్యాయం

౨౦౦౧ జనాభా లెక్కల ననుసరించి మన దేశంలో సుమారు ౧౬ శాతం మంది ఎస్సీ (Scheduled Caste) కులాలకు చెందినవారు. మన రాష్ట్రంలో కూడా ఈ శాతానికి కాస్త అటూ-ఇటూగా ఎస్సీలున్నారు. వారంతా ఒకే కులం కారు. వారిలో 59 భిన్నభిన్న కులాలున్నాయి. ఈ సందర్భంలో ఇక్కడ సర్వసామాన్యంగా ప్రచారంలో ఉన్న ఒక అపోహని విడమర్చాలి. ఎస్సీ అనే చట్టపరమైన నామాంకాన్ని (label) తగిలించినంత మాత్రాన వారిలో అందఱూ తరతరాల నుంచి అస్పృశ్యులూ కారు, అస్పృశ్యత మూలాన బాధలుపడ్డవారూ కారు. వారిలో సంపూర్ణ అస్పృశ్యులతో పాటు అర్ధ అస్పృశ్యులూ, స్పృశ్యులూ కూడా ఉన్నారు. అలాగే ఇప్పటి దాకా ఎస్సీ జాబితాలో లేని ఒక కులాన్ని ఇప్పుడు కొత్తగా చేర్చినంత మాత్రాన అది ఇహ తరతరాల అస్పృశ్య చరిత్ర గల వర్గంగా మారిపోదు. ఊరి బయట పల్లెలు కట్టుకొని

ఉన్నంత మాత్రాన వారికి తిండి పెట్టకుండా, నీళ్ళివ్వకుండా మాడ్చారనే ప్రచారం పూర్తి అవాస్తవికం. నాకు తెలిసి నీళ్ళ గొడవలన్నీ ఒకటికి కేటాయించిన బావుల్నీ, చెఱువుల్నీ ఇంకొకఱు వాడుకోవడం దగ్గఱ వచ్చినవే తప్ప, నీళ్ళు లేకుండా చేయడం వల్ల కాదు. ఊరి బయట పల్లెలు కట్టుకొని ఉన్నంతమాత్రాన వారికి తిండిపెట్టకుండా, నీళ్ళివ్వకుండా మాడ్చారనే ప్రచారం పూర్తి అవాస్తవికం. ఉదాహరణకు, ప్రాచీనాంధ్రదేశంలో మాలల్ని గ్రామాలకూ, పట్టణాలకూ, అగ్రహారాలకూ రాత్రి కాపలాదార్లుగా జీతమిచ్చి నియమించినట్లు శాసన సాక్ష్యాలున్నాయని **"ఆంధ్రుల చరిత్ర సంస్కృతి"** అనే పరిశోధన గ్రంథంలో డా|| అల్లాడి వైదేహిగారు వ్రాశారు. అంతెందుకు, మొన్నమొన్నటిదాకా మన రాష్ట్రంలో దక్షిణకోస్తా జిల్లాలలోని మాలలు అగ్రకులస్థుల వ్యావసాయిక ఎస్టేట్లకు కౌలుదార్లుగా ఎప్పట్నుంచో ఉన్నారు. కౌల్దారీ చట్టాలూ (Tenancy laws), తదితర నిరంకుశ భూసంస్కరణలూ అమల్లోకి రావడానికి ముందు వారిని అగ్రకులాలు కౌలు నుంచి తొలగించాల్సివచ్చింది. లేకపోతే వారు ఎప్పట్లాగానే ఆ ఎస్టేట్ల నిర్వాహకులు (managers) గా కొనసాగి ఉండేవారు.

అదీ గాక, పెద్దగా జనాభా లేకుండా, దేశమంతా ఖాళీగా అటవీమయంగా ఉన్న రోజుల్లో తమలాంటివారి సాహచర్యంలో అస్పృశ్యులుగా జీవించడం కూడా పెద్ద కష్టమైన విషయం కాదు. ఎందుకంటే సమాజంలోకి ప్రవేశం లేకపోయినా విస్తారమైన భూమీ, ఇతర వనరులూ ఆ కాలపు జనానికి అందుబాటులో ఉండేవి. భూమండలమంతా కుక్కల ముఱికిలాంటి జనాభా తో క్రిక్కిఱిసిపోయి, కలవారికే అన్నీ హక్కుభుక్తమైపోయిన ఈ కాలపు జనాల దురదృష్టంతో ఆ కాలపు స్వేచ్ఛాజీవుల జీవి తాన్ని పోల్చకూడదు. (Scheduled tribes) ఎస్టీలైతే అస్పృశ్యులు కానే కారు. వారు స్వచ్ఛందంగా అడవుల్లో పుట్టి పెఱిగి అక్కడే నివసిస్తామని కంకణం కట్టుకున్నవారు. వారు అస్పృశ్యులని ఏ ఆచారమూ, సంప్రదాయమూ చెప్పట్లేదు. అందుచేత వారందఱినీ భారతీయ సమాజం దూరంగా పెట్టేసిందన్న ప్రచారం వాస్తవం కాదు. అంతకంటే వారి భూభాగాల జోలికి పోకుండా, వారి సంస్కృతిలోనూ, జీవనాధారాల్లోనూ వేలుపెట్టకుండా, వారి నివాసప్రాంతాల్ని వారికే అట్టిపెట్టి ప్రాచీన భార తీయులు భద్రంగా కాపాడారనడం ఎక్కువ సమంజసం.

కానీ ఎలా చూసుకున్నా భారతదేశంలోని సాంకేతిక అస్పృశ్యుల జనాభా కోట్లల్లోనే ఉంటుంది. మన మధ్య ఇంతమంది అస్పృ శ్యులు ఎలా తయారయ్యారు ? ఎలా అస్తిత్వంలోకి వచ్చారు ? అని ప్రశ్నించుకుంటే, ప్రపంచంలోని వెనకబడ్డ/ పేదవర్గా లన్నిం టి లాగే అస్పృశ్యులక్కూడా తమ జనాభా పెఱుగుదల మీద అదుపు లేకపోవడం, తన్మూలకంగా అది ప్రతితరంలోనూ రెట్టిం చుకుంటూ పోవడం ఒక కారణం కావచ్చు. ఇహపోతే రెండో కారణం ఎవఱూ దృష్టి సారించనిది. అస్పృశ్యతా మూలాలకు సంబంధించినది. నాకు పేర్లు గుర్తులేవు కానీ, గత శతాబ్దంలో కొందఱు అగ్రకుల మేధావులే దాని గుఱించి ప్రస్తావించి కూడా ఏ కారణం చేతనో మఱీ నొక్కి వక్కాణించకుండా అంతటితో వదిలేశారు. వారన్నది - ఈనాటి అస్పృశ్య కులాల వారంతా ఒకప్పుడు ఏదో ఒక తప్పును పురస్కరించుకొని సమాజం నుంచి వెలివేయబడ్డ అగ్రకుల వ్యక్తుల వారసులు కావచ్చునని ! మన పురాణాల్లోనూ, కావ్యాల్లోనూ విఱివిగా ప్రస్తావించబడిన భ్రష్ట ద్విజుల వృత్తాంతాల్ని గమనంలో ఉంచుకున్నప్పుడు "ఈ అభిప్రాయం సరైనదే" అని నాక్కూడా అనిపిస్తున్నది.

దీని అంతరార్థం -ఈనాటి అస్పృశ్యులు ఒకనాటి స్పృశ్యులే. ఈనాటి నిమ్నులు ఒకనాటి ఉన్నతులే. వారిని భారతదేశ మూల మూలవాసులు (aboriginals) గానూ, ఆర్య దురాక్రమణల బాధితులుగానూ, అగ్రకులాల కంటే వేఱైన ప్రత్యేక మానవ జా

తులుగానూ ప్రచారం చేయడం ఒక భ్రమప్రమాద జనితమైన ఊహా, వ్యూహమే తప్ప ఆ ప్రచారానికి ఇప్పటి దాకా ఏ విధమైన శాస్త్రీయ ప్రాతిపదికా, చారిత్రిక ఆధారమూ (scientific basis/ historical evidence) లభించలేదు. ఈ ప్రచార నాటకానికి మొదట తెల్ల చరిత్రకారులు నాందీప్రస్తావన చేయగా తదనంతర కాలీనులైన కులనాయకులు తమతమ ప్రయోజనాల దృష్ట్యా దానికి వంతపాడడం సాగించారు. మఱి ఈనాటి నిమ్నుల రూపురేఖలు ఎందుకని అగ్రకులాలవారిలా లేవు ? అని అడిగితే, ఎలా ఉంటాయి ? ఈ వేడిదేశంలో ఎండనకా, వాననకా నిరంతరం కాయకష్టం చేసుకుని బ్రతికేవాళ్ళల్లో, దొఱికినదేదో తినీ, తినకా మనుగడ సాగించేవాళ్ళల్లో అందచందాలు యథాతథంగా నిలబడే అవకాశమేది ?

తప్పుచేసిన ప్రతివాణ్ణీ విచక్షణారహితంగా వెలివేస్తూ పోతే, అస్పృశ్యులుగా మారిస్తే ఏం జఱుగుతుందో కొన్నిలెక్కల ద్వారా గ్రహించవచ్చు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వారి గణాంకాల (stats) ననుసరించి మన దేశంలో ౨౦౦౮ వ సంవత్సరంలో వివిధ నేఱాలకు సంబంధించి ౧౦,౦౫,౭౬౧ మందిని నిర్బంధించగా వారిలో సుమారు 3,02,463 మందికి శిక్ష పడింది. మన కాలపు రీతి-రివాజుల ప్రకారం, ఆ శిక్షాకాలం ముగిసిపోయినాక వారంతా చెఱసాలల నుంచి విడుదలై యథాపూర్వం గా సర్వసాధారణమైన సామాజిక జీవితాన్ని గడుపుతారు. అదే, పాతపద్ధతిలో వారికా అవకాశం లేకుండా చేసి వెలివేస్తే ఏడాదికి మూడులక్షలమంది చొప్పున ఒక శతాబ్దం గడిచేసరికల్లా మనకు మూడుకోట్లమందో, వారి సంతతివారితో కూడా కలుపుకుని పదికోట్లమందో అస్పృశ్యులు తయారవుతారు. ప్రాచీన భారతదేశంలో ఇప్పుడున్నంత జనాభా గానీ నేఱాల శాతం (crime rate) గానీ లేదని ఒప్పుకున్నప్పటికీ, మొత్తం ఆఱులక్షల గ్రామాల్లో కేవలం తరాని కొక్కడు చొప్పున నేఱస్థుడై వెలి వేయబడితే చాలు, మూడువేల సంవత్సరాల వ్యవధానం లోపల ఇప్పుడున్నంతమంది అస్పృశ్యులు తయారు కావడానికి ! ఎందుకంటే, ౧౫ వ శతాబ్దంలో జీవించిన ప్రతిమనిషికీ సగటున ఇప్పుడు ౧౫ మంది వారసులున్నారని జనాభాశాస్త్రవేత్తలు చెబుతారు.

సరే ! ప్రతి సమాజంలోనూ తప్పులు చేసేవారు ఎంతో కొంతమంది సర్వకాల సర్వావస్థల్లోనూ ఉంటారు. వారిని చిన్నగానో, పెద్దగానో శిక్షిస్తే అంతటితో పోయేది కదా ? ఈ శాశ్వత వెలివేతలేమిటి ? అనే ప్రశ్న తలెత్తుతుంది. నిజమే, మన ప్రాచీన సమాజం చేసిన అత్యంత భయంకరమైన తెలివితక్కువ తప్పిదం అక్కడే ఉంది. లేకపోతే ఈరోజు దీని గుఱించి మనం మాట్లాడుకోవాల్సి వచ్చేది కాదు. ఐతే ఈ వెలివేత (సంఘబహిష్కారం-excommunication) అనేది పైకి కనిపిస్తున్నంత కొఱలోతు (shallow) పని కాదు. దీనివెనక అనేక ఇతరేతర అంశాలు సైతం బలంగా పనిచేసినట్లు కనిపిస్తున్నది. వాటి గుఱించి తరువాత వ్రాస్తాను.

ప్రాచీన భారతదేశంలో దోషుల్ని వెలివేయడం రెండురకాలుగా జఱిగేది. వాటిల్లో ఒకటి - మత/ సాంఘిక సంప్రదాయాల ఉల్లంఘనకు వెలివేయడం. రెండోది - స్థానికంగా హింసాత్మకమైన నేఱాలకు పాల్పడినందుకు వెలివేయడం. సంఘబహిష్కారమనే ఈ సంప్రదాయం అన్నికులాల్లోనూ ఉండేది. ఎందుకంటే ప్రతి కులానికీ స్థానికంగా ఒక కులపంచాయితీ ఉండేది. దాన్ని శ్రేణి అనేవారు. ఇవి మొన్నమొన్నటి దాకా కూడా ఉన్నాయి. దోషుల్ని ఆ కులపంచాయితీలలో విచారించేవారు. బ్రాహ్మణులకేమో ఎక్కడికక్కడ పండిత పరిషత్తులుండేవి. ప్రాచీన భారతదేశపు మౌలిక సదుపాయాల (infrastructure) లో కొట్టొచ్చినట్లు కానవచ్చే లోపం - ప్రభుత్వపరంగా స్థానిక న్యాయస్థానాలు గానీ, చెఱసాలలు గానీ లేకపోవడం. రాజ్య రాజ

ధానిలో మాత్రమే అలాంటివి ఉండేవి. అక్కడ పండితులైన బ్రాహ్మణులు ప్రాడ్వివాకులు (Judges) గా నియమించబడి నానారకాల వ్యాజ్యాల (cases) పై తీర్పులు తీటుస్తూండేవారు. జిల్లాల్లోనూ, గ్రామాల్లోనూ స్థానిక రెవిన్యూ అధికారులే వివిధ నేఱాలకు దండన విధించేవారు. ఆ దండనలు బహుక్రూరంగా ఉండేవి. హెచ్చుభాగం నేఱాలకు అవయవచ్ఛేదమో, మరణశిక్షో విధించేవారు. దండుగలు (penalties) ముమ్మరం. కారాగృహవాసం అఱుదు. చట్టబద్ధంగా వెళితే శిక్షలు ఇలా క్రూరంగా ఉండబట్టి కాబోలు, అది సహించలేక దోషుల్ని అధికారులకు అప్పజెప్పకుండా స్థానిక కులపంచాయితీలలోనే విషయాన్ని అనాధికారికంగా తేల్చే పద్ధతి గ్రామాల్లో వాడుకలోకి వచ్చి ఉంటుంది. నిజానికి కులపంచాయితీల తీర్పులకు ఇప్పటి మాదిరే అప్పుడు కూడా రాజామోదం లేదు. చట్టం దగ్గఱ అవి అనాధికారిక స్వమూర్తులు (unofficial entities) గానే జమ. కానీ పరంపరాగత సంప్రదాయాల్ని త్రోసిపుచ్చడం ఇష్టం లేక రాజులు వాటి కార్యకలాపాల్లో జోక్యం చేసుకునేవారు కారు. ఆ విధంగా వివిక్త (private) కులపంచాయితీలకు దోషుల్ని కఠినంగా, హింసాత్మకంగా శిక్షించే అధికారం లేకపోవడంతో వారెంచుకున్న శాంతియుత, రక్తపాతరహిత, దండనపద్ధతి ఈ వెలివేయడం.

వెలివేయడంలో కొన్ని పరిభావనలు దాగున్నాయి. ఒకటి - ఒకానొక దోషి గుఱించి "ఇహ ఏం చెప్పినా వీడు వినడు, బాగుపడడు, మన దారికి రాడు" అని నిశ్చయించుకున్నాక వెలివేయడం. రెండోది - మనిషి సంఘజీవి కనుక ఆ సంఘజీవితాన్ని అతనికి నిరాకరించి అతన్ని మానసికంగానూ, భౌతికంగానూ కష్టపెట్టడం. అయినవారికి అతన్ని దూరం చేయడం. అతనికి ఎవఱూ ఏ విషయంలోనూ సహకరించకుండా చేసి జఱుగుబాటు కూడా కష్టమయ్యేలా, పూర్తిగా నిష్ఠదరిద్రుడయ్యేలా చూడడం. సాంఘిక కట్టుబాట్లనీ, నీతినియమాల్నీ అతిక్రమిస్తే ఏం జఱుగుతుందో దానికి అతన్నీ, అతని కుటుంబాన్నీ ఒక సజీవ మచ్చుతునక (live specimen) గా తరువాతి తరంవారి ముందు కూడా నిలపడం. ఆ రకంగా సమాజంలోని ప్రతిసభ్యుడి ప్రవర్తననీ అదుపు చేయడం. ఇవన్నీ ఇప్పుడు కాదు గానీ ఆనాటి సమాజంలో సాధ్యమే. ఎందుకంటే రవాణా సౌకర్యాలు లేని పాతకాలంలో ప్రతివాడూ తాను పుట్టిపెఱిగిన పరిసరాలకు బందీ. ఆ పరిసరాల్లోని సమాజం చేతుల్లో కీలుబొమ్మ. సాధారణంగా మనుషుల్ని విడిగా కాకుండా కుటుంబసమేతంగా వెలేసేవారు. అదేమంటే, "అతను/ ఆమె తప్పుడు పన్లు చేయకుండా ఆపనందుకు" లేదా, "మీవాళ్ళు చెడిపోవడానికి మీ పెంపకమే కారణం కనుక" అనేవారు.

మనువు సంఘబహిష్కారాన్ని ఒకే ఒక్క చోట, తొమ్మిదో అధ్యాయంలో విధించాడు. అది కూడా మహాపాతకులకు మాత్రమే ! మహాపాతకులంటే - బ్రాహ్మణుణ్ణి చంపినవాడు, మద్యపానం చేసేవాడు, డబ్బు/ బంగారం దొంగిలించేవాడు, పెద్దల భార్యలను గానీ రక్తసంబంధీకులైన స్త్రీలను గానీ అనుభవించేవాడు. అయితే తాను విధించిన శిక్షను ఆయన సంఘబహిష్కారమనే పేరుతో పిలవలేదు. కానీ ఆచరణలో అది అదే.

*శ్లో// అసంభోజ్యా హ్యసంయాజ్యా అసంపాఠ్యా అవివాహినః /*
*చరేయుః పృథివీం దీనాః సర్వధర్మబహిష్కృతాః // (IX - ౨౩౭)*
*శ్లో// జ్ఞాతిసంబంధిభిస్త్వేతే త్యక్తవ్యాః కృతలక్షణాః /*
*నిర్దయా నిర్నమస్కారా స్తన్మనోరనుశాసనమ్ // (IX - ౨౩౮)*

*తా|| వారి కెవ్వఋూ భోజనం పెట్టకూడదు. వారితో కలిసి ఎవ్వఋూ ఏమీ ఉపాసించకూడదు. మిహతావారి పేర్లతో కలిపి వారి పేర్లు చదవకూడదు. వారి కెవ్వఋూ పిల్ల నిచ్చి పెళ్ళిచేయకూడదు. వారు అన్ని ధర్మకర్మాల నుంచీ వెలివేయబడి దీనులై, హీనులై, దేశద్రిమ్మరులై తిరగాల్సిందే. వారి నొసట వారి పాపాలకు అనుగుణంగా కాల్చిన ఎఱ్ఱటి ఇనప శలాకతో ముద్రలు వేసి వదిలిపెట్టాలి. జ్ఞాతులు గానీ, మేనమామ గానీ వారి అతీ గతీ పట్టించుకోకూడదు. వారిపట్ల దయాదాక్షిణ్యాలు చూపించకూడదు. వారికెవ్వఋూ నమస్కరించకూడదు. ఇదే ఈ మనువు చేస్తున్న అనుశాసనం.*

కానీ తరువాతి కాలంలో జనం అన్ని రకాల తప్పులకూ ఇదే మంత్రం పఠించడం మొదలుపెట్టారు.

## పదహాటో అధ్యాయం

మనుధర్మశాస్త్రం తరువాత పలు సహస్రాబ్దుల (millennia) కు వచ్చిన **ధర్మసింధువు** లాంటి గ్రంథాల్లో కూడా వెలివేయడానికి కొన్ని కారణాల్ని చూపించారు. ఉదాహరణకు - సగోత్ర వివాహం చేసుకున్న వారూ, అలాంటి దాంపత్యం ద్వారా పుట్టిన పిల్లలూ చండాలురవుతారని వ్రాశారు. అందుకని ఆ చండాలత్వ నివృత్తి కోసం ప్రాయశ్చిత్తాలు విధించారు. అలా ప్రాయశ్చిత్తం చేసుకోనప్పుడు వెలివేయడమే కర్తవ్యమని వారి అభిప్రాయంలా గోచరిస్తోంది. వాస్తవానికి మనుస్మృతిలో చండాల శబ్దానికిచ్చిన నిర్వచనం - బ్రాహ్మణస్త్రీకీ, శూద్రపురుషుడికీ జన్మించిన సంతానమని ! సగోత్ర వివాహాన్ని మతదృష్టితో చూడాలో, వైజ్ఞానిక దృష్టితో చూడాలో నాకు తెలియదు. ఏతావతా సగోత్ర వివాహాలు ఆమోదయోగ్యమా ? కాదా ? అనే విషయంలో నాకు ఎటూ పాలుపోదు. సగోత్రికులైన స్త్రీపురుషులు అన్నాచెల్లెళ్ళ లాంటి వారని ఒక అవగాహన. ఈ గోత్రాలు ఒక్కొక్కటీ మిలియన్లాది జనాభా కలిగినవి. ఏ సంబంధమూ లేని మిలియన్లాది మంది ఇన్ని సహస్రాబ్దుల తరువాత అన్నాచెల్లెళ్ళవుతారా ? అని కొంతమంది సందేహం వెలిబుచ్చుతారు. అయితే వైజ్ఞానిక దృష్టితో చూసినప్పుడు సగోత్రత్వ దోషం సాపిండ్యదోషాన్ని తలదన్నేది కాదనిపిస్తుంది. ఎందుకంటే మనలో మేనటికాలు అలాంటి సాపిండ్యదోషం కలిగినవి. ఒక్కొక్క గోత్రమూ పైకి ఒక్క ఋషి పేరుతోనే వ్యవహృతం అవుతున్నప్పటికీ వాస్తవంగా ఇద్దటో, ముగ్గుటో, నలుగుటో ఇతర ఋషులు కూడా ఆ గోత్రానికి గోత్రఋషులుగా ఉంటారు. అంటే ఆ ఇతర ఋషుల గోత్రాలతో కూడా సంబంధం నిషిద్ధం. ఇహ బ్రాహ్మణులకు పెళ్ళయ్యే అవకాశమేది ? అందుచేత పెళ్ళికూతుళ్ళు దొఱక్క ఎక్కడో అరుదుగా దొటికిన అమ్మాయి గోత్రాన్ని రహస్యంగా ఉంచి చేసేసుకునే సంభావ్యతని త్రోసిపుచ్చలేం. నూఱు అబద్ధాలాడి అయినా ఒక పెళ్ళి చేయమన్నారు గదా ! అలాంటివారు ఆచారవంతులైన పెద్దలకు అడ్డంగా పట్టుబడినప్పుడు ఉపయోగపడేవన్నమాట ఈ ప్రాయశ్చిత్తకాండలు !

వెలివేయడమనే దండనాచర్య (penal action) ఎల్లవేళలా ఇందాక పేర్కొన్న మంచి ఉద్దేశాలతో జటిగినది కాదని ౧౪ వ శతాబ్దికి చెందిన **శ్రీపాద శ్రీవల్లభ చరితామృతం** అనే గ్రంథం ద్వారా తెలియవస్తోంది. ఆ గ్రంథంలో - శ్రీపాద శ్రీవల్లభ

స్వాములవారి మాతామహులైన బాపనార్యుల్ని వ్యక్తిగత కక్షల మూలంగా కుటుంబంతో సహా కులంలోంచి వెలివేయడానికి ఆనాటి బ్రాహ్మణసంఘం శాయశక్తులా ప్రయత్నించి విఫలమైన వైనం గురించి విపులంగా వర్ణించబడింది. ఈ విధంగా గ్రామ కక్షల్ని పురస్కరించుకునీ, స్థానిక రాజకీయాల నిమిత్తంగానూ, విద్యా వృత్తిపరమైన స్పర్ధల కారణంగానూ, కొన్ని మంచి కుటుంబాల్ని కూడా ఏదో ఒక తప్పుడు అభియోగం (charge) లో ఇరికించి, బహిరంగ పంచాయితీలో నిలబెట్టి ఆఖరికి కులంలోంచి వెలివేయించేవారని అర్థమవుతున్నది.

అంటరానితనపు దృక్పథాన్ని ౪ రకాలుగా వివరించవచ్చు.

**౧. శౌచ/ ఆచార కోణం**

**౨. సంస్కారకోణం**

**౩. సామాజిక కోణం**

**౪. ధార్మికకోణం**

***౧. శౌచ/ ఆచారకోణం :*** లోకంలో మతాచారాన్నీ, ధర్మాన్నీ నమ్మి అనుసరించేవారంతా తరచుగా చేసే తప్పిదం - ఇతరుల ఆచారాన్నీ, ధర్మపరాయణతనీ ఆక్షేపించడం, వారిని విమర్శించడం, వారితో పోల్చుకొని వారి కంటే తాము మెరుగ్గా ఉన్నామని స్వోత్కర్షకు పోవడం. అందులోనూ ఆ ఇతరులు ఆర్థికంగానూ, విద్యాపరంగానూ తమ కంటే తక్కువస్థాయి వారైనప్పుడు వారిపట్ల చులకనభావం మరింత ఇనుమడిస్తుంది. కానీ ఇందులో జరిగిన పొరపాటేమిటంటే - ఆయా లోటుపాట్లని ఆయా సామాజిక వర్గాలకు చెందిన సభ్యుల వ్యక్తిగత దోషాలుగా ఆనాటి ఉన్నతవర్గ సమాజం తీసుకోలేదు. మూకుమ్మడిగా తీసుకొని వారికొక సామూహిక ముద్ర వేశారు. నిమ్నవర్గాల్ని మార్చడం అంటే సృష్టినే తలకిందులు చేయడమవుతుందనీ, సమాజం అల్లకల్లోలమైపోతుందనీ భయపడ్డారు. కారణం - పూర్వీకులకు చరిత్ర తెలియదు. సామాజిక పరిణామక్రమం అంతకంటే తెలియదు. సంఘసంస్కరణ అనే పరిభావన బొత్తిగా శూన్యం. ప్రతివాడికీ తన గ్రామం, తన వంశం, మహా అయితే తన తాతల కాలం వరకు లోకం ఎలా ఉండేదో తెలిసేది. అంతకు మించి పోగలిగేవారు కారు. మనిషికున్నట్లే మానవజాతికీ ఒక అమాయక బాల్యం ఉంది. ఈ తెరుగు ఆలోచనలన్నీ ఆ బాల్యంలో భాగం.

***౨. సంస్కారకోణం :*** పెద్దగా విద్యాగంధం లేకుండా, లేమితో బాధపడుతూ, చేతిపనులు చేసుకుని బ్రతికేవారంటే పైవర్గాలకు ఎల్లవేళలా చిన్నచూపే. పైగా వాటితో పాటు ఆ పేదవారిలో నిత్య త్రాగుళ్ళూ, అక్రమ తిరుగుళ్ళూ మొదలైనవి కూడా ప్రచురంగా ఉన్నాయనుకోండి, ఆ ప్రవర్తనకు వారి కులపెద్దల నుంచి సామాజిక దండన ఏమీ లేదనుకోండి. అప్పుడు అలాంటివి ఆ వర్గాలకు తప్పుకాదేమోననే అపోహ మిహతా సామాజికవర్గాలలో కలుగుతుంది. అలా వారిని మురికిజీవులుగా, అపవిత్ర "వర్గాలు"గా భావించి దూరంగా పెట్టడం ఒక సంభావ్యత.

***3. సామాజిక కోణం :*** వెలివేయడం ఏ విధంగా అస్పృశ్యతకు దారితీసిందో, రెంటికీ మధ్య సంబంధం ఏమిటో అర్థం చేసుకోవాల్సి ఉంది. సంప్రదాయ ఉల్లంఘనలే కాదు, సాధారణ నేరాల్ని కూడా మన పూర్వీకులు లౌకిక దృష్టితో వీక్షించి ఉండకపోవచ్చు. నేరాల్ని అసత్ప్రవర్తనగా కాక, మతోల్లంఘనగా, దైవద్రోహంగా చూశారు. అందుచేత నేరస్థులు అపవిత్రులనీ, వారిని ఎవరూ తాకకూడదనీ భావించారు. ఈ తాకకపోవడమనే పరిభావనని సన్న్యాసుల నుంచి అరువు దెచ్చుకొని దాన్ని నేరస్థులకు అన్వయించారు. మనుషులు మారడానికి అవకాశం ఉందనే వాస్తవాన్ని వారెన్నడూ విశ్వసించలేదు. కనీసం తరం మారినా మనుషులు మారతారనేదీ విశ్వసించలేదు. శిక్ష ద్వారా మారతారని కూడా నమ్మలేకపోయారు. కారణం - అలా జరుగుతుందని చెప్పిన వాక్యాలేవీ మతగ్రంథాలలో కనిపించకపోవడమే. రాజు కొడుకు రాజే, ఋషి కొడుకు ఋషే, దొంగ కొడుకు దొంగే అని నమ్మారు. ఒకడు చెడిపోతే వాడితో సహా వాడి కుటుంబమంతా, వంశమంతా చెడిపోయినట్లేనని భావించారు. వారిని సమాజానికి దూరంగా పెట్టడం ద్వారా సమాజాన్ని ప్రక్షాళన చేశామనీ, సమాజంలో శాంతినీ, క్రమాన్నీ తిరుగా నెలకొల్పామనీ తలచి తృప్తిచెందారు. అంతే తప్ప మనుషులు చెడిపోవడానికి కారణాలేంటని ప్రశ్నించుకోలేదు. చెడి పోయినవారిని మానవప్రయత్నంతో సంస్కరిద్దామనీ అనుకోలేదు. అలా ఎవరైనా అనుకోవాలంటే వారిలో కాస్తో కూస్తో లాలనధోరణి అవసరం. మన పూర్వసమాజాలేమో పచ్చి ఫ్యూడల్ తత్త్వం కలిగినవి. అందరికీ రాజుల కాఠిన్యమూ, పొగరు మోత్తనమే ఆదర్శంగా ఉండేవి. అందుకని ఎవడి స్థాయిలో వాడు నిరంకుశాధికారం ప్రదర్శిస్తూండేవాడు. గ్రామస్థాయిలో గ్రామాధికారులూ, గురువుల స్థాయిలో గురువులూ, కుటుంబస్థాయిలో భర్తలూ... ఇలాగన్నమాట. అందుచేత ఎంత క్రూరంగా వ్యవహరిస్తే అంతగా సమాజాన్ని దారిలో పెడుతున్నట్లు భావించుకునేవారు. అదే సమయంలో మన పూర్వీకుల్ని కికురించడం చాలా సులభం. దొరల్లా కనిపించే దొంగలూ, దొంగలుగా ముద్రవేయబడే దొరలూ ఉంటారనీ, అసలైన దొంగలు తమ మధ్యనే తిరుగుతున్నారనీ ఆనాటివారికి ఇంకా తెలియదు. జనంలో ఆ పరిజ్ఞానం అనేక శతాబ్దాల తరువాతనే, అనేక అనుభవాలతో ముఖం బద్దలయినాకనే వచ్చింది. రెండోది, ఒక మనిషికి ఒక అనిష్టలక్షణం మాత్రమే ఉంటే అనేకమైన ఇతరేతర అవలక్షణాల్ని కూడా అతనికి ఆపాదించి అందరి దృష్టిలో అతన్నొక దుర్మార్గుడుగా, లోకకంటకుడుగా మార్చే దుర్గుణం ఉండేది పూర్వసమాజాల్లో ! ఇప్పటికీ ఉంది.

***4. ధార్మిక కోణం :*** ఒక వ్యక్తి పూజలో ఉండగా ఇతరులు అలా లేనప్పుడు ఆ పూజ చేస్తున్న కాసేపూ అతను వారికి దూరంగా ఉండొచ్చు. మిహతా సమయాల్లో వారితో యథాప్రకారం కలిసిపోవచ్చు. ఇదొక సాధారణ నడవడి. కానీ అంట రానితనంలో జరిగింది ఇది కాదు. కొన్నికొన్ని మానవ సమూహాలకు శాశ్వతమైన మైల. అలాగే కొన్నికొన్ని సమూహాలకు శాశ్వతమైన మడి. ఈ మడీ, మైలా ఎంత సుదీర్ఘకాలం పాటు కొనసాగాయంటే, ఎంతగా జీర్ణించాయంటే, అసలవి ఎప్పుడు, ఎందుకు, ఎలా వచ్చాయో కూడా అందరూ మర్చిపోయారు, కానీ గుడ్డిగా కొనసాగించారు. కారణం, పూర్వీకులు సాంగత్య/ సహవాస దోషానికి అవసరమైనదాని కంటే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఆపాదించారు. తాకడం సంగతలా ఉంచి, దోష స్వభావుల్ని అసలు చూడడమూ, మాట్లాడడమే పుణ్యఫలాన్ని, చిత్త పరిశుద్ధినీ హరించివేస్తాయనీ, వారి దుష్టసంస్కారాలు తమకూ్కడా అంటుకుంటాయనీ, అవి జన్మజన్మలకూ వెంటొస్తాయనీ, దైవాగ్రహానికి గురవుతామనీ, మోక్షం దూరమై పోతుందనీ అనవసరంగా బెంబేలెత్తిపోయారు. లేదా వారినలా బెంబేలెత్తించారు మతాచార్యులు. ఎల్లాయిని ముట్టుకు

న్నంత మాత్రాన పుల్లాయి ఎన్నటికీ ఎల్లాయి కాలేడనీ, ముట్టుకోనీ, ముద్దు పెట్టుకోనీ, ఎల్లాయి ఎల్లాయే, పుల్లాయి పుల్లాయేననీ గుర్తించలేకపోయారు. అదొక నిస్సహాయ పరిస్థితి. ఆ సమాజాలు బహు చిన్నవి. వారు మనలాగా రోజూ వంద లాదిమందినీ, వేలాదిమందినీ చూసినవారు కారు. వారి మనసులు బహు ఇఱుకు. భయాలు జాస్తి.

కులపంచాయితీల ద్వారానూ, వెలివేతల ద్వారానూ పూర్వీకులు చేసిన పని - దేవుడి చెప్పుల్లో కాళ్ళుపెట్టడం. ఎవఱు పవిత్రులో, ఎవఱు అపవిత్రులో ఎవఱు నిర్ణయించగలరు ? అందఱూ సమానంగా బలహీనతలు గల మానవులే అయిన ప్పుడు ఒక మానవుడి మీద ఇంకో మానవుణ్ణి కాపలా పెట్టడం, లేదా తీర్పరిగా నియమించడం చరిత్రలో ఎప్పుడైనా సత్ఫలితాలిచ్చిందా ? అన్నీ పిల్లులే అయినప్పుడు ఒక పిల్లి ఎలుకని తినకుండా దాని మీద ఇంకో పిల్లిని కాపలా పెట్టడం వల్ల ప్రయోజనమేమైనా ఉందా ? ఆనాటి వెలివేతల బారిన పడకుండా కులాన్ని కాపాడుకుని బ్రతికిపోయినవారంతా పవిత్రులేనని చెప్పగలమా ? లేక వారి ఆధునిక వారసుల రక్తమంతా సందేహాల కతీతంగా పరిశుద్ధమేనని నొక్కి వక్కాణించగలమా ?

ఇదివఱకు తాము ఒక మార్గంలో పోగొట్టుకున్నదాన్ని నిమ్నవర్గాలు ఇప్పుడు తిరిగి ఇంకో మార్గంలో పొందుతున్నారు. ఒక ప్పుడు తాము వాస్తవంగా ఏదైతే అయి ఉన్నారో ఆ బ్రహ్మమూర్తిమత్త్వాన్నే తిరిగి ఆర్జించుకుంటున్నారు. మనం ఎవఱినైతే అసహ్యించుకొని, ద్వేషించి వదిలించుకుందామని చూస్తామో వారే ఏదో ఒకరోజున మఱో రూపంలో, మఱో మార్గంలో మన జీవితాల్లో ప్రవేశిస్తారనీ, కనుక మనం ఎవఱినీ వదిలించుకోలేమనేదీ, తప్పించుకోలేమనేదీ ఈ వెలివేతలూ, అస్పృశ్యతలూ మనకు నేర్పుతున్న చారిత్రిక గుణపాఠం కావచ్చు. ఈపరిణామాల్ని నేను ఈ కోణంలోంచి చూస్తాను. ఈ ప్రక్రియ ప్రతి చర్యాత్మకం (reactionary) గా కాక చర్యాత్మకం (actionary) గా కొనసాగుతుందని ఆశిస్తాను. ఇందులో ఎవఱిమీదా కక్ష సాధించడానికేమీ లేదు. నిమ్నత్వానికి కారణమైన ఇదివఱకటి ప్రాసంగిక దోహదాలేవీ ఇహ ఎంతమాత్రమూ ఉనికిలో లేవు. ఆ మనుషులూ ఇప్పుడు బ్రతికిలేరు. ఇప్పుడున్నవారేమో ఈ ప్రక్రియకి వ్యతిరేకులు కారు. **అందుచేత** ఒకటి అభ్యుత్థానం ఇంకొకటి పరాజయంగా వర్ణించడం తార్కికం కాదు. అంతకంటే భిన్నంగా, అందఱూ విద్యావివేక సంస్కారాల ద్వారా బ్రాహ్మ ణత్వం వైపే పయనిస్తున్నారని చెప్పుకోవడం సరైన చరిత్రభాష్యమవుతుంది.

